అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 24-01-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 8 | సంచిక : 339 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50



ముంబయి: నావల్ డాక్‌యార్డ్‌లో ఐఎన్ఎస్ వగీర్ జలాంతర్గామి ప్రారంభోత్సవంలో నౌకాదళ అధికారులు ..భారత చరిత్రలో అత్యంతవేగంగా తయారైన సబ్‌మెరిన్ ఇది..

ఇక పస్తులే...



ఆహార భద్రతకు మోడీ సర్కార్ తూట్లు

కోవిడ్-19 సంక్షోభం తర్వాత కోట్లాది కుటుంబాలు పేదరికంలోకి కూరుకుపోయాయి. నెలవారీ ఆదాయం గల్లంతైంది. దీంతో 2021లో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులు అనూహ్యంగా పెరిగాయి. మోడీ సర్కార్ అనుసరిస్తున్న విధానాల వల్ల ఎక్కడా కూడా కొత్త రేషన్ కార్డుల జారీ చేపట్టడం లేదు. దాంతో కోట్లాది కుటుంబాలు ప్రజా పంపిణీ వ్యవస్థ పరిధిలోకి రాకుండా పోతున్నారని ఆర్థిక నిపుణులు జీన్ డ్రెజ్, రితికా ఖేర్ పలు నివేదికలు విడుదల చేశారు. ఆర్టీఐ దరఖాస్తుకు విడుదలైన ప్రభుత్వ సమాచారం ప్రకారం, ఒక్క ఢిల్లీ నగరంలోనే రేషన్ కార్డుల దరఖాస్తులు 2,93,184 పెండింగ్‌లో ఉన్నాయని తెలిసింది. జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని ప్రస్తుత జనాభాకు, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా అమలుజేయనందు వల్లే కోట్లాది మంది పేదలు నష్టపోతున్నారని ఆర్థిక నిపుణులు విశ్లేషించారు.



- 2021 జనగణన వాయిదా.. కొత్త రేషన్‌కార్డుల జారీ నిలుపుదల
- ఒక్క ఢిల్లీ నగరంలోనే 2,93,184 దరఖాస్తులు పెండింగ్
- పీడీఎస్ మరింత విస్తరించాలని ఆర్థికవేత్తలు సూచన
- గణాంకాల్లేవని 10 కోట్లమందికి కేంద్రం మొండిచేయి



న్యూఢిల్లీ : రైట్ టు ఫుడ్ ప్రచారకురాలు, సామాజిక కార్యకర్త అమిత్రా జోహ్రా మాట్లాడుతూ, "కేంద్రం 2011 జనాభా లెక్కల్నే ఇప్పటికీ చూపుతోంది. వాస్తవానికి పీడీఎస్‌ను విస్తరించాలన్న ఉద్దేశం కేంద్రానికి లేదు. జనాభా పెరుగుదల సూచికలను పరిగణనలోకి తీసుకోవాలి. ఉదాహరణకు ఈ-శ్రమ్ పోర్టల్‌లో 28కోట్ల మంది పేర్లు రిజిష్టర్ అయ్యాయి. ఇందులో రేషన్ కార్డులు లేనివారికి ఇవ్వొచ్చు. గణాంకాలు లేవని కొత్త రేషన్ కార్డుల జారీ చేపట్టకపోవటం అమానవీయ"మని అన్నారు.జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) 2013లో అమల్లోకి వచ్చింది. దేశంలో ఆహార అభద్రత సమస్యను పరిష్కరించటం కోసం ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. ఆనాటి పాలకులు ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. ఇప్పటివరకు ఉన్న అధికారిక గణాంకాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 75శాతం జనాభా పీడీఎస్ పరిధిలోకి వస్తోంది. పట్టణ జనాభాలో 50శాతం మందికి వర్తిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పీడీఎస్‌ను అమలుజేయాలని చట్టంలో పేర్కొన్నారు. ఆహార ధాన్యాల్ని కేటాయించే బాధ్యత కేంద్రానిదైతే, లబ్దిదారులను గుర్తించటం, పథకాన్ని సమర్థంగా అమలుజేయటం రాష్ట్రాల బాధ్యత. ప్రస్తుతం దేశంలోని 81.34కోట్ల మంది ఆహార భద్రతా చట్టం కిందకు వస్తున్నారు. అయితే దేశంలో ఎంతోమంది పేదలకు ...9లో

ఆకలి సూచికలు చెబుతున్నా...పట్టదా?

మోడీ సర్కార్ తీరు వల్ల భారత్‌లో ఆకలి సమస్య తీవ్రస్థాయికి చేరుకుందని ఆర్థిక నిపుణులు ఆరోపిస్తున్నారు. అందువల్లే ప్రపంచవ్యాప్తంగా పలు సూచికల్లో భారత్ ర్యాంక్ దిగజారుతోందని చెబుతున్నారు. ముఖ్యంగా ప్రపంచ ఆకలి సూచికలో భారత్‌ను 'అత్యంత తీవ్రమైన' కేటగిరిలో చేర్చింది. ఉదాహరణకు ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, హైదరాబాద్ వంటి మహా నగరాల్లో జనాభా అనూహ్యంగా పెరిగింది. ఇందులో పేద కుటుంబాలకు చెందినవారు ఎక్కువగా ఉన్నారు. 2011 జనాభా లెక్కలను అడ్డుపెట్టుకొని కేంద్రం పథకాన్ని అమలుజేస్తున్న తీరును సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఎన్ఎఫ్ఎస్ఏ పరిధిని ఇప్పుడు విస్తరించాల్సిన అవసరం లేదంటూ మోడీ సర్కార్ సుప్రీంలో అఫిడవిట్ కూడా దాఖలు చేసింది.

కార్పొరేట్లకు అడవులు

ధారాదత్తం

అటవీ హక్కుల్ని కాలరాస్తే ఉద్యమమే..

- ఆదివాసీ,అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ



మాట్లాడుతున్న మిడియం బాబురావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలోని అడవులను కార్పొరేట్లకు ధారాదత్తం చేయాలని కేంద్ర ప్రభుత్వ చూస్తున్నదనీ, అటవీ హక్కుల చట్టాలను ఉల్లంఘిస్తే ఉద్యమం తప్పదని ఆదివాసీ అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ నేతలు హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో మాజీ ఎంపీ, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కన్వీనర్ డాక్టర్ మిడియం బాబురావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయ కమిటీ కన్వీనర్ వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ దేశంలోని అడవులను కార్పొరేట్లకు ధారాదత్తంచేస్తూ,అటవీ హక్కులను కాలరాస్తూ,మోడీ ప్రభుత్వం తెచ్చిన అటవీ సంరక్షణ నియమాలు-2022ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అటవీ హక్కుల చట్టం అమలు ఎండమావిగా మారిందని ఆరోపించారు. ఎనిమిదేండ్లుగా ఈ చట్టాన్ని అమలు చేయలేదని చెప్పారు. 2021 నవంబర్,డిసెంబర్ నెలలో అర్జీలు తీసుకుని ఏడాది గడిచినా వాటి పరిశీలన నేటికీ ఎందుకు పూర్తికాలేదో చెప్పాలన్నారు. పైగా చట్టాన్ని వక్రీకరించి ఉపగ్రహ ఛాయాచిత్రాల ప్రాతిపదికగా అర్జీలు తిరస్కరించడం చట్ట వ్యతిరేకమని చెప్పారు. మిడియం బాబూరావు మాట్లాడుతూ అటవీ సంరక్షణ నియమాలు-2022 అటవీ హక్కుల చట్టాన్ని, నియమాలను,ఉల్లంఘిస్తున్నాయని చెప్పారు. వాటి అమలును ఆపాలని కోరుతూ 26-9-2022న జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్, కేంద్ర పర్యావరణ, అడవుల మంత్రిత్వ శాఖకు ఒక లేఖ రాసిందని తెలిపారు. దీనికి జవాబుగా రాసిన వివరణలు జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ లేవనెత్తిన అటవీ హక్కుల చట్టం ఉల్లంఘనలను దాటవేస్తూ, అటవీ సంరక్షణ నియమాలు-2022 ను గుడ్డిగా , మొండిగా 10-11-2022న సమర్థించు కోవటాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ల అనుకూల చట్టాలను, విధానాలను ...9లో

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

2.73 శాతం డీఏ మంజూరు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు, ప్రభుత్వ ఉద్యోగులకు, పింఛనర్లకు కరువు భత్యం (డీఏ/డీఆర్) 2.73 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతమున్న 17.29 శాతాన్ని, 20.02 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 4.40 లక్షల మంది ఉద్యోగులు, 2.88 లక్షల మంది పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు. 2021, జులై నుంచి రాష్ట్ర ప్రభుత్వం డీఏ చెల్లించనుంది. జనవరి ఫించనుతో కలిపి పింఛనుదారులకు ఫిబ్రవరిలో డీఏ చెల్లించనుంది. 2021 జులై నుంచి 2022 డిసెంబర్ నెలఖారు వరకు బకాయిలు చెల్లించనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.



వివరాలు 2లో

ఒక శాతం చందాతో నగదు రహిత

వైద్యమందించాలి

మంత్రి హరీశ్ రావుకు టీఎన్జీవో వినతి

మతోన్మాద మూకదాడులపై

ఆగ్రహం

అభ్యుదయవాదులు, టీచర్లు, నాస్తికులపై దాడులను అరికట్టాలి

- స్వేచ్ఛ జేఏసీ ఆధ్వర్యంలో మానవహారాలు
- దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



నవతెలంగాణ- విలేకరులు

అభ్యుదయవాదులు, అంబేద్కర్ వాదులు, టీచర్లు, హేతువాదులు, నాస్తికులపై రాష్ట్రంలో మతోన్మాదుల మూకదాడులపై ఆగ్రహం పెల్లుబికింది. దుండగులను కఠినంగా శిక్షించాలని, బాధితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని ఎత్తివేయాలనీ, జైల్లో ఉన్న వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్వేచ్ఛ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపులో రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు.సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఐబి వద్ద సీపీఐ(ఎం), సామాజిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ...9లో

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 27వ తేదీ నుంచి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో బదిలీలు, పదోన్నతులపై సాధారణ పరిపాలన శాఖ గతంలో నిషేధం విధించింది. ఈ మేరకు జీవో-91ను జారీచేయగా, ఈ నిషేధాన్ని ఎత్తివేస్తూ ...9లో



హైదరాబాద్‌లో అమెజాన్ కార్గో సేవలు

రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు : మంత్రి కేటీఆర్ వెల్లడి

వివరాలు 2లో

అండమాన్ దీవులకు పరమ్ వీర్ చక్ర గ్రహీతల పేర్లు

న్యూఢిల్లీ : అండమాన్ నికోబార్‌లోని పేర్లు లేని 21 దీవులకు నామకరణం జరిగింది. ప్రధాని మోడీ ఈ దీవులకు పరమ్ వీర్ చక్ర గ్రహీతల పేర్లు పెట్టారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మదినం సందర్భంగా పరాక్రమ్ దివస్ ను పురస్కరించుకొని ఈ పేర్లు పెట్టారు. అలాగే, నేతాజీ గౌరవార్థం ఒక జాతీయ స్మారకం నమూనాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా పాల్గొన్నారు.

అండమాన్ దీవుల్లో పేరులేని పెద్ద దీవికి మొదటి పరమ్ వీర్ చక్ర గ్రహీత మేజర్ సోమ్‌నాథ్ శర్మ పేరుతో నామకరణం చేశారు. కరమ్ సింగ్, రానే, జాదునాద్, పీరూ, సలారియా, ధన్ సింగ్, జోగిందర్, షైతాన్ సింగ్, హమీద్, తారాపోర్, ఎక్కా, హోషియార్, ఖేత్రపాల్, సెఖోన్, రామస్వామి, బాన, బాత్ర, పాండే, సంజయ్, యోగేంద్ర.. ఇలా 21 దీవులకు 21 మంది పరమ్ వీర్‌చక్ర అవార్డు గ్రహీతల పేర్లు నామకరణం చేయబడ్డాయి. ఈ మేరకు ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ) కూడా ఒక ప్రకటనను విడుదల చేసింది.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

- పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- 13 భాషల్లో ఎగ్జామ్ నిర్వహణ

న్యూఢిల్లీ : జాతీయ స్థాయిలో జరిగే ఇంజినీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ జేఈఈ మెయిన్-2023 సెషన్-1 పరీక్షలు నేటి నుంచి మొదలు కానున్నాయి. ఫిబ్రవరి 1 వరకు నిర్ణీత తేదీలలో సాగనున్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లోని పరీక్ష కేంద్రాల్లో ఎన్‌టీఏ ఏర్పాట్లను పూర్తి చేసింది. లక్షలాది మంది హాజరుకానున్న ఈ పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులను ఎన్‌టీఏ విడుదల చేసింది. పరీక్ష తేదీలను బట్టి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా అధికారులు అభ్యర్థులకు సూచించారు. జేఈఈ మెయిన్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ జెఈఈమెయిన్.ఎన్‌టీఏ.ఎన్ఐసీ.ఇన్ ద్వారా అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ పరీక్షలను ఇంగ్లీష్, హిందీ, తెలుగుతో పాటు అస్సామీ, బెంగాలి, గుజరాతీ, కన్నడ, మలయాళం, మారాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, ఉర్దూ.. ఇలా మొత్తం 13 భాషల్లో నిర్వహించనున్నారు. జేఈఈ మెయిన్‌లో మొత్తం రెండు పేపర్లు ఉంటాయి. మొదటి పేపర్ ద్వారా ఎన్ఐటీ లు, సీఎఫ్‌టీఐలు, ఐఐటీలలో బీఈ, బీటెక్ వంటి అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పించనున్నారు. బీఆర్క్, బీప్లానింగ్ కోర్సులలో ప్రవేశాలను పేపర్-2 ద్వారా కల్పించనున్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సూచనలను పాటించాల్సిందిగా అధికారులు తెలిపారు.

గొర్లకాపర్లకు జీఎంపీఎస్ డైరీ ఎంతో ఉపయోగం

- డైరీ ఆవిష్కరణలో మంత్రి తలసాని వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గొర్రెలు, మేకల పెంపకందారులసంఘం (జీఎంపీఎస్) రూపొందించిన డైరీ...గొర్లకాపర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జీఎంపీఎస్ డైరీ-2023ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీఎంపీఎస్ నేతలను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గొర్లకాపరులకు, ప్రభుత్వానికి మధ్య ఈ డైరీ వారధిగా ఉంటుందని తెలిపారు. గొర్లు, మేకలకు ఏ నెలలో ఎలాంటి వ్యాధులు వస్తున్నాయో, ఎలాంటి మందులు వాడాలో డైరీలో ముద్రించడం మంచి పరిణామమన్నారు. వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న ఆవులు, గొర్రెల కాపరులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం 3.94 లక్షల యూనిట్ల గొర్రెలను పంపిణీ చేసిందనీ, తద్వారా గొల్లకురుమల కుటుంబాల్లో వెలుగులు నింపిందని చెప్పారు. ఈ పథకం కోసం రూ ఐదువేల రూపాయలను ఖర్చు చేశామన్నారు. రెండో విడత పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నదన్నారు. గొర్లకాపరులు కిందిస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కిల్లె గోపాల్, ఉడుత రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు అమీర్ పేట్ మల్లేష్, బొల్లం అశోక్, అవిశెట్టి శంకరయ్య, కాడబోయిన లింగయ్య, తుషాకుల లింగయ్య, సాదం రమేష్, కాల్వ సురేష్, ఎక్కలదేవి కొమురయ్య, బి.శ్రీనివాస్, చేపూరి ఓదెలు, కడెం లింగయ్య, శాతవేణి రమేష్, మోటె దేవేందర్, పయ్యావుల మల్లయ్య, గౌర శ్రీశైలం, కె.యాకయ్య, వి.రమేష్, జి. సమ్మయ్య, కె.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులను ప్రజలు పరిశీలిస్తూనే వుంటారు

- తీర్పులతోటే వారిపై అభిప్రాయం
- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలు





న్యూఢిల్లీ : న్యాయమూర్తులు ఎన్నికవరు కాబట్టి వారు ప్రజల సునిశితమైన పరిశీలనను ఎదుర్కొనరని, కానీ ప్రజలు వారిని పరిశీలిస్తూనే వుంటారని, వారిచ్చే తీర్పుల ద్వారా వారిని అంచనా వేస్తారని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు సోమవారం వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థ, ప్రభుత్వం మధ్య మాటల యుద్ధం జరుగుతున్న వేళ ఇక్కడ తీస్ హజారి కోర్టు కాంప్లెక్స్ నిర్వహించిన రిపబ్లిక్ డే కార్యక్రమంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. సామాజిక మాధ్యమాల కారణంగా సాధారణ పౌరులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని, ఆ క్రమంలో ప్రభుత్వం దాడికి గురవుతోందని, ప్రశ్నించబడుతోందని అన్నారు. "ప్రజలు మమ్మల్ని మళ్ళీ ఎన్నుకుంటే, మేం తిరిగి అధికారానికి వస్తాం, లేదంటే ప్రతిపక్షంలో కూర్చుంటాం, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని" అన్నారు. అదే సమయంలో ఒక వ్యక్తి న్యాయమూర్తి అయినట్లైతే, ఆయన ఎన్నికలను ఎదుర్కొనక్కర్లేదని, న్యాయమూర్తులపై బహిరంగ పరిశీలన వుండదని అన్నారు. "ప్రజలు వారిని ఎన్నుకోనందున, వారిని మార్చలేరు, కానీ ప్రజలు మీరేం చూస్తున్నారో చూస్తూనే వుంటారు, మీరు తీర్పులిచ్చే తీరు, పద్ధతి, మీ తీర్పులు ఇలా అన్నీ పరిశీలించబడతాయి. ఇవన్నీ చూస్తున్న ప్రజలు మీపై ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకుంటారనిఅని అన్నారు. ఈ సోషల్ మీడియా యుగంలో ఏదీ ఎవరి నుండీ దాచలేమన్నారు. సోషల్‌మీడియాలో న్యాయమూర్తులపై జరుగుతున్న దాడుల విషయంలో ఏదో ఒకటి చేయాల్సిందిగా భారత ప్రధాన న్యాయమూర్తి తనని కోరారని రిజిజు చెప్పారు. న్యాయమూర్తులపై ఉపయోగిస్తున్న అవమానకరమైన భాషను ఎలా నియంత్రించాలో ఆయన తెలుసుకోవాలనుకుంటున్నారు. న్యాయమూర్తులకు పరిమితులు వుంటాయని, అందువల్ల వారు బహిరంగ వేదికలపై వాదించలేరని అన్నారు. "ఏం చేయాలో నాకు తెలుసు, ధిక్కార నిబంధన వుంది, కానీ పెద్ద సంఖ్యలో ప్రజలు వ్యాఖ్యానిస్తుంటే ఏం చేయగలుగుతాం. రోజూ ప్రభుత్వం విమర్శలను ఎదుర్కొంటూనే వుందని, అలాగే న్యాయమూర్తులు కూడా ఇప్పుడు అదే పరిస్థితి ఎదుర్కొంటున్నారని అన్నారు.

కేరళ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

- ఎల్‌డిఎఫ్ విజయాలతో విధాన ప్రసంగం చేసిన గవర్నర్

తిరువనంతపురం : గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ప్రసంగంతో కేరళ శాసనసభా బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వంతో సామరస్య సంబంధాలు లేనప్పటికీ ప్రభుత్వం సిద్ధం చేసిన విధాన ప్రసంగాన్ని సభలో చదవాల్సిన రాజ్యాంగ కర్తవ్యానికి కట్టుబడి గవర్నర్ ప్రసంగించారు. ఆర్థికాభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, స్థానిక సంస్థలకు సాధికారత కల్పించడం, దారిద్ర్య నిర్మూలన, విద్య, మౌలిక వసతులు, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం సాధించిన విజయాలను గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇళ్ళు, భూమిలేని వారికి ఇళ్ళు కట్టించే లైఫ్ (జీవనోపాధి, ఆర్థిక సాధికారతా పథకం) పథకం, డిజిటల్ పాలనపై ప్రభుత్వం పెట్టిన దృష్టి గురించి కూడా గవర్నర్ ఈ ప్రసంగంలో ప్రస్తావించారు. సమాఖ్యవాదం, ప్రజాస్వామ్య విలువలపై దాడిని కూడా గవర్నర్ తన ప్రసంగంలో విమర్శించారు.

కాగా, కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ఈ సభా కార్యకలాపాలను బహిష్కరించింది. ఫిబ్రవరి 3న రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. మార్చి 30వరకు అసెంబ్లీ సమావేశాలు కొనసాగనున్నాయి.

పారిశ్రామిక రంగంలో కేరళ ముందంజ వేసిందని గవర్నర్ పేర్కొన్నారు. ఎంటర్‌ప్రైజెస్‌ల సంవత్సరంగా 2022-23లో 9 మాసాల్లో లక్షకు పైగా సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేశారు. ఇబ్బందుల పరిష్కార యంత్రాంగాలు, కేంద్రీకృత తనిఖీ వ్యవస్థ, సకాలంలో లైసెన్స్‌కు ఆమోదం తెలిపే యంత్రాంగాలు ఏర్పాటు చేయడం వంటి చర్యల వలన ఈ పురోగతి సాధ్యమైందని గవర్నర్ ఖాన్ చెప్పారు. కోవిడ్‌తో ఆర్థిక ప్రగతి మందగించినప్పటికీ రాష్ట్రం నిశ్చిత ధరల వద్ద 12శాతం, ప్రస్తుత ధరల వద్ద 17శాతం ఆర్థికాభివృద్ధిని నమోదు చేసింది. సాంకేతికతపై దారిద్ర్య నిర్మూలనపై ప్రధానంగా ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందని గవర్నర్ ఖాన్ తెలిపారు. ఫెడరల్ సూత్రాలను పరిరక్షించాలని, మరింత మెరుగైన రాష్ట్ర స్వయంప్రతిపత్తి, లౌకికవాదం, బహుళ విలువల కోసం ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పిలుపిచ్చింది. మత, భాషాపరంగా గుత్తాధిపత్య ధోరణులు, ఇతర సమస్యలు బలమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మాణానికి అడ్డం కొడుతున్నాయని విమర్శించారు. సమైక్యతను పటిష్టపరిచేందుకు వైవిధ్యాన్ని గౌరవించాలని ఎల్‌డిఎఫ్ తన విధాన ప్రసంగంలో పేర్కొంది.

మెట్రో రైల్ పొడిగింపునకు రూ.254 కోట్లు మంజూరు చేయాలి

- కేంద్రానికి మెట్రో రైల్ ఎమ్‌డీ ఎన్వీఎస్ రెడ్డి విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెట్రో రైల్ పొడిగింపునకు రూ.254 కోట్లు మంజూరు చేయాలని ఆ సంస్థ ఎమ్‌డీ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. కేంద్ర పట్టణాభివద్ధి, హౌసింగ్ వ్యవహారాలపై నియమించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సోమవారం హైదరాబాద్‌లో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరును సమీక్షించింది. ఈ సందర్భంగా ఆయన, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రాయదుర్గం నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో రైల్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని తెలిపారు. సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, రాష్ట్రంలో అమలవుతున్న హరితహారం తదితర పథకాలను వివరించారు. పురపాలకశాఖ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసే క్రమంలో స్థానిక సంస్థల సంఖ్యను 68 నుంచి 142కు పెంచినట్టు తెలిపారు. పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ డైరెక్టర్ సత్యనారాయణ, జలమండలి ఎండీ దానకిషోర్ పాల్గొనగా, సమావేశానికి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ లాలన్ సింగ్ అధ్యక్షత వహించారు. పార్లమెంటరీ కమిటీ సభ్యులు చర్చించారు.

బీఆర్ఎస్ అరాచకాలపై చార్జీషీట్ విడుదల చేస్తాం

- ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ అరాచకాలపై త్వరలో ఛార్జీషీట్ విడుదల చేస్తామని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మెన్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే బీజేపీపై ఏఐసీసీ చార్జీషీట్ విడుదల చేసిందని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఈ రెండు పార్టీలు వైఫల్యం చెందాయన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతి నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు సాగు నీరు ఇస్తామంటిరి ఏమైందని ప్రశ్నించారు. వారానికో అంశంపై చార్జీషీట్ విడుదల చేసి, ప్రభుత్వ విధానాలను ఎండగడతామని తెలిపారు. భ్రష్టు జుమ్లా పార్టీ (బీజేపీ), బందిపోటుల రాక్షసుల సమితి (బీఆర్ఎస్)గా నామకరణం చేసినట్టు తెలిపారు. ఏఐసీసీ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 26 నుంచి 119 నియోజకవర్గాల్లో హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. సీనియర్ ఉపాధ్యక్షులు జి. నిరంజన్ మాట్లాడుతూ స్మితాసబర్వాల్ ఇంటిలో ఆగంతుకుడి ప్రవేశంపై ఇప్పటికి కేసీఆర్ స్పందించలేదని విమర్శించారు. సికింద్రాబాద్ అగ్నిప్రమాదంలో చనిపోయిన ఆ ఇద్దరి ఆచూకీ ఎక్కడ? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ ఈ రెండు నెలలపాటు పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు. మల్లు రవి మాట్లాడుతూ బీఆర్ఎస్ నియంత పాలన, సీఎం కేసీఆర్ అబద్ధాల(108)పై త్వరలో పుస్తకాన్ని విడుదల చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ మాట్లాడుతూ దళిత, గిరిజనులకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలపై సభలు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

పంజాగుట్ట సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు అనుమతి ఇవ్వండి : సీఎస్ శాంతికుమారికి కాంగ్రెస్ బృందం వినతి

పంజాగుట్ట సర్కిల్ అంబేద్కర్ విగ్రహం పెట్టేందుకు అనుమతి ఇవ్వాలని కాంగ్రెస్ బృందం కోరింది. ఈమేరకు సోమవారం బీఆర్‌కేభవన్‌లోని సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఎల్పీనేత మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, టీపీసీసీ మాజీ అధ్యక్షులు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి ఉన్నారు.

అనాధలకిచ్చిన హామీలు నెరవేర్చాలి

- 30న ధర్నాచౌక్ వద్ద అరిగోస దీక్ష : మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అనాధలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అనాధల హక్కుల పోరాట వేదిక (ఏహెచ్ పీవీ) వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ ప్రభుత్వం అనాథలకిచ్చిన హామీలను గుర్తు చేస్తూ ఏహెచ్‌పీవీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ, అనాధలకు రాష్ట్ర ప్రభుత్వమే అమ్మ, నాన్న అంటూ కేసీఆర్ హామీ ఇచ్చి ఏడు సంవత్సరాల ఏడు నెలల ఏడు రోజులైన సందర్భంగా ముఖ్యమంత్రి 777 సినిమా చూపిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద గల ధర్నాచౌక్‌లో 30న అరిగోస దీక్ష నిర్వహించనున్నట్టు ప్రకటించారు. అనాధల హక్కుల సాధనకు జరిగే పోరాటంలో అందరూ కలిసికట్టుగా కదిలిరావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అనాధలకిచ్చిన ఏ హామీని నెరవేర్చలేదనీ, వారిని సీఎం కేసీఆర్ మరిచిపోయారని విమర్శించారు. ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు మద్దతిస్తే అనాధల సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. యాదగిరిగుట్టలో అనాధలకు రెసిడెన్షియల్ స్కూల్ కట్టిస్తాననీ నమ్మబలికిన కేసీఆర్ రాష్ట్రంలో ఎక్కడా కట్టలేదని తెలిపారు. కరోనా సమయంలో ఎంతో మంది పిల్లలు అనాధలయ్యారనీ, రెండేండ్లలో అనాధల సంఖ్య పెరిగిందన్నారు. వారి గురించి అధ్యయనం చేసి మరిచిపోవడం సీఎంకే చెల్లుతుందని ఎద్దేవా చేశారు. అనాథలకు గురుకులాలు ఏర్పాటు చేసి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలనీ, సరూర్‌నగర్‌లో అనాధలకు కేజీ టూ పీజీ ఉచిత విద్యనందించాలనీ, ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలనీ, అనాధాశ్రయాలకు ప్రోత్సాహకాలు అందించాలని డిమాండ్ చేశారు. అనాధల కోసం మందకృష్ణ మాదిగ తలపెట్టిన పోరాటానికి ఆయా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఎన్జీవోలు మద్దతు ప్రకటించాయి.

రాజ్యాన్ని ప్రజాస్వామీకరించాలి

రాజ్యాన్ని ప్రజాస్వామీకరించాలనీ, సమాజాన్ని మానవీకరించలని ప్రొఫెసర్ హరగోపాల్ తెలిపారు. స్వార్థంగా బతకడమే గొప్ప జీవితమనే సిద్ధాంతాలు కూడా వస్తున్న సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్న ప్రపంచంలో తాము ఉన్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో అనాధల హక్కుల కోసం గొంతెత్తడం చారిత్రక సందర్భమన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో అభివద్ధి కుంటుపడుతుందని భావించే ప్రభుత్వాల విధానాలతో భవిష్యత్తులో అనాధల సంఖ్య మరింత పెరిగే ప్రమాదముందని హెచ్చరించారు. పిల్లలు సంతోషంగా లేని సమాజం బాగుపడదని తెలిపారు.

అనాధల హామీల విస్మరణ అత్యంత దుర్మార్గం

అనేక వర్గాలకిచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరించడం దుర్మార్గమైతే, అనాధలకిచ్చిన హామీలు కూడా అమలు చేయకపోవడం అత్యంత దుర్మార్గమని సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ విమర్శించారు. అనాధల కోసం రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తామనీ, ముందుగా యాదాద్రి నుంచి మొదలు పెడతామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. యాదాద్రిలో దేవాలయ నిర్మాణం పూర్తి చేశారే కానీ, పాఠశాల కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ కార్డులను పంపిణీ చేయాలనీ, ఎస్సీ, ఎస్టీల సబ్ ప్లాన్ మాదిరిగా అనాధలకు సబ్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ చేశారు. అనాధలు సమాజంలో అందరితో గౌరవంగా బతికేందుకు వీలుగా అవసరమైన కార్యక్రమాల కోసం నిధులు కేటాయించాలని సూచించారు.

అంతు లేని అత్యాచారాలు

అనాధలపై దాడులు, అత్యాచారాలు విపరీతంగా జరుగుతున్నాయనీ, అయితే అవి వెలుగులోకి రావడం లేదని ఏహెచ్‌పీవీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటయ్య తెలిపారు. కేవలం నెల రోజుల వ్యవధిలో రాష్ట్రంలో 300కు పైగా దాడులు, అత్యాచారాలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనాధల కోసం హాస్టళ్లను 365 రోజులు నడపాలనీ, తాము చేసిన పోరాట ఫలితంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. పండుగలకు సెలవులివ్వొద్దనీ తాము కోరామనీ, సెలవులిస్తే ఇండ్లే లేని వారు ఎక్కడికి వెళతారని ప్రశ్నించారు. వారికి ఇంటర్మీడియట్, డిగ్రీలో సీట్లు కేటాయించాలనీ, మంత్రివర్గ ఉపసంఘం డిమాండ్లను అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ మల్లు రవి, రాములు నాయక్ (కాంగ్రెస్), రావుల చంద్రశేఖర్ రెడ్డి (టీడీపీ), ఏపూరి సోమన్న (వైఎస్సాఆర్టీపీ), ఇందిరా శోభన్ (ఆప్), అంజయ్య నాయక్ (సీపీఐ), సాధినేని వెంకటేశ్వర్ రావు (సీపీఐ-ఎంఎల్ న్యూడెమోక్రసీ), రాజు (ఏహెచ్‌పీవీ), అద్దంకి దయాకర్ (తెలంగాణ మాల మహానాడు), జాజుల శ్రీనివాస్ గౌడ్ (బీసీ సంక్షేమ సంఘం) నాయకులు కోల జనార్ధన్ (జేఏసీ), రాంబాబు (వికలాంగుల హక్కుల పోరాట సమితి) తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి

- సీఎంకు తమ్మినేని లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు వీఆర్ఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎంకు లేఖ రాశారు. రాష్ట్రంలో 23వేల మంది వీఆర్ఏలు ఉన్నారనీ, వారందరినీ పేస్కేల్ ఎంప్లాయిస్‌గా గుర్తిస్తామనీ, అర్హులకు పదోన్నతులు కల్పిస్తామనీ, 55ఏండ్లు నిండిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలిస్తామంటూ అసెంబ్లీ సాక్షిగా సీఎం హామీ ఇచ్చిన విషయాన్ని తమ్మినేని గుర్తుచేశారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్ఏలను ఇతర శాఖలకు పంపిస్తూ రెగ్యులరైజ్ చేస్తామని సీఎం చెప్పిన మాటలను తమ్మినేని లేఖలో ప్రస్తావించారు. వీఆర్ఏల ఆందోళన నేపథ్యంలో మంత్రి కేటీఆర్, అప్పటి సీఎస్ సోమేష్‌కుమార్ వారికి స్పష్టమైన హామీలిచ్చారని తెలిపారు. వీఆర్ఏ సంఘాల ప్రతినిధులను ప్రగతిభవన్‌కు పిలిచి వారితో మంత్రి కేటీఆర్, సీఎంఓ అధికారులు చర్చలు జరిపి డిసెంబర్ 22న సీఎం సమక్షంలో వివరంగా చర్చిద్దామని చెప్పి ఇప్పటి వరకు వాటిపై స్పందించలేదని అన్నారు. వీఆర్ఏల్లో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతులకు చెందినవారేనని పేర్కొన్నారు. వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసిన ప్రభుత్వం ఇప్పటికీ ఆ విధులను వారితోనే చేయిస్తున్నారని తెలిపారు. పేస్కేలు, పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్‌కార్డులు, ఉద్యోగ భద్రత, పదోన్నతులు, మెటర్నటీ, క్యాజువల్ సెలవులు లాంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో.. ఇప్పటికే కొంతమంది ఆర్థిక, మానసిక బాధతో మరణించారని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి వీఆర్ఏలు 80 రోజుల పాటు నిరసనలు, సమ్మెలు చేసారని, ఆ సమయంలో 65 మందికి పైగా మరణించారని తమ్మినేని గుర్తుచేశారు. ప్రభుత్వ హామీపై నమ్మకంతో వీఆర్ఏలు సమ్మె విరమించి 100 రోజులు గడిచిందని పేర్కొన్నారు. తక్షణమే వారి సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) పార్టీ సెప్టెంబర్ ఆరున సీఎం దష్టికి కూడా తీసుకొచ్చిన విషయాన్ని లేఖలో పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే వీఆర్ఏలతో చర్చలు జరిపి వారి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తమ్మినేని విజ్ఞప్తి చేశారు.

విద్యకు అధిక నిధులు కేటాయించాలి : కూనంనేని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. సరైన విద్య లేకుంటే మానవ సమాజం పురోగతి సాధించలేదని తెలిపారు. విద్యకు సరైన ప్రాధాన్యం ఇచ్చిన సమాజం మాత్రమే తన లక్ష్యాలను చేరుకుంటుందని స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర విద్యార్థి విభాగం సబ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక పాఠశాలల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారనీ, మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో అమ్మాయిలు విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. అన్ని పాఠశాలల్లో క్రీడా మైదానాలను, లైబ్రరీలను, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలనీ, అదేవిధంగా టీచర్ల భర్తీ ప్రక్రియ చేపట్టాలని కూనంనేని డిమాండ్ చేశారు.సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నిర్మాణ బాధ్యులు తక్కలపల్లి శ్రీనివాస్ రావు, సబ్ కమిటీ కన్వీనర్ పుట్ట లక్ష్మణ్, సభ్యులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, అశోక్ స్టాలిన్, రెహమాన్, రఘురాం నరేష్, సంతోష్ పాల్గొన్నారు.

ఒక శాతం చందాతో నగదు రహిత వైద్యమందించాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగులకు, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఒక శాతం చందాతో కూడిన నగదు రహిత వైద్య సహాయాన్ని ఏర్పాటు చేయాలని టీఎన్జీవో కేంద్ర సంఘం, పీఆర్‌టీయూ-టీఎస్, తెలంగాణ రాష్ట్ర నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని కోరాయి. ఈ మేరకు సోమవారం టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మామిళ్ళ రాజేందర్, రాయకంటి ప్రతాప్‌ల నేతృత్వంలో ఆయా సంఘాల నాయకులు ఆర్థిక శాఖ మంత్రి టి.హరీష్ రావును హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల్ అందరూ నగతురహిత వైద్య సదుపాయం అమలు కోసం ఒక శాతం మూలవేతనంలో చందా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అందుకనుగుణంగా ప్రభుత్వం కూడా తన వాటాగా నగదును ట్రస్ట్‌కు చెల్లించాలని కోరారు. జీవో నెంబర్ 317 అమలులో భార్యాభర్తల బదిలీల ప్రక్రియను చేపట్టాలనీ, ఉద్యోగులకు ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లించాలనీ, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలనీ, డీఏలను మంజూరు చేయాలనీ, పెండింగ్ పీఆర్సీ జీవోలను విడుదల చేయాలనీ, రాష్ట్రంలో ఈ ఏడాది జులై ఒకటి నుంచి అమలయ్యేలా నూతన పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ సంఘాల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన హరీష్ రావు ఈహెచ్ఎస్ అమలుకు ఆదేశాలు జారీ చేసి వెంటనే ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని వైద్యారోగ్యశాఖ రిజ్వీని ఆదేశించారు. అనంతరం ఉద్యోగ సంఘాల నాయకులు రిజ్వీతో చర్చించి జీవో వెంటనే విడుదల చేయాలని వినతిపత్రం సమర్పించారు. నగదు రహిత ఆరోగ్య పథకం అమలు కోసం ఉత్తర్వులు జారీ చేస్తున్నందుకు సీఎం కేసీఆర్ కు , ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో టీఎన్జీవో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, పీఆర్ టీయూ-టీఎస్ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్ తదితరులున్నారు.

హైదరాబాద్‌లో అమెజాన్ కార్గో సేవలు

హైదరాబాద్ : ఏడు సంవత్సరాలుగా రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు తరలి వస్తున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. సోమవారం శంషాబాద్ విమానాశ్రయంలో అమెజాన్ ఎయిర్‌కార్గో విమానమైన ప్రైమ్ ఎయిర్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. వస్తువుల డెలివరీని వేగవంతం చేసేందుకు ప్రైమ్ ఎయిర్ పేరిట కొత్త సేవలను అమెజాన్ అందుబాటులోకి తెచ్చింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇండియన్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో తెలంగాణ రెండో స్థానంలో ఉన్నదని చెప్పారు. అమెజాన్ అతిపెద్ద క్యాంపస్ హైదరాబాద్‌లోనే ఉందని గుర్తు చేశారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ద్వారా రూ.36,300 కోట్ల పెట్టుబడులు పెడుతున్నదని వెల్లడించారు. ఏవియేషన్ రంగంలో తెలంగాణ వేగంగా అభివద్ధి చెందుతున్నదని వెల్లడించారు. హైదరాబాద్ విమానాశ్రయం ప్రపంచంలోనే అత్యుత్తమ ఎయిర్‌పోర్ట్ అని చెప్పారు. హైదరాబాద్ గ్రీన్‌సిటీ అవార్డును సొంతం చేసుకున్నదని తెలిపారు. అమెజాన్ ఎయిర్ సేవల్లో భాగంగా ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ నగరాలకు వస్తువులను త్వరితగతిన డెలివరీ చేయడానికి గానూ బోయింగ్ 737-800 విమానాలను వినియోగించనుంది. ఇందుకోసం బెంగళూరుకు చెందిన క్విక్‌జెట్ సంస్థతో అమెజాన్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. భారత్‌లో ఒక ఈ-కామర్స్ సంస్థ థర్డ్ పార్టీ విమానసేవలను వినియోగించుకోవడం ఇదే తొలిసారి. అమెజాన్ ఎయిర్ వల్ల సుమారు 11 లక్షల మంది సెల్లర్లకు మేలు చేకూరనుందని అమెజాన్ ప్రతినిధి అఖిల్ సక్సేనా తెలిపారు.

ప్రజల ప్రాణం గాలిలో దీపమేనా..!

గుంతలు పడిన రోడ్డుపై మట్టి పోయడానికీ నిధుల్లేవా..?

- ముషంపల్లి నుంచి నల్లగొండకు డబుల్ రోడ్డు వేయాలి: సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి డిమాండ్
- ముషంపల్లి నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర, ధర్నా



నవ తెలంగాణ -నల్లగొండ/నల్లగొండ కలెక్టరేట్

"పాలకులు మారినా.. ప్రభుత్వాలు మారినా.. ప్రజల బతుకులు మారడం లేదు.. 15 ఏండ్లుగా ముషంపల్లి రోడ్డు అతుకుల గతుకులుగా మారింది.. ఆ రోడ్డులో ప్రయాణం చేసే ప్రజల ప్రాణం గాలిలో దీపంగా మారింది.. ప్రజా సమస్యలపై పాలకులకు పట్టింపే ఉండటం లేదు" అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గుంతల మయంగా మారిన రోడ్డును డబుల్‌గా మారుస్తూ వెంటనే వేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) నల్లగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో ముషంపల్లి గ్రామం నుంచి పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రను ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. వెలుగుపల్లి, అన్నారం, అన్నారెడ్డిగూడెం, రసూల్‌పురం గ్రామాల ప్రజలు సుమారు వెయ్యి మందికిపైగా కలెక్టరేట్ వరకు పాదయాత్రగా వచ్చారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు గుంతలమయంగా మారడంతో అనేకమంది ప్రమాదాలకు గురై మరణించారని తెలిపారు. కొంతమంది తీవ్రంగా గాయపడ్డారన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ వెంటనే సమగ్ర సర్వే నిర్వహించి డబుల్ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు.

వెలుగుపల్లి నుంచి రసులుపురం, దుప్పలపల్లి రైల్వే ట్రాక్ వరకు డాంబర్ రోడ్డుగా మార్చేందుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 3న రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో అధిక నిధులు కేటా యించి రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున మాట్లాడుతూ.. రోడ్డు విషయంలో పాలకులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు.

గుంటల్లో మట్టి పోయడానికి కూడా నిధులు లేవని చెప్పటం ఏంటని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ పాదయాత్రలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హాషం, పాలడుగు ప్రభావతి, జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, దండంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, మండల కార్యదర్శి నలపరాజు సైదులు తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా 26న జిల్లా కేంద్రాల్లో వాహన ర్యాలీలు

- వైఎమ్‌సీఏ నుంచి ఆర్‌టీసీ క్రాస్‌రోడ్ వరకు ప్రదర్శన
- సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న జిల్లా కేంద్రాల్లో వాహన ర్యాలీలు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపునిచ్చింది. హైదరాబాద్ నగరంలో నారాయణగూడ (వైఎంసీఏ) నుంచి ఆర్‌టీసీ క్రాస్‌రోడ్ వరకు వాహన ప్రదర్శన ఉంటుందని పేర్కొంది. సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో ఎస్‌కేఎం రాష్ట్ర కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు తీగల సాగర్, పశ్యపద్మ, వేములపల్లి వెంకట్రామయ్య, జక్కుల వెంకటయ్య, ప్రసాదన్న మాట్లాడుతూ....కనీస మద్దతు ధరల చట్టం చేయడం, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరణ, రైతు రుణమాఫీ, లఖింపూర్ ఘటనకు బాధ్యులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. మూడు సాగు చట్టాలను రద్దు చేయాలనే ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలనీ, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. సన్న, చిన్న కారు రైతులకు కౌలు రైతులకు బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పించాలని కోరారు. కేరళ ప్రభుత్వ తరహాలో కేంద్ర ప్రభుత్వం రైతురుణ మాఫీ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తులు, మహిళలు, విద్యార్థి, యువజనులు, గిరిజన, సామాజిక, మైనారిటీ సంఘాలు ఐక్యంగా వాహన ర్యాలీలో పాల్గొనాలనివిజ్ఞప్తిచేశారు. ఈకార్యక్రమంలోబాల్‌రాజు(ఎఐటీయూసీ), మధు(సీఐటీయూ),శ్రీరాంనాయక్(గిరిజనసంఘం),ఝాన్సీ (పీవోడబ్ల్యు),ప్రదీప్(పీవైఎల్),పి.జంగారెడ్డి,మూడ్‌శోభన్(తెలంగాణ రైతుసంఘం),కోటేశ్వరరావు,మండలవెంకన్న(ఎఐకేఎంఎస్),నీతు శర్మ(తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం) తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషి : బుర్ర వెంకటేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వడ్డెర వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం తెలిపారు. వడ్డెర వృత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను సోమవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర వృత్తిదారులు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారనీ, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని తెలిపారు.కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కుంచం వెంకటకృష్ణ, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇడగొట్టి సాయిలు, వల్లపు విగ్నేష్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ దేరంగుల రామకృష్ణ, రాష్ట్ర నాయకులు దండుగుల నరసింహులు, దేరంగుల కృష్ణ, బొంత కొమురెల్లి ఇరగ దిండ్ల కురుమయ్య తదితరులు పాల్గొన్నారు

త్రిముఖ వ్యూహంతో ముందుకు

భావ సారూప్యత సంఘాలతో ఐక్య ఉద్యమాలు

- ఉత్పాదక వర్గాలతో కలిసి పోరాటాలు: సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మరిన్ని సమరశీల పోరాటాలకు సమాయత్తం కావాలని బెంగళూరులో జరిగిన సీఐటీయు 17వ జాతీయ మహాసభ పిలుపునిచ్చినట్టు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు తెలిపారు. త్రిముఖ వ్యూహంతో ముందుకెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. మరిన్ని పోరాటాలకు త్రిముఖ వ్యూహంతో ముందుకెళ్లాలని మహాసభలో నిర్ణయించినట్టు వివరించారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సోమవారం సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 నుంచి 22వ తేదీ వరకు బెంగళూరులోఅత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగిన ఈ మహాసభకు వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ వాంబిష్ క్రిష్టిస్‌తోపాటు చేగువేరా కూతురు అలైదా ప్రత్యేక ఆకర్షణగా నిలిచినట్టు చెప్పారు.

ధరల పెరుగుదలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలమవు తుందన్నారు. బీజేపీ నయా ఉదారవాద విధానాల వల్ల దేశం మరింత సంక్షోభంలోకి కూరుకు పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతు న్నాయన్నారు. దేశంలో 50 కోట్ల మంది కార్మికులు ఉంటే.. వారిలో 93 శాతం మంది వరకు రూ.పది వేలలోపు వేతనం ఉన్నవారేనని చెప్పారు. వీరి హక్కుల కోసం త్రిముఖ వ్యూహంతో పోరాటాలు నిర్వహించాలని మహాసభ నిర్ణయించినట్టు చెప్పారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్న ప్రభుత్వ విధానాలను కార్మికులు అర్థం చేసుకునే చైతన్యం తీసుకురావడం మొదటి వ్యూహంగా తెలిపారు. ఏఐటీయుసీ, ఐఎన్ టీయుసీ వంటి భావ సారూప్యత సంఘాలతో కలిసి ఐక్య పోరాటాలు నిర్వహించాలనేది రెండో వ్యూహంగా తెలిపారు. ఉత్పాదకవర్గంగా ఉన్న రైతులు, కూలీలు, కార్మికులు సంపద సృష్టిస్తుంటే ఆ వర్గాలపై దాడులు చేసే విధానాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా వర్గాలతో కలిసి ఐక్య పోరాటాలు నిర్వహించాలనేది మూడో వ్యూహంగా తెలిపారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా.. కార్మికుల సమస్యలపై ఏప్రిల్ 5న ఢిల్లీలో కార్మిక పోరు, ఐదు లక్షల మందితో మహాధర్నా నిర్వహిం చనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు తుమ్మా విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులు యర్రా శ్రీకాంత్, వై.విక్రం, సహాయ కార్యదర్శులు రమ్య, మోదం శ్రీనివాసరావు, పెరుమాళ్లపల్లి మోహన్ రావు, నాయకులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పీఈటీ ఫలితాలను వెంటనే విడుదల చేయాలి

- 2017పరీక్ష అభ్యర్థుల ఆందోళన



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

హైకోర్టు ఉత్తర్వులు అనుసరించి 2017 గురుకుల పీఈటీ ఫలితాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీఈటీ అభ్యర్థుల సంఘం నాయకులు సోమవారం హైదరాబాద్‌లో ఆందోళనకు దిగారు. వివిధ జిల్లాల నుంచి పిల్లలతో సహా తరలివచ్చిన అభ్యర్థులు.. నాంపల్లిలోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముందు రోడ్డుపై బైటాయించారు. కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సదానంద్ గౌడ్ మాట్లాడుతూ.. 2017 సెప్టెంబర్‌లో గురుకుల పోస్టులకు పీఈటీ పరీక్షలు రాసినప్పటికీ ఇంతవరకు ఫలితాలు విడుదల చేయలేదన్నారు.

కమిషన్ చైర్మెన్ ఉద్దేశపూర్వకంగానే ఫలితాలు ప్రకటించకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితాలు వెల్లడించకపోవడంతో మనస్తాపానికి గురై 8 మంది అభ్యర్థులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వకుండా టీఎస్‌పీఎస్సీ జాప్యం చేస్తుందన్నారు. 616 పోస్టులకుగానూ 1:2 ప్రాతిపదికన 1232 మంది అభ్యర్థులు గతంలో ఎంపిక అయ్యారని తెలిపారు. ఇంతవరకు వాటి వివరాలు వెబ్‌సైట్‌లో పెట్టలేదన్నారు. అభ్యర్థులకు కుటుంబ పోషణ భారం అవుతోందని.. వారు మనోధైర్యం కోల్పోయి ఆత్మహత్య చేసుకోకుండా ఉండాలంటే.. ముఖ్యమంత్రి కేసీఆర్ జోక్యం చేసుకుని వెంటనే ఫలితాలు ప్రకటించాలని కోరారు. లేనిపక్షంలో ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఇండ్ల స్థలాల కోసం రిలే దీక్షలు



టీడబ్ల్యూజేఎఫ్ తీర్మానం

- రైల్వేపాసుల కోసం ఎంపీలకు వినతిపత్రాలు
- పూర్తిస్థాయిలో హెల్త్‌కార్డులు అమలుచేయాలని డిమాండ్

నవతెలంగాణ -హైదరాబాద్

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో వున్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఇండ్ల స్థలాలపై ప్రభుత్వం వెంటనే విధానాన్ని ఖరారు చేయాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర కేంద్రం హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లోని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చెయాలని కోరింది.

సమస్యల పరిష్కారం కోసం ఈనెలా ఖరులో హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు నిరసన దీక్షలు చేపట్టాలని తెలంగాణ ఫెడరేషన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం తీర్మానించింది. హైదరాబాద్‌లోని ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఆఫీసు బేరర్ల సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య గత కార్యకలాపాలపై నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొం టున్న సమస్యలను చర్చించి ఆఫీస్ బేరర్ల సమావేశం పలు తీర్మానాలను ఆమోదించింది. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టాలనీ, ఈ దీక్షల్లో అన్ని జిల్లా కమిటీల బాధ్యులు, జర్నలి స్టులు పాల్గొనాలని సమావేశం పిలుపునిచ్చింది.

ఇండ్ల స్థలాల సమస్య గత 35 సంవత్సరాలుగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉందని గుర్తుచేసింది. ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు జిల్లాల పర్యటనల సందర్భంగా అనేక చోట్ల హామీలు ఇచ్చారని చెప్పారు. వెంటనే వాటిని పరిష్కరించాలని కోరారు. అలాగే హౌసింగ్ సొసైటీలతో సంబంధం లేకుండా హైదరాబాద్‌లోనూ అనేక మంది జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్నారని అభిప్రాయపడ్డారు.

అదే విధంగా జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసుల సమస్యను పార్లమెంటు సమా వేశాల్లో చర్చించి వాటిని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఆయా పార్టీ లకు చెందిన పార్లమెంటు సభ్యులకు వినతిపత్రాలు సమర్పించాలని సమావేశం తీర్మానించింది.

జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన హెల్త్ కార్డులు ప్రయివేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో సరిగా పనిచేయడం లేదనీ, ఈ సమస్యపై వెంటనే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును మరోసారి కలవాలని నిర్ణయించింది. అలాగే ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఫిబ్రవరి 5న నిర్వహించాలనీ, అనంతరం రాష్ట్ర విస్తతస్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్టు వారు తెలిపారు.

నాలుగున్నరేండ్లు అవమానాలకు గురయ్యాం

- ఎన్‌టీఆర్, వైఎస్‌ను ప్రజలు దేవుళ్లలా కొలిచారు
- ఏ గూటి పక్షులు ఆ గూటికే చేరతాయి
- ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-ఇల్లందు

నాలుగున్నర సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీలో అవమానాలకు గురయ్యాం.. కురువృద్ధుల మాటలు విని ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం ఖమ్మం రోడ్‌లోని ఒక మామిడితోటలో సోమవారం నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జెడ్పీ చైర్మెన్ కోరం కనకయ్య అధ్యక్షతన జరిగిన సభలో పొంగులేటి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఎదుర్కొన్న అవమానాలన్నింటినీ ఏకరువుపెట్టి బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు.

2013 ఫిబ్రవరి 19న వైఎస్ఆర్ పార్టీ ఆశిస్సులతో ఖమ్మం ఎంపీగా, మరో మూడు ఎమ్మెల్యే స్థానాలు, సీపీఐ(ఎం) ఒక స్థానంలో ప్రజాభిమానంతో గెలిచామన్నారు. కాంగ్రెస్, టీడీపీ కంటే ఎక్కువగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను గెలిపించుకున్నామని చెప్పారు. వైసీపీ నుంచి టీఆర్ఎస్ పార్టీకి మద్దతు కావాలని కోరగా.. రెండున్నర ఏండ్ల తరువాత టీఆర్ఎస్‌లోకి మారినట్టు చెప్పారు. తన వెంట వచ్చిన వారికి ఎవరికీ ఒక్క పదవి కూడా దక్కలేదన్నారు. బుజ్జగించి కాలయాపన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 2018 సార్వత్రిక ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపీకి సీటు ఇవ్వకుండా వేరే పార్టీ నుంచి వచ్చిన వారికి ఇచ్చారని తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ మాటలు నమ్మి ఏ పార్టీలోనూ చేరలేదన్నారు. ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేయాలని అనేక మంది కోరినా వేయలేదన్నారు. పార్టీ నిబంధనలకు కట్టుబడి ఉన్నానన్నారు. కానీ, ఆ తర్వాత నమ్ముకున్నవారికి ఏమీ ఇవ్వలేదన్నారు. ప్రతి మనిషికీ ఆత్మగౌరవం ఉంటుందని, పదవులు లేకున్నా నిత్యం ప్రజలతోనే మమేకమవుతూ తోచిన సహాయం చేశామని చెప్పారు. నియోజకవర్గం, ఉమ్మడి జిల్లా, తెలంగాణలో అనేక ప్రాంతాల్లో నిరుపేదలు పాకలు వేసుకుని జీవనం సాగించే మాట నిజమన్నారు. 2018 ఎన్నికల సందర్భంగా రెండు రోజుల్లో పోడు భూముల సమస్య పరిష్కరిస్తామన్న సీఎం కేసీఆర్ మాట నిలబెట్టుకోలేదన్నారు.

వైఎస్ఆర్, ఎన్‌టీఆర్‌లను ప్రజలు దేవుళ్లలా కొలిచారని గుర్తు చేశారు. ఉమ్మడి జిల్లా, తెలంగాణలో ఎంపీలు, ఎమ్మెల్యేలను కలుసుకోవాలంటే అనుమతులు, పాస్ పోర్టులు కావాలా..? అడ్డంకులు సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి దీటైన సమాధానం చెప్తానన్నారు. తనకు గౌరవం ఇచ్చినా ఇవ్వకపోయినా జైల్లో పెట్టినా ప్రజలను గుండెల్లో పెట్టుకున్నానన్నారు. విశ్వసనీయత, విలువలు ఉంటాయని ప్రజలు తన వెంట వచ్చారని చెప్పారు. మరో 2, 3 నెలలు అన్ని రకాల ఒత్తిడిలు ఉంటాయన్నారు. చివరికి ఏ గూటి పక్షులు ఆ గూటికే చేరతాయన్నారు. రానున్న రోజుల్లో తనపై, కోరంపై, సామాన్య ప్రజలను పోలీసులు, ఏ స్థాయి ప్రజాప్రతినిధులైనా ఇబ్బందులు పెడితే సహించబోమని హెచ్చరించారు. అలాంటి వారికి ఎలా మూల్యం చెల్లించాలో తెలుసన్నారు. వెంటనే సంఘటన స్థలానికి వచ్చి నిరహార దీక్షలు చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో కలిసి పయనిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ మాజీ చైర్మెన్ మువ్వా విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ఫ్రెండ్స్ క్లబ్‌కు అభినందనలు

- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్ డి.జనార్ధన్ రెడ్డి



నవతెలంగాణ-నాగోల్

మంచి ఆశయంతో ఏర్పడిన ఫ్రెండ్స్ క్లబ్ 15 సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేస్తూ స్నేహితులను, క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్ డి.జనార్ధన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నాగోల్ డివిజన్‌లోని బండ్లగూడలో గల వి- స్పోర్ట్స్ అకాడమీలో ఫ్రెండ్స్ క్లబ్ ఆర్గనైజింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెండ్స్ కప్-2023 ఇంటర్ క్లబ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని చెప్పారు. క్రీడలను ప్రోత్సహించేందుకు అందరూ కలిసి రావడం మంచి నిర్ణయమన్నారు. తనకు క్రీడలు అంటే ఎంతో ఇష్టమని, క్రీడాకారులకు తన వంతు సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని శ్రీనివాస గుప్త తెలిపారు. ఈ సందర్భంగా చైర్మెన్‌ను నిర్వాహకులు సన్మానించారు.

ఈ టోర్నమెంట్‌లో పాల్గొని విజయం సాధించిన వారు.. 35 ప్లస్ విభాగంలో వేణు, కార్తీక్, 50 ప్లస్ విభాగంలో వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఏసీపీ నరేష్, ఏసీపీ వెంకట్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ శోభన్ బాబు, నరేందర్, రాజిరెడ్డి, రఘుపతి రెడ్డితోపాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా, వైద్యం బాధ్యత ప్రభుత్వానిదే...


ప్రధానికి తెలంగాణ పౌర స్పందన వేదిక కొరియర్ ద్వారా వినతి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్ర బడ్జెట్ (2023-24)లో విద్యారంగానికి 10 శాతం, వైద్య రంగానికి ఆరుశాతం చొప్పున కేటాయించాలని తెలంగాణ పౌర స్పందన వేదిక డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీకి కొరియర్ ద్వారా 13789 సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించింది. హైదరాబాదులో 2035 సంతకాలు, రంగారెడ్డిలో 3503, మేడ్చల్ జిల్లాలో 1255, నల్లగొండలో 1254, సూర్యాపేటలో 3115, ఖమ్మంలో1634,యాదాద్రి-భువనగిరిలో 710, హన్మకొండలో 283 మంది ద్వారా సంతకాలు సేకరించినట్టు పౌరస్పందన వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎం.రాధేశ్యాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొఠారి కమిషన్ (1964-66) కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 10 శాతం నిధులు కేటాయించాలని సిఫారసులు చేసిందని గుర్తు చేశారు. ఇప్పటివరకు ఆయా ప్రభుత్వాలు దీన్ని పట్టించుకోలేదని విమర్శించారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సైతం నానాటికీ కుదిస్తున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్య రంగానికి కేంద్ర బడ్జెట్‌లో కనీసం ఆరు శాతం నిధులు కేటాయించాల్సి ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నప్పటికీ ఆయా ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయని విమర్శించారు. గత ఐదేండ్లలో విద్యకు 3,04 శాతం, 3.04శాతం, 3.26 శాతం, 2.67 శాతం, 2.64 శాతం చొప్పున, వైద్యానికి 2.16 శాతం, 2.23శాతం, 2.02 శాతం, 2.01 శాతం, 2.01 శాతం చొప్పున మాత్రమే కేటాయించిందని గుర్తుచేశారు. ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో మనదేశాన్ని ఒకటిగా నిలపాలంటే ఈ కేటాయింపులు సరిపోవని పేర్కొన్నారు. రాబోవు బడ్జెట్‌లో (2023-24) విద్యారంగానికి 10 శాతం, వైద్య రంగానికి ఆరు శాతం నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ విద్య వైద్య రంగాలను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇద్దరు పిల్లలతో గోదావరిలో దూకి తల్లి ఆత్మహత్య


(ఫైల్)

నవతెలంగాణ-బాసర

నిర్మల్ జిల్లా బాసర క్షేత్రం పరిధిలో హృదయ విదారక ఘటన జరిగింది. సోమవారం ఓ తల్లి తన ఇద్దరు పిల్లలతో కలిసి గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన మానస(27) భర్త నాలుగు సంవత్సరాల కిందట చనిపోయాడు. అప్పటి నుంచి కొడుకు బాలాదిత్య(8), భవ్యశ్రీ(7)తో కలిసి నిర్మల్‌లో తమ్ముడి ఇంటి వద్ద ఉంటూ పిల్లలను పోషిస్తోంది. పట్టణంలోని ఎల్వీఆర్ షాపింగ్ మాల్‌లో పనిచేస్తోంది. అయితే, సోమవారం పిల్లలతో కలిసి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. చిన్నారుల మృతదేహాలను చూసి పలువురు కంటతడి పెట్టారు. చిన్నారుల స్కూలు బ్యాగులు నది తీరం మెట్లపై ఉన్నాయి. మహబూబ్‌నగర్‌కు చెందిన ఈ కుటుంబం 14 సంవత్సరాలుగా నిజామాబాద్ పట్టణంలో నివసిస్తోంది. ఘటనా స్థలాన్ని సీఐ వినోద్‌రెడ్డి పరిశీలించారు. మత్స్యకారుల సాయంతో మృతదేహాలను బయటకు తీయించి భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే, వారి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మహేష్ తెలిపారు.

సంపాదకీయం

అసహన మేఘాల్లో..!



మన దేశ న్యాయవ్యవస్థ మీద ప్రజలకు అపారమైన నమ్మకం. తమను నేతలు దగా చేసినపుడో, ప్రభుత్వాధికారులు పీడించినపుడో, పోలీసుల వలనో, అసాంఘిక శక్తులనుంచో.. ఇలా సమస్త వ్యవస్థల నుంచీ తమకు అన్యాయం జరిగినపుడో న్యాయం కోసం సామాన్య జనం న్యాయ వ్యవస్థవైపు ఆశగా చూస్తారు. ఎంతో నమ్మికతో కోర్టు గడప తొక్కుతారు.

మనుషుల్ని, వారి ఆహారపు అలవాట్లని, సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించలేని సరికొత్త జాతీయవాదం మన ముందుకొచ్చింది. అసంఖ్యాకులైన భారతీయులందరూ ఆంక్షలతో బతకాల్సిందే. దేశభక్తికి సరికొత్త నిర్వచనం ఇచ్చేసిన తరుణంలో ఏమి తింటే, ఏమి అంటే ఏమవుతుందోనన్న దిగులు సర్వత్రా నెలకొంది. దేశంలో ఎన్నికల వాతావరణం మొదలైన నేపథ్యంలో ఇంకెంత ఉన్మాదం చెలరేగుతుందో..! ఇంకెలాంటి ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందో? పౌర సమాజమంతా ఒక్కటిగా నిలబడి పోరాడితే తప్ప ఈ విష సంస్కృతిని అరికట్టలేం. 'న్యాయమో... రామచంద్రా' అని దేశం ఎదురుచూస్తున్నది.

కానీ, ఆ న్యాయ వ్యవస్థ మీదే నమ్మకం కోల్పోయే ప్రమాదమిప్పుడు రోజురోజుకు పెరుగుతోంది. గోహత్యలను అడ్డుకుంటే ప్రపంచంలోని సమస్యలన్నీ పరిష్కారమవుతాయని గోవుల అక్రమ రవాణా కేసు విచారణ సందర్భంగా.. గుజరాత్‌లోని తాపీ జిల్లా కోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసులో జీవిత ఖైదుతో పాటు రూ.5లక్షల జరిమానా విధించింది. జడ్జి తన తీర్పును వెలువరిస్తూ ఆవు కేవలం జంతువు మాత్రమే కాదు, 68కోట్ల పవిత్ర స్థలాలకు, 33కోట్ల దేవత లకు నిలయమని వ్యాఖ్యానించారు.

అంతటితో ఆగలేదు ఆ న్యాయమూర్తి గోవధ చట్టాలను సమర్థించడం, ఆవుపేడతో రేడియేషన్ సమస్య రాదని సైన్స్ రుజువుచేసిందని, గోమూత్రం సర్వరోగ నివారిణి అని స్వయంగా 'శ్లోకాలు' పఠించారు. రాజ్యాంగాన్ని, చట్టాలను అనుసరించి చెప్పాల్సిన తీర్పులను పురాణాలు, కట్టుకథల ఆధారంగా చెప్పడం విస్తుగొల్పుతోంది. న్యాయ వ్యవస్థలోనూ తమ విభజన రాజకీయాలను జొప్పించి తాము వ్యతిరేకిస్తున్న సమూహాన్ని కాషా యానుకూల తీర్పులతో అకారణంగా, అన్యాయంగా బలిచేస్తున్నా రనడానికి ఇంతకంటే ఉదాహరణలేమి కావాలి?


దేశమంతటా అసహన మేఘాలు అలుముకుని ఉన్న కాలమిది. ఆ 'పరివారాని'కి నచ్చనిది తిన్నా, కట్టుకున్నా సహించలేని పరిస్థితులు మెడమీద కత్తిలా వేలాడుతున్న సమయమిది. కానీ, వాస్తవమేంటే గతం కంటే వీరికాలం లోనే 'గో' మాంసం ఎగుమతులు అనేక రెట్లు పెరిగాయి. ఆ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నదీ వీరి సహచరులే. ఈ ప్రభుత్వాలు చేసే చట్టాలు కేవలం ఒకే వర్గానికే తప్ప, వారికి వర్తించవు. అయినా తరతరాలుగా ఈ దేశంలోని ఆహారపు అలవాట్లను వ్యతిరేకించి చిచ్చు రేపడమే సంఘ్ పరివార్ రాజకీయ దురుద్దేశం. ఈ విధంగా కుల, మత దురహంకార మంటలు రేపుతుంటే... అక్కడి ప్రభుత్వాలు ఆ మంటలార్పకుండా చోద్యం చూస్తున్నాయి. 'కసాయి'మూకలు వాటితో చలి కాచుకోవడం ఆందోళనకరం. సైద్ధాంతికంగా తమకు వ్యతిరేక నేపథ్యం ఉన్న న్యాయమూర్తులను ఆ న్యాయవ్యవస్థచేతే వెంటాడి, వేధించే పాలకుల దుస్సాహసాలు ఢిల్లీ మూకదాడులపై విచారణకు ఆదేశించిన న్యాయమూర్తి ఉదంతంలో మనం చూశాం.

మనుషుల్ని, వారి ఆహారపు అలవాట్లని, సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించలేని సరికొత్త జాతీయవాదం మన ముందుకొచ్చింది. అసంఖ్యాకులైన భారతీయు లందరూ ఆంక్షలతో బతకాల్సిందే. దేశభక్తికి సరికొత్త నిర్వచనం ఇచ్చేసిన తరుణంలో ఏమి తింటే, ఏమి అంటే ఏమవుతుందోనన్న దిగులు సర్వత్రా నెలకొంది. దేశంలో ఎన్నికల వాతావరణం మొదలైన నేపథ్యంలో ఇంకెంత ఉన్మాదం చెలరేగుతుందో..! ఇంకెలాంటి ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందో? పౌర సమాజమంతా ఒక్కటిగా నిలబడి పోరాడితే తప్ప ఈ విష సంస్కృతిని అరికట్టలేం. 'న్యాయమో... రామచంద్రా' అని దేశం ఎదురుచూస్తున్నది.

బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచీ గోరక్షణ పేరుతో గ్రామాల్లో ముఠాలుగా ఏర్పడి ముస్లింలు, దళితులపై పాశవిక దాడులకు పాల్పడి కొట్టి చంపుతున్నారు. బీజేపీ ఏలుబడిలోని హర్యానా, ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లోనే మతోన్మాదుల దురాగతాలు అత్యధికంగా చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటివరకు జరిగిన గోమూకల హింసా ఘటనల్లో ఎందరో అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ నిమ్మకు నీరెత్తినట్టు ఉండటంతో గోమూకలు మరింత విజృంభిస్తున్నాయి. ఇలాంటి తీర్పులు ఆ మూకలకు కొత్త శక్తిని అందిస్తాయి. మూకలు పాల్పడే వివిధ నేరాలకు విధించగలిగే శిక్షల గురించి భారతీయ శిక్షాస్మృతి చెబుతున్నది. కానీ, మూకదాడులకు ప్రత్యేకంగా ఉద్దేశించిన చట్టమేమీ లేకపోవడమే వారికి మరింత బలాన్ని ఇస్తోంది. ఇంతవరకు అలాంటి చట్టాలు లేకపోయినా ఇప్పుడు ఆ చట్టాల అవసరమూ చాలా ఉన్నదన్న విషయం ఈ తాజా తీర్పు స్పష్టం చేస్తోంది. దేశంలో మూకదాడులు ఒక కొత్త నియమంగా మారిపోయాయి. ఈ వాతావరణాన్ని ఎంతటి కఠినమైన చట్ట మైనా బద్దలు కొట్టగలదా అన్న అనుమానం కలగక తప్పదు. దాడులకు పాల్పడుతున్న వారిని ప్రశంసిస్తూ స్వయంగా కేంద్రమంత్రులే కార్యకర్తలను రెచ్చగొడు తుండటం, పోలీసులు ప్రేక్షకపాత్రకే పరిమితమైన నేపథ్యంలో చట్టాలు మాత్రమే సమస్యను పరిష్కరించగలవన్నది సందేహమే. సమాజంలో సర్వత్రా అలుముకున్న ఈ భయానక ధోరణిని నిర్మూలించడానికి ఇప్పుడు ప్రధానంగా కావల్సింది రాజకీయ చిత్తశుద్ధి మాత్రమే.

ప్రజాసంక్షేమం - వక్రభాష్యాలు

పరస్పరం భిన్నమైన వర్గాలు ఒక సమాజంలో ఉన్నప్పుడు అక్కడ పాలకవర్గానికి తాను సాగించే వర్గ అణచివేతను సమర్థించుకోవడం అవసరం. అందుకు వీలుగా ఉండే చర్చను అది ప్రచారంలో పెడుతుంది. అటువంటి చర్చకు కొన్ని పదాలను ప్రత్యేకంగా అది ముందుకు తెస్తుంది. నయా ఉదారవాదం కూడా తనకు అనుకూలంగా ఉండే విధంగా ఒక చర్చను ముందుకు తెచ్చింది. ఆ చర్చలో తరచూ ఉపయోగిస్తున్న ఒక పదం "పాపులిజం" (ఓట్లకోసం చేపట్టే ప్రజాకర్షక విధానాలు అంటూ కొందరు ఈసడించుకునేది). ఈ పదానికి మీడియాలో అధిక ప్రాచుర్యం లభిస్తోంది. నయా ఉదారవాద విధానాల వలన ఎక్కువగా లబ్ధి పొందిన ఉన్నత మధ్యతరగతివర్గాల ప్రజలు ఈ విధానాలే కొనసాగాలని బలంగా కోరుకుంటున్నారు కనుక వారిద్వారా ఈ పదాన్ని ఎక్కువగా ప్రచారంలో పెడుతున్నారు. ఈ పదానికి వాస్తవంలో మంచి అర్థమే ఉంది. కాని దానిని ఎంతగా వక్రీకరిస్తున్నారంటే అభ్యుదయ భావాలు ఉండి సవ్యంగా ఆలోచించగల వ్యక్తులు సైతం దాని వక్రభాష్యాల ప్రభావానికి లోనవుతున్నారు. కార్పొరేట్ మీడియా ఆ పదానికి చెప్తున్న నికృష్టమైన అర్థంలోనే వాళ్ళు కూడా దానిని ఉపయోగిస్తున్నారు.




ప్రభాత్ పట్నాయక్

ఇంతకూ ఈ "పాపులిజం" అన్న పదం నయా ఉదారవాద మేధావులు కనిపెట్టినది కాదు. చాలా కాలం ముందునుంచే దీనిని వాడడం జరుగుతోంది. రష్యన్ మార్క్సిస్టులు, లెనిన్ కూడా, నరోద్నిక్కులను ఉద్దేశించి "పాపులిస్టులు" అన్న పదాన్ని ఉపయోగించేవారు. ప్రజలలో వివిధ వర్గాలు ఉన్నప్పటికీ, ఆ తేడాలు ఏవీ పరిగణనలోకి తీసుకోకుండా అందరినీ ఒకే గాటన కడుతూ నరోద్నిక్కులు "ప్రజలు" అన్న పదాన్ని ఉపయోగించేవారు. ఆ విధంగా ప్రజల నడుమ ఉండే వర్గ విభేదాలపట్ల విచక్షణ పాటించని ధోరణిని ఎత్తిచూపడానికి నరోద్నిక్కులను పాపులిస్టులు అని అన్నారు. దానర్థం "ప్రజలు" అనేవారిని కించపరచడం ఎంతమాత్రమూ కాదు. కార్మికులను, రైతాంగాన్ని కలిపి చెప్పడానికి లెనిన్ "శ్రామిక ప్రజలు" అన్న పదాన్ని తానే ఉపయోగించాడు. తక్కిన ప్రజలకు, వీరికి నడుమ ఉన్న తేడా చెరిగిపోకుండా ఉండాలనే ఆ విధంగా ఉపయోగిం చాడు. అయితే నయా ఉదారవాదం ఇప్పుడు ఈ పాపులిజం అన్న పదాన్ని వేరే అర్థాలతో వాడుతోంది. మత దురహంకారాన్ని రెచ్చగొట్టి శ్రామిక ప్రజల్లోని ఏ తరగతినైనా సమీకరించడానికి పూనుకుంటే దానినీ పాపులిజం అనే అంటోంది. మరోపక్క వారిని ఆర్థికంగా ఆదుకునే చర్యలు ఏవి చేపట్టినా వాటినీ పాపులిజం అనే అంటోంది.

ఫాసిస్టులు, అర్థ ఫాసిస్టులు తాము ప్రజలపై సాగిస్తున్న అణచివేతను కప్పిపుచ్చుకోడానికి ఇచ్చే పిలుపులనూ పాపులిజం అని అంటున్నారు. మరోవైపు ఆ ప్రజలు తమపై సాగుతున్న అణచివేత నుండి కొంత ఊరట పొందడం కోసం చేసే ప్రయత్నాలనూ పాపులిజం అనే అంటున్నారు. మొదటితరహాను మితవాద పాపులిజం అని, రెండో తరహాను వామపక్ష పాపులిజం అని అంటున్నారు. ఈ విధంగా చేయడం సైద్ధాంతికంగా బుద్ధిమాంద్యాన్ని కలిగించడమే కాదు, "మితవాద" పాపులిజం తోబాటు, "వామపక్ష" పాపులిజాన్ని కూడా అపవిత్రమైనదిగా చిత్రీకరించడానికి దారి తీస్తోంది. రెండింటినీ ఒకే గాటన కడుతోంది. ఈ రెండు ధోరణులూ తప్పు అని, ఈ రెండింటికీ నడుమ ఒక మధ్యేవాద (ఉదారవాద బూర్జువా ధోరణి) ధోరణి ఉందని, అదే సరైన ధోరణి అన్న ప్రచారం జోరుగా సాగుతోంది. రష్యన్ మార్క్సిస్టులు ఒకానొక సైద్ధాంతిక చర్చలో "ప్రజలు" అనే పదాన్ని అవగాహన చేసుకోవడం ఎలా అన్న సందర్భంలో ఉపయోగించిన "పాపులిజం" అనే పదం ఇప్పుడు తప్పుడు అర్థంలో వాడుతున్నారు. ఉదారవాద బూర్జువా సిద్ధాంతమే చాలా విశిష్టమైనది అన్న అభిప్రాయాన్ని కలిగించడానికి ఈ విధంగా చేస్తున్నారు.

ఇదేదో గందరగోళం మాత్రమే అని అనుకోవద్దు. చాలా స్పష్టంగా వాళ్ళు ప్రజల్ని తప్పుదోవ పట్టించాలని ప్రయత్నిస్తున్నారు. "మితవాద" పాపులిజం పేర చెలామణి అవుతున్న ఫాసిస్టు, నయా ఫాసిస్టు లేదా అర్థ ఫాసిస్టు ధోరణలన్నిటికీ ఉన్న ప్రధాన లక్షణం ప్రజానీకానికి ఏవిధమైన ఆర్థిక ప్రయోజనా లనూ కల్పించకపోవడమే. దానికి భిన్నంగా "వామపక్ష" పాపులిజం సంక్షేమ చర్యలను ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తుంది. కనీసం ప్రజలకు ఆర్థిక సహాయాన్నైనా అందించమని కోరుతుంది. ఈ రెండు రకాలనూ ఒకే గాటన కట్టడం, పైగా పాపులిజం అనేదే తప్పు అని చిత్రీకరించడం ద్వారా నయా ఉదారవాదం ప్రజలకు ఏవిధంగానైనా ఆర్థిక సదుపాయాలనూ కలుగజేయడమే తప్పు అన్నవైఖరిని అనుసరిస్తోంది. ఆ విధంగా ప్రజలకు రాయితీలను కల్పించే విధానాలను విడనాడాలని, దానికి బదులుగా ప్రభుత్వాలు జీడీపీ వృద్ధి సాధించడంమీదనే దృష్టి సారించాలని ప్రబోధిస్తుంది. ప్రజా సంక్షేమ చర్యలను చేపడట్టడం వలన వృద్ధికి కావలసిన ఆర్థిక వనరులు లేకుండా పోతాయని, అటువంటి సంక్షేమచర్యలను అమలు చేయడం వృథా ఖర్చు మాత్రమే అని, కేవలం ఎన్నికలలో లబ్ధి పొందడం కోసం మాత్రమే అటువంటి సంక్షేమ చర్యలను కొన్ని రాజకీయ పార్టీలు చేపడతాయని ప్రచారం చేస్తుంది. సమాజంలోని ఆర్థిక అసమానతలను తగ్గించేదిశగా ప్రభుత్వం ఏ చర్యలు చేపట్టినా, అవన్నీ తెలివితక్కువ చర్యలేనన్న నిర్ధారణకు ఈ నయా ఉదారవాదతర్కం దారి తీస్తుంది.



నయా ఉదారవాద వ్యవస్థను ఈ విధమైన చర్చ పూర్తిగా సమర్థిస్తుంది. ఈ నయా ఉదారవాద విధానాలు అమలు కాకమునుపు సమాజంలోని ఆర్థిక అసమానతలను తగ్గించాలన్న అంశాన్ని ఎవరైనా చర్చనీయాంశం చేస్తే దానిని ఎవరూ విమర్శించేవారు కాదు. వాస్తవానికి ఇందిరాగాంధీ ఒక ఎన్నికలలో గరీబీ హటావో నినాదాన్ని ఇచ్చి విజయం సాధించారు. ఆ పేదరికాన్ని ఆమె తగ్గించలేదన్నది వేరే విషయం. కానీ ఆ నినాదాన్ని ఆమె అమలు చేయనందుకు విమర్శించారే తప్ప ఆ నినాదమే తప్పు అని ఎవరూ అనలేదు. దేశ జీడీపీలో కేవలం 5శాతాన్ని పూర్తిగా పేదరిక నిర్మూలనకు కేటాయించగలిగితే పేదరికమే లేకుండా పోతుందని అమర్త్యసేన్ ఎప్పుడూ చెప్తూండేవారు. ఆర్థిక వ్యవస్థ ప్రభుత్వ నియంత్రణలో నడిచిన కాలంలో పేదరిక నిర్మూలన ప్రభుత్వ ప్రధాన కర్తవ్యాలలో ఒకటిగా ప్రాధాన్యత కలిగివుండేది. నయా ఉదారవాద వ్యవస్థ వచ్చాక ఆదాయాల్లో, సంపదలో అసమానతలు తగ్గేమాట అటుంచితే విపరీతంగా పెరిగిపోయాయి. ఆ అసమానతలను తగ్గించడం ఎలా అన్నది వాస్తవానికి ప్రధాన ఎజండాగా ఉండాలి. కాని ఆ విధంగా లేదు. ఆ కర్తవ్యానికి "పాపులిజం" అన్న పేరు తగిలించి అదేదో పనికిమాలిన కర్తవ్యం అన్నట్టు ప్రచారం చేస్తున్నారు. సమానత్వం సాధించడం అనే ఆదర్శాన్ని కార్పొరేట్ పెట్టుబడి చీదరించుకుంటోంది. ఆ కార్పొరేట్లకి తోడుగా ఈ మధ్య లాభపడుతున్న ఉన్నత మధ్యతరగతివర్గం కూడా పేదలకు అందించే ఆర్థిక సహాయాలను పనికిమాలిన చర్యలుగా అభివర్ణిస్తూ ప్రచారం చేస్తోంది.

బూర్జువా ఆర్థిక విధానంలో ఎప్పుడూ ఆర్థికవృద్ధికే అధిక ప్రాధాన్యత ఉంటుంది. ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలో జోక్యం చేసుకోవడం వలన ఆర్థికవృద్ధికి అది ఆటంకంగా ఉంటుంది అని ఆడం స్మిత్ ఎప్పుడూ వాదించేవాడు. ఆర్థికవృద్ధి ఫలితాలు శ్రామికవర్గానికి చేరవు అని అతనికి బాగాతెలుసు. దేశ సంపదను నిరంతరం పెంపొందించడమే ఒక లక్ష్యంగా ఉండాలన్నది అతని దృక్పథం. అతనికన్నా ముందరి ఆర్థికవేత్తల మాదిరిగా అతను సంపద అంటే బంగారమూ వెండీ అని భావించలేదు. సరుకులను ఉత్పత్తి చేసే సాధనాలను (యంత్రాలు, ముడిసరుకు వగైరా) కలిగివుండడమే సంపద అని ఆడం స్మిత్ భావించాడు. డేవిడ్ రికార్డో కూడా ఉత్పత్తి సాధనాలను పెంచుకోవడమే ప్రధానం అని భావించాడు. కాని రికార్డోకూ ఆ విధంగా సంపదను పెంచినందువలన కార్మికులకు ఎటువంటి ప్రయోజనమూ చేకూరదు అన్న సంగతి తెలుసు.

ఒకవేళ కార్మికవర్గం సంపద వృద్ధి ఫలితంగా ప్రయోజనం పొందితే అది ఆ కార్మికవర్గ జనాభా పెరుగుదలకు దారి తీస్తుందని, అందుచేత కార్మివర్గానికి ప్రయోజనం కలగాలంటే వారి జనాభా పెరగకుండా నియంత్రించాలని వారు తలచారు. అయితే ఆ జనాభా నియంత్రణ అన్నది ఆ కార్మికుల చేతుల్లో మాత్రమే ఉన్న విషయం. సాంప్రదాయ ఆర్థికవేత్తలు మాత్రం కార్మికుల స్థితిగతులు మెరుగుపడాలని, అందుకోసం వారు

"పాపులిస్టు చర్యలు" అంటూ(పత్రికల్లో ప్రజాకర్షక విధానాలు అంటారు) ఈ నయా ఉదారవాదులు సంక్షేమచర్యలను చీదరించుకోవడం, ఆ విధమైన చర్యలను విడనాడి కేవలం వృద్ధి పైనే దృష్టి పెట్టాలని చెప్పడం పేదలమీద దాడిని అంతకంతా తీవ్రతరం చేస్తుంది. ఒకపక్క ఆ పేదలకు అందవలసిన ప్రభుత్వ సహాయం అందకుండా నిరోధించి వారి జీవన ప్రమాణాలను దెబ్బ తీస్తుంది. మరోవైపు ఆర్థికవృద్ధి పేరుతో చేపట్టే కొత్త ప్రాజెక్టులు రైతులను నిర్వాసితులుగా మారుస్తాయి. ప్రజలను వారి ఊళ్ళకు దూరం చేస్తాయి.

జనాభాను నియంత్రించాలని కోరుకున్నారు. మొత్తం మీద పెట్టుబడిదారీ వృద్ధి అనేది కార్మికులకు దానివలన ప్రయోజనం కలుగుతుందా లేదా అన్నదానితో నిమిత్తం లేకుండా నిరాటంకంగా సాగిపోవాలనే పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు విశ్వసించారు.

అయితే ప్రస్తుతం నయా ఉదారవాద ఆర్థికవేత్తలు చెపుతున్నది వేరు. కార్మికుల పరిస్థితులు ఇప్పుడు దిగజారిపోవడానికి కారణం వారి జనాభా పెరిగిపోవడమే అని ఎవరూ విశ్వసించడంలేదు. ప్రభుత్వం శ్రామికుల ఆదాయాలను పెంచడానికి వారికి అనుకూలంగా చర్యలు చేపడితే వారి స్థితిగతులు మెరుగుపడతాయన్న విషయం అందరికీ తెలిసినదే. కాని ఆ విధంగా చేయడం వలన ఆర్థిక వృద్ధి దెబ్బ తింటుందన్న కొత్త వాదనను నయా ఉదారవాద ఆర్థికవేత్తలు ముందుకు తెస్తున్నారు. గతకాలపు సాంప్రదాయ ఆర్థికవేత్తలకు శ్రామికవర్గ పరిస్థితుల పట్ల సానుభూతి అయినా ఉండేది. కాని నయా ఉదారవాద ఆర్థికవేత్తలకు మాత్రం ఆ సానుభూతి కూడా లేదు. పెట్టుబడిదారీ వర్గం మాదిరిగానే వారు కూడా శ్రామికవర్గం పట్ల శతృపూరిత వైఖరినే అనుసరిస్తున్నారు.

"పాపులిస్టు చర్యలు" అంటూ(పత్రికల్లో ప్రజాకర్షక విధానాలు అంటారు) ఈ నయా ఉదారవాదులు సంక్షేమ చర్యలను చీదరించుకోవడం, ఆ విధమైన చర్యలను విడనాడి కేవలం వృద్ధి పైనే దృష్టి పెట్టాలని చెప్పడం పేదలమీద దాడిని అంతకంతా తీవ్రతరం చేస్తుంది. ఒకపక్క ఆ పేదలకు అందవలసిన ప్రభుత్వ సహాయం అందకుండా నిరోధించి వారి జీవన ప్రమాణాలను దెబ్బ తీస్తుంది. మరోవైపు ఆర్థికవృద్ధి పేరుతో చేపట్టే కొత్త ప్రాజెక్టులు రైతులను నిర్వాసితులుగా మారుస్తాయి, ప్రజలను వారి ఊళ్ళకు దూరం చేస్తాయి. కొత్త ప్రాజెక్టులవలన కొన్ని కొత్త రకాల ఉద్యోగాలు రావచ్చు. కాని వాటిలో ఈ నిర్వాసితులకు దక్కేవి మాత్రం చాలా తక్కువ. పైగా, కొత్తగా ఏర్పడే ఉపాధి అవకాశాలు ప్రాజెక్టుల కారణంగా దెబ్బ తిన్న ఉపాధి అవకాశాలకన్నా తక్కువగా ఉంటాయి. ఇక నిర్వాసితులకు కల్పిస్తామని చెప్పిన పునరావాసపు హామీలలో వాస్తవరూపం ధరించేవి చాలా స్వల్పం. రైతులే సమిష్టిగా ముందుకొచ్చి వాళ్ళే గనుక పారిశ్రామిక ప్రాజెక్టులు చేపడితే అప్పుడు జరిగేది వేరుగా ఉంటుంది. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆ విధంగా జరగదుకదా.

"పాపులిజం" అని "ప్రజాకర్షక పథకాలు" అని చీదరించు కుంటూ ఆర్థిక వృద్ధే సర్వస్వం అని చేసే ప్రచారం పూర్తిగా ప్రజావ్యతిరేక ప్రచారమే. ఇదే అచ్చమైన నయా ఉదారవాద ప్రచారం.

(స్వేచ్ఛానువాదం)

రిపోర్టర్స్ డైరీ

నువ్విక్కడ... నేనక్కడ...

'నువ్వక్కడ... నేనిక్కడ... పాటక్కడ... పలుకిక్కడ... మనసొక్కటి కలిసున్నది ఏనాడైనా...' అంటూ 'మంచి మనసులు'లో ఆచార్య ఆత్రేయ రాసిన లిరిక్‌ను ఇప్పుడు బీఆర్ఎస్ కార్యకర్తలు 'హమ్మింగ్' చేస్తున్నారు. ఎందుకనే డౌటనుమానం వస్తుంది కదా...! ఇగో ఇదీ విషయం... ఈ మధ్య మంత్రి కేటీఆర్ సీఎం కేసీఆర్‌కు దూరం దూరంగా ఉంటున్నారని టాక్... అదేంటో... బీఆర్ఎస్ ఏర్పడ్డాక సీఎం కేసీఆర్‌తో కలిసి వేదిక పంచుకోవడం తక్కువైంది. అటు పార్టీలోనూ కేసీఆర్ తర్వాతి స్థానం కేటీఆర్‌దే. ఆయన అధ్యక్షుడు అయితే, ఈయన కార్యనిర్వాహక అధ్యక్షుడు. అయినా... అనేక ప్రధాన సందర్భాల్లో ఏదో కారణం చెపుతూ, ఆయన సీఎం కేసీఆర్‌కు దూరంగానే ఉంటున్నారు. ఆ మధ్య ఢిల్లీలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి మంత్రి కేటీఆర్ డుమ్మా కొట్టారు. తాజాగా సీఎం కేసీఆర్‌తో పాటు కేరళ, ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు, యూపీ మాజీ ముఖ్యమంత్రి సహా పాల్గొన్న బీఆర్ఎస్ ఖమ్మం భారీ బహిరంగ సభలోనూ మంత్రి కేటీఆర్ పాల్గొనలేదు. ఆ టైంలో ఆయన దావోస్ అంతర్జాతీయ వాణిజ్య సదస్సులో ఉన్నారు. ఢిల్లీ, ఖమ్మం బీఆర్ఎస్ కార్యక్రమాలకు కేసీఆర్ కుమార్తె కవిత అటెండ్ అయ్యారు. ఈ రెండు ప్రోగ్రాంలకూ కొడుకు కేటీఆర్ డుమ్మా కొట్టారు. ఇప్పుడు దీనిపైన రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చే జరుగుతుంది. పార్టీపై కుటుంబ పాలన ముద్ర పడకుండా 'కల్వకుంట్ల' ఫ్యామిలీ హుషారైతందని కొందరు సమర్థిస్తుంటే... దేశ రాజకీయాలకంటే మంత్రి కేటీఆర్‌కు రాష్ట్ర రాజకీయాలపైనే ఎక్కువ మక్కువ అనే ఇండికేషన్స్‌ను కేడర్‌కు పంపుతున్నారనే విశ్లేషణలు జరుగుతున్నాయి. 'గాంధీ' కుటుంబ వారసత్వ రాజకీయాల్ని వ్యతిరేకించే పార్టీలతో జట్టు కట్టాలంటే ఈ ఎడబాటు తప్పదంటూ ఆపార్టీ నేతలు నోళ్లు నొక్కుకుంటున్నారు. మరి 'కల్వకుంట్ల' వారు ఏం క్లారిటీ ఇస్తారో!

-ఎస్ఎస్ఆర్ శాస్త్రి

వెంకన్న రాలే..!

రానుకున్నారా? రాలేననుకున్నారా? అంటూ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గాంధీభవన్‌కు వచ్చారు. ఏదో రకంగా వార్తల్లో ఉండే ఆయన... శుక్రవారం గాంధీభవన్‌కు రావడంతోపాటు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని కలవడం, ఇద్దరూ కలిసి మాట్లాడుకోవడం, ఆ వీడియోలను విడుదల చేయడం, దాన్ని మీడియా ఆకాశానికెత్తడం వెంట వెంటనే జరిగిపోయాయి. ఆకాశం, భూమి కలిసిపోయినట్టుగా సామాజిక మాధ్యమాలు ప్రచారం చేశాయి. కానీ అంతలోనే వెంకన్న తుస్ మనిపించారు. శుక్రవారం జరిగిన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశానికి ఆయన రాలే. దీంతో కథ సుఖాంతమైందనుకుంటున్న కాంగ్రెస్‌కు కథ మళ్లీ మొదటికొచ్చింది. గాంధీభవన్‌లో ఎంతో ఉషారుగా కనిపించిన వెంకన్న... ఈ రోజు ముఖం చాటేశారు. దీంతో వెంకన్న ఏం చేసినా వార్తల్లో వ్యక్తిగా ఉంటాడు. సొంత పార్టీపైన్నే ఆయన బాణం ఎక్కుపెడతాడు. నేతలపైనే ఆయన మండిపడుతాడు. గతంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డినీ వదల్లేదు, ఇప్పుడు రేవంత్‌ను వదలట్లేదు. ఆయనేం మనిషయ్యా బాబూ అని గాంధీభవన్‌లో చెవులు కొరుక్కుంటున్నారు.

- గుడిగ రఘు.

నేతాజీ వారసత్వాన్ని దొంగిలించ గలరా?

ఈ నెల 23వ తేదీన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని కలకత్తాలో నిర్వహించేందుకు భారత జాతీయోద్యమంలో ఎలాంటి భాగస్వామ్యంలేని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) సన్నద్ధమవుతుందని తెలిసి నేతాజీ కూతురు అనితా బోస్ మండి పడింది. తన తండ్రి వామపక్షవాది అనీ, ఆరెస్సెస్ భావజాలానికి, ఆయన ఆలోచనలకు ఎలాంటి పొంతన లేదని అన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ పోషించిన వీరోచిత పాత్ర ఫలితంగా వచ్చిన గొప్ప పేరును ఉపయోగించుకునే ప్రయత్నంలో భాగంగా ఆరెస్సెస్ ఆ కార్యక్రమం నిర్వహిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఆమె చెప్పిన విధంగా ఎలాంటి పొంతనలేని ఆ రెండు భావజాలాలను పరిశీలిద్దాం.

భారతదేశంలో 1920, 30 దశకాలలో వామపక్షం బలపడటంతో దేశంలో సామ్యవాద ఆలోచనలు వేళ్ళూనుకోవడం ప్రారంభమైంది. సామ్యవాదం (సోషలిజం), యువతకు ఆమోదయోగ్యమైన విధానంగా అవతరించింది. నెహ్రూ, సుభాష్ చంద్రబోస్‌లు వారి ఆలోచనలకు ప్రతీకలుగా కనిపించేవారు. 1936, 1937లలో నెహ్రూ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నిక కావడం, ఆ తర్వాత రెండేళ్ళకు సుభాష్ చంద్రబోస్ ఆ పదవిని చేపట్టడం కాంగ్రెస్‌లో బలపడుతున్న వామపక్ష ధోరణులకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. 1939లో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి వామపక్ష ప్రతినిధిగా పోటీ చేసిన సుభాష్ చంద్రబోస్ 1580 ఓట్లలో 1377 ఓట్లు తెచ్చుకొని పట్టాభి సీతారామయ్యను ఓడించాడు.



బోడపట్ల రవీందర్

హిందూ మహాసభ నాయకుడైన వీడీ సావర్కర్, ఆరెస్సెస్, బీజేపీ భావజాలాన్ని సూచించే 'హిందూత్వ' అనే పదాన్ని వాడుకలోకి తెచ్చాడు. భారతదేశం పవిత్ర భూమిగా, పితృభూమిగా కలిగి ఉన్న వారికి మాత్రమే చెందుతుందని సావర్కర్ పేర్కొన్నాడు. మన దేశానికి చెందిన ముస్లింలు, క్రైస్తవులు హిందువులుగా గుర్తించబడరనీ, ఇతరుల వలె వారి హిందుస్థాన్ పితృదేశం అయినప్పటికీ పవిత్ర దేశం మాత్రం కాదనీ, వారి పవిత్ర దేశం అరేబియా లేదా పాలస్తీనాలు అని తన రచన "ఎసెన్షియల్స్ ఆఫ్ హిందూత్వ"లో సావర్కర్ పేర్కొన్నాడు.

హిందూ, ముస్లింల ప్రయోజనాలు భిన్నంగా ఉంటాయని చెప్పడం కన్నా పెద్ద అబద్ధం ఏమీ లేదని నేతాజీ అభిప్రాయ పడ్డాడు. హిందూ, ముస్లింల ప్రయోజనాలు ఒకే విధంగా ఉండవని చెపుతున్నవారు నిజం మాట్లాడడం లేదనీ, అన్ని మతాలవలె ఇస్లాంకు కూడా భారతదేశంలో స్థానం ఉందన్నాడు. ప్రతి మతానికి సంబంధించిన చరిత్ర, సాంప్రదాయాలు, ఆదర్శాలతో పరిచయం ఉండాల్సిన అవసరం ఉందనీ, భిన్న మతాల సంస్కృతి మత సామరస్యానికి, ఐక్యతకు మార్గం వేస్తుందని నేతాజీ అభిప్రాయం. మతపరమైన సాంప్రదాయం, సాంస్కృతిక సహవాసానికి పెద్ద అడ్డంకి అనీ, దానికి లౌకిక, శాస్త్రీయ విద్యే పరిష్కారమని నేతాజీ భావించాడు.

ఇందుకు భిన్నంగా మైనారిటీలను జాతి వ్యతిరేకులని, తీవ్రవాదులని ముద్ర వేస్తూ, వారిని విదేశీయులుగా, అక్రమ చొరబాటు దారులుగా ఆరెస్సెస్, బీజేపీ నాయకులు వారిపై విషం చిమ్ముతున్నారు. బీజేపీ నాయకులు, సంఘ్ పరివార్ శక్తులు మైనారిటీలను కాల్చివేయాలనీ, నిర్దాక్షిణ్యంగా చంపెయ్యాలని బహిరంగంగా పిలుపునిస్తున్నారు. ఇలాంటి పిలుపులు ప్రజలను మత పరంగా విభజించడానికి మాత్రమే దారి తీస్తాయి.

బ్రిటిష్ వారి రాకకు ముందు భారతదేశంలో రాజకీయ క్రమాన్ని వివరించే సందర్భంలో ముస్లిం పాలన గురించి తప్పుగా మాట్లాడితే చరిత్రలో రుజువులు ఉంటాయి. ఢిల్లీలోని మొగల్ చక్రవర్తులు లేదా బెంగాల్ ముస్లిం రాజులు ఎవరి గురించి మాట్లాడినా, వారి సామ్రాజ్యాలను హిందూ ముస్లింలే కలిసి పాలించారు. వారి ముఖ్యమైన కేబినెట్ మంత్రులు, జనరల్స్ అంతా హిందువులే. హిందూ చీఫ్ కమాండర్స్ సహాయ సహకారాలతోనే భారతదేశంలోని మొగల్ సామ్రాజ్యం సంఘటిత పడింది. పైన పేర్కొన్న విధంగా హిందూ ముస్లింల ప్రయోజనాలు భిన్నమైనవనే ప్రచారాన్ని నేతాజీ కొట్టి పారేశాడు.

దేశ విభజన విషయంలోనూ బీజేపీ నాయకులు చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. 1971 బంగ్లాదేశ్ విముక్తి యుద్ధంలో పాకిస్థాన్‌పై భారతదేశం విజయం సాధించి 50ఏండ్లు పూర్తి అయిన సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మత ప్రాతిపదికన భారతదేశ విభజన ఒక చారిత్రక తప్పిదం అని వ్యాఖ్యానించారు. కానీ ఈ చారిత్రక తప్పిదానికి ఎవరు బాధ్యులు?

బ్రిటిష్ వారిని మన దేశం నుండి వెళ్ళగొట్టేందుకు సింగపూర్‌లో ఇండియన్ నేషనల్ ఆర్మీ నాయకత్వ బాధ్యతల్లో ఉన్న నేతాజీ సైన్యాన్ని చేర్చుకునే పనిలో ఉంటే... సావర్కర్, ఆర్ఎస్ఎస్‌లు బ్రిటిష్ వారితో చేతులు కలిపారు. హిందూ మహాసభ అధ్యక్షునిగా సావర్కర్ దేశంలోని హిందువులంతా లక్షల సంఖ్యలో సంఘటిత హిందూ హృదయాలతో బ్రిటిష్ సైన్యంలో, నావికాదళంలో, వైమానిక దళంలో చేరాలని పిలుపునిచ్చాడు. కేవలం ఒక్క సంవత్సర కాలంలోనే హిందూ మహాసభ కృషి ఫలితంగా లక్ష మంది హిందువులు బ్రిటిష్ సాయుధ సైన్యంలో చేరారు. ఇది నేతాజీని వెన్నుపోటు పొడవడం కాదా?

1923లో "ఎసెన్షియల్స్ ఆఫ్ హిందూత్వ" పేరుతో, 1928లో "హిందూత్వ:హూ ఈజ్ ఏ హిందూ?" పేరుతో ప్రచురించిన తన రచనలో హిందూత్వ భావాలను వ్యక్తం చేసిన సావర్కరే బాధ్యత వహించాలి. ఎందుకంటే ఆయన హిందువులకు ప్రత్యేక దేశాన్ని డిమాండ్ చేస్తూ ముస్లింలీగ్ కంటే ముందే ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. కానీ ఈ వైఖరికి భిన్నంగా దేశ విభజనను నేతాజీ పూర్తిగా వ్యతిరేకించారని ఆయన సైన్యంలో మహిళా రెజిమెంట్‌కు అధినేత్రిగా పని చేసిన కెప్టెన్ లక్ష్మీ సెహగల్, హుమా ఖురేషికిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. విభజన అనేక విభజనలకు దారి తీస్తుంది కాబట్టి, నేతాజీ తన అభిప్రాయాలను అంతకు ముందే గాంధీ, నెహ్రూలకు తెలియజేశారని కెప్టెన్ సెహగల్ అన్నారు.



హిందువులంతా ఒక జాతి అనే విషయాన్ని వివేకవంతులెవరూ ప్రశ్నించరనీ, జనాభాలో హిందువులే అధిక సంఖ్యాకులుగా ఉన్నారనే విషయాన్ని ఆమోదించడానికి ఎలాంటి ఇబ్బంది ఉండదనీ, కాబట్టి భారతదేశంలోని విదేశస్థులు హిందూ సంస్కృతి, భాషను స్వీకరించాలనీ, హిందూ మతాన్ని గౌరవించడం నేర్చుకోవాలనీ, లేకుంటే వారి హక్కులను, సౌకర్యాలను, ఉనికిని వదులుకొని హిందూమతంలో కలిసిపోవాలనీ లేదా హిందూ జాతికి లోబడి ఉంటూ దేశంలో ఉండవచ్చని ఆరెస్సెస్ మరో సిద్ధాంతకర్త గోల్వాల్కర్ తన రచన "వియ్ ఆర్ అవర్ నేషన్ హుడ్ డిఫైన్డ్"లో పేర్కొన్నాడు.

భారతదేశం ఒక గొప్ప దేశంగా మారాలని మనం కోరుకుంటే ఒక ప్రజాస్వామిక సమాజపు పునాదులపై ఒక రాజకీయ ప్రజాస్వామ్యాన్ని నిర్మించాలనీ, కులం, జాతి, పుట్టుకలపై ఆధారపడే ప్రత్యేక హక్కులు, సౌకర్యాలేవీ ఉండకూడదనీ, కులం, మతం, జాతితో నిమిత్తం లేకుండా అందరికీ సమాన అవకాశాలు ఉండాలని నేతాజీ తన రచన "ఇండియన్ స్ట్రగుల్"లో పేర్కొన్నాడు.

ఆరెస్సెస్, హిందూ మహాసభలు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి చాలా విశ్వాసంగా ఉన్నాయి. సావర్కర్ రాజకీయ ఖైదీగా అండమాన్ జైలులో ఉండి నవంబర్ 14, 1913లో బ్రిటిష్ ప్రభుత్వానికి క్షమాభిక్ష పెట్టాలని పిటీషన్ పెట్టుకున్నాడు. ప్రభుత్వం తనపై దయదలచి క్షమాభిక్షను ప్రసాదిస్తే, ప్రభుత్వానికి విధేయునిగా ఉంటూ ఏ స్థాయిలోనైనా ప్రభుత్వానికి సేవ చేసుకుంటానని ఆ పిటీషన్‌లో పేర్కొన్నాడు. కానీ నేతాజీ జైలు నుంచి విడుదల కావడం కోసం బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఏనాడూ ప్రాధేయపడలేదు. అంతేకాదు, భగత్‌సింగ్, చంద్రశేఖర ఆజాద్, రాంప్రసాద్ బిస్మిల్, అశ్ఫఖుల్లా ఖాన్, రాజ్ గురు, రోషన్ సింగ్, సుఖ్ దేవ్ లాంటి విప్లవ యోధులెవరూ క్షమాభిక్ష కోసం బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఏనాడూ ప్రాధేయపడలేదు. కానీ వీరందరి కన్నా ఆరెస్సెస్, బీజేపీలకు సావర్కర్ గొప్ప దేశభక్తుడట. అందుకనే అండమాన్‌లోని పోర్ట్ బ్లెయిర్ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టారు.

బ్రిటిష్ వారిని మన దేశం నుండి వెళ్ళగొట్టేందుకు సింగపూర్‌లో ఇండియన్ నేషనల్ ఆర్మీ నాయకత్వ బాధ్యతల్లో ఉన్న నేతాజీ సైన్యాన్ని చేర్చుకునే పనిలో ఉంటే... సావర్కర్, ఆర్ఎస్ఎస్‌లు బ్రిటిష్ వారితో చేతులు కలిపారు. హిందూ మహాసభ అధ్యక్షునిగా సావర్కర్ దేశంలోని హిందువులంతా లక్షల సంఖ్యలో సంఘటిత హిందూ హృదయాలతో బ్రిటిష్ సైన్యంలో, నావికాదళంలో, వైమానిక దళంలో చేరాలని పిలుపునిచ్చాడు. కేవలం ఒక్క సంవత్సర కాలంలోనే హిందూ మహాసభ కృషి ఫలితంగా లక్ష మంది హిందువులు బ్రిటిష్ సాయుధ సైన్యంలో చేరారు. ఇది నేతాజీని వెన్నుపోటు పొడవడం కాదా?

ఆరెస్సెస్, బీజేపీలు భారతరాజ్యాంగ పీఠికలో పేర్కొనబడిన సోషలిజం అనే పదాన్ని ఎగతాళి చేస్తూ, కమ్యూనిస్టులను జాతి వ్యతిరేకులుగా పేర్కొంటున్నారు. నేతాజీ బోల్షెవిక్ విప్లవం గురించి చాలా ఉన్నతమైందిగా భావించి, భారతదేశ భవిష్యత్తు కూడా అలాంటి విప్లవంతో ముడిపడి ఉంటుందని భావించాడు. 20వ శతాబ్దంలో రష్యా కార్మికవర్గ విప్లవం, కార్మికవర్గ ప్రభుత్వం, కార్మిక వర్గ సంస్కృతిలో విజయం సాధించడం ద్వారా సంస్కృతి, నాగరికతలను సుసంపన్నం చేసిందని నేతాజీ "ద ఇండియన్ స్ట్రగుల్"లో పేర్కొన్నారు. కార్ల్‌మార్క్స్, లెనిన్, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ అధికార విధాన ప్రకటనల్లో వ్యక్తం చేసిన విధంగా కమ్యూనిజం, జాతీయ స్వాతంత్ర్యోద్యమ పోరాటానికి పూర్తి మద్దతు ఇచ్చి, దాని ప్రాపంచిక దృక్పథంలో భాగంగా ఆ పోరాటాన్ని గుర్తించడం పట్ల తన సంతృప్తిని వ్యక్తం చేశాడు.

కాబట్టి, ప్రతి విషయంలో నేతాజీతో విభేదించేవారు, ఆయన వారసత్వాన్ని దొంగిలిస్తామంటే అది సాధ్యపడే విషయం కాదు. ఆయన అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ కూడా స్వేచ్ఛను కోరుకున్న ఈ దేశ ప్రజల హృదయాల్లో ఉంటాడు కానీ, అతని భావాలను మంటగలుపుతూ, అతని కీర్తి, ప్రతిష్ఠలను మాత్రం ఉపయోగించుకోవాలని ఆరాటపడే వారి హృదయాల్లో మాత్రం కాదు.

సెల్:9848412451

బొగ్గు చట్టాలపై అవగాహన ఉండాలి

- సింగరేణి మేనేజర్ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-సత్తుపల్లి



గనిలో పనిచేసే ప్రతీ కార్మికుడు బొగ్గు గనుల చట్టాలు, నిబంధనలు తప్పక తెలుసుకోవాలని సింగరేణి డీజీఎం మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. సింగరేణి పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో సోమవారం కిష్టారం ఓసీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతీ కార్మికుడు గనులపై, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా రక్షణతో కూడిన ఉత్పత్తి సాధ్యమవుతుందన్నారు. సేఫ్టీ జీఎం గురవయ్య ఆధ్వర్యంలో ఈ పక్షోత్సవాలు జరుగుతాయని, కార్మికులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఉన్నతస్థాయి అధికారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తుపల్లి సత్తా చాటిన 'టాలెంట్'

- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర

- ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సండ్ర సత్కారం

నవతెలంగాణ-సత్తుపల్లి



రాష్ట్రస్థాయిలో నిర్వహించిన టాలెంట్‌టెస్టులో సత్తుపల్లి పట్టణం సిద్దారం రోడ్డులోని టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి సత్తుపల్లి సత్తాను రాష్ట్రమంతటా చాటారని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. అక్షర నిర్మాణ స్వచ్ఛంద సంస్థ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జీకే మహామేథా టాలెంట్ టెస్టులో టాలెంట్ స్కూలు విద్యార్థులు దండమూడి లక్ష్మీదుర్గా, చక్రపు సహస్ర స్టేట్ టాపర్లుగా నిలిచి రూ.10వేల నగదు ప్రోత్సాహకం, సైకిల్‌ను గెలుపొందగా, బెస్ట్ స్కూల్‌గా టాలెంట్ స్కూల్, బెస్ట్ టీచర్‌గా పాఠశాల ఉపాధ్యాయుడు రమణశంకర్‌లు పురస్కారాలు పొందారు. విషయం తెలుసుకున్న సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య సోమవారం పాఠశాలను సందర్శించి విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఉపాధ్యాయుడు శంకర్‌ను, యాజమాన్యాన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ సత్తుపల్లి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలబడటం శుభ పరిణామమన్నారు. ఈ విజయం వెనుక ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థులు, యాజమాన్యం మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి మల్లూరు అంకమరాజు, సీనియర్ నాయకులు దొడ్డా శంకరరావు, పాఠశాల కరస్పాండెంట్ పులి అరుణ, ప్రిన్సిపాల్ పులి శ్రీనివాసరావు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ - బోనకల్



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బోడేపూడి వేణుమాధవ్, సర్పంచ్ ములకారపు రవి కోరారు. మండల పరిధిలోని చిరునోముల గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం వారు ప్రారంభించారు. చిరునోముల ఎంపీటీసీ కోటపర్తి హైమావతికి వైద్యులు తొలి పరిక్ష నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి రిటైర్డ్ ఉపాధ్యాయుడు వాసిరెడ్డి సీతారామయ్య పంచాయతీ కార్యదర్శి బంధం అర్జున్ పంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మ హత్య

నవతెలంగాణ-చింతకాని

పాతర్ల పాడు గ్రామానికి చెందిన కుమ్మరి నాగేంద్ర(25) ఉదయం గడ్డికి కొట్టే మందు తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించింది.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవ తెలంగాణ-ఖమ్మంరూరల్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన మండల పరిధిలోని కాచిరాజుగూడెంలో సోమవారం చోటు చేసుకుంది.రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం నవరంపూర్ జిల్లా కైర్బాడి గ్రామానికి చెందిన టెకురాం ముండా(30), ప్రేమశీల ముండా దంపతులు మండల పరిధిలోని కాచిరాజుగూడెంలోని ఇటుకబట్టీలో రెండునెలలుగా పనిచేస్తున్నారు. ఇటుకబట్టీల వద్దనే నివాసం ఉంటున్నారు. ఈనెల 21వ తేదీన టెకురాం ముండా మద్యం మత్తులో తమ తోటి కూలీలను ఇష్టం వచ్చినట్లు తిట్టాడు.ఇంటికి వచ్చిన తరువాత అనవసరంగా తిట్టానని బాధపడ్డాడు.కూలీలు ఏమైనా అంటారేమోనని మనస్తాపం చెందిన టెకురాం ముండా 21వ తేదీన బహిర్భూమికి అని చెప్పి బయటికి వెళ్లి సోమవారం కాచిరాజుగూడెం శివారులో గుట్టపైన ఉన్న చెట్టుకుఉరేసుకొని మృతి చెంది ఉన్నాడు. తోటి కూలీలను తిట్టానని మనస్తాపం చెంది, మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. తెలిపారు.అయితే టేకురం ముండా మృతిపై పలు అనుమానాలున్నాయి.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

నవతెలంగాణ - బోనకల్

మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఆయుర్వేద వైద్యాధికారి తన్నీరు రాంప్రసాద్ నిర్వహించారు. 95 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయుర్వేద వైద్యశాలలో అన్ని రకాల మందులు ప్రస్తుతం లభిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ లింగమనేని నళిని శ్రీ, డిస్పెన్సరీ ఫార్మాసిస్ట్ పి.పద్మావతి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నేడు రైతు సంఘం వర్క్‌షాప్

నవతెలంగాణ-ముదిగొండ

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యకర్తల శిక్షణ తరగతి, వర్క్ షాప్ ముదిగొండ మచ్చా వీరయ్య భవనంలో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కందుల భాస్కర్ రావు, కోలేటి ఉపేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు ముఖ్యఅతిథులుగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు వాసిరెడ్డి వరప్రసాద్ హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. రైతు సంఘం కార్యకర్తలు,నాయకులు సకాలంలో హాజరై వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని వారు కోరారు.

'న్యూఇరా' విద్యార్థికి గోల్డ్ మెడల్

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మం నగరంలోని న్యూఇరా పాఠశాల రెండవ తరగతి విద్యార్థియైన వివాన్ శ్రేయస్ జంటనగరాల రోలర్ స్కేటింగ్ పోటీలో జూనియర్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. పాఠశాల చైర్మన్ ఐవి.రమణారావు చిన్నారి శ్రేయస్‌ను అభినందిస్తూ, ఇంత చిన్న వయస్సులో అద్భుత సాధన ద్వారా బంగారు పతకం సాధించడం హర్షించదగిన విజయమని, ఈ విజయం చిన్నారి ఉజ్వల భవిష్యత్తు చక్కని సోపానం అవుతుందని ఆకాంక్షిస్తూ, ఆశీర్వదించారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ పి.భూమేశ్వరరావు శ్రేయస్‌ను తోటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని క్రమశిక్షణతో సాధన చేసి, అన్ని రంగాలలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వి.భరత్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



భీమిరెడ్డివారి 'పంచల' వేడుకలో సండ్ర దంపతులు

నవతెలంగాణ- సత్తుపల్లి

బీఆర్ఎస్ మండలపార్టీ ప్రధాన కార్యదర్శి భీమిరెడ్డి గోపాల్‌రెడ్డి కుమారుడు వివేక్ పంచల వేడుకల కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మహాలక్ష్మీ దంపతులు పాల్గొన్నారు. చిన్నారి వివేక్‌ను సండ్ర దంపతులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆత్మ ఛైర్మెన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకరరావు, వల్లభనేని పవన్, నాయకులు దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి (ఎర్రబాబు), గొర్ల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మతోన్మాద దాడులను అరికట్టండి : స్వేచ్ఛ జేఏసీ

నవతెలంగాణ- ఖమ్మం



మతోన్మాద దాడులను అరికట్టాలని స్వేచ్ఛ జేఏసీ రాష్ట్ర నాయకులు నామాల ఆజాద్, పి.నాగిరెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, సిపిఐ జిల్లా నాయకులు మేకల శ్రీనివాస్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎస్.మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోలోని జెడ్పీ సెంటర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర స్వేచ్ఛ జేఏసీ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అభ్యుదయవాదులు, టీచర్లు, అంబేద్కర్‌వాదులు, హేతువాదులు, భౌతికవాదులు, నాస్తికులపై మతోన్మాదులు చేస్తున్న మూకదాడులు ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో ఉపాధ్యాయులు మల్లికార్జున్‌పై దాడి చేసిన దుండగులను చట్ట ప్రకారం శిక్షించకుండా వారందరినీ అరెస్ట్ చేయకపోవడం, అరెస్ట్ చేసిన వారికి సైతం బెయిల్ మంజూరు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం నీరుగార్చడం దుర్మార్గం అన్నారు. సంఘ్ పరివార్ శక్తులు చట్టాన్ని చేతిలోకి తీసుకోని, న్యాయ వ్యవస్థను పక్కదారి పట్టించడం శోచనీయం అన్నారు. ప్రభుత్వం న్యాయ వ్యవస్థపై ప్రజలకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని, న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా నడిచేలా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో మాట్లాడే అవకాశం లేకుండా, ప్రశ్నించేతత్వాన్ని కాలరాయడం ఎంత వరకు సమంజసం అన్నారు. విద్యాలయాల్లో శాస్త్రీయ విద్య బోధన జరపకుండా అడ్డుకోవడం, విద్యాలయాల్లో, హింస రెచ్చగొట్టే చర్యలను తక్షణమే అరికట్టాలని వారు కోరారు. లేనిపక్షంలో స్వేచ్ఛ జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి ఝాన్సీ, టిపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి విజయ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మస్తాన్, పివైఎల్ జిల్లా కార్యదర్శి రాకేష్, పివైఎల్ జిల్లా అధ్యక్షులు రమేష్, స్పిరిట్ ఆఫ్ మాల జిల్లా కార్యదర్శి కనకరాజు, వివిధ సంఘాల నేతలు వి.వెంకటేష్, లక్ష్మినారాయణ, జితేందర్, చందు, సాగర్, ఆర్కె, ఉమాశంకర్, పాముల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏర్పాటు హామీని అమలు చేయాలి

- గిరిజన బంధుతో న్యాయం
- గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం

నవతెలంగాణ-కారేపల్లి



జిల్లాల పునర్విభజన సందర్భంగా ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లాకు ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటుకు హామి ఇచ్చారని దానిని వెంటనే అమలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. కారేపల్లి మండలం బొక్కలతండాలో సోమవారం గ్రామ మహాసభ జరిగింది. ఈ సభలో వీరభద్రం మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఐటీడీఏ లేక పోవటంతో జిల్లా ప్రజలకు గిరిజన సంక్షేమ పథకాలు దరిచేరటం లేదన్నారు. ఖమ్మం జిల్లా ఐటీడీఏను ఏన్కూర్‌లో ఐటీడీఏ ఏర్పాటు చేయాలన్నారు. గిరిజనులకు ఇస్తున్న హామీలు అమలులో తీవ్రజ్యాపం జరుగుతుందని ఇది అధికార పార్టీకి అంత మంచికాదన్నారు. గిరిజన బంధు ఇస్తామని వాగ్దానం చేసిన సీఎం కేసీఆర్ దాని అమలుకు సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వక పోవటం విచారకరమన్నారు. గిరిజను తండాల్లో ఇండ్లు లేక పూరి గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉంటున్నారని వారికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఖమ్మం బహిరంగ సభలో పంచాయతీలకు నిధులు విడుదలకు ఇచ్చిన హామీ వెంటనే కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామకమిటీమిని 12 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్షకార్యదర్శులుగా హట్కర్ రాంబాబు, వాంకుడోత్ వినోద్‌లను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో ఉసిరికాయలపల్లి సర్పంచ్ బానోత్ బన్సీలాల్, నాయకులు బానోత్ శ్రీనువ, మాలోత్ బాలు, బానోత్ అశోక్, మాలోత్ పాప్యా, మాలోత్ రూప్లా, మాలోత్ శ్రీను, లాకావత్ వినోద్, వాంకుడోత్ అనంద్, మహేష్ పాల్గొన్నారు.

పోడు రైతులకు హక్కు పత్రాలివ్వాలి

నవతెలంగాణ-కొణిజర్ల

పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులు, పేదలకు ప్రభుత్వం ఆటంకాలు కల్పించకుండా సర్వే చేసిన భూములన్నింటికీ హక్కు పత్రాలు కల్పించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య వీరభద్రం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల పరిధిలోని మేకల కుంటలో గిరిజన సంఘం గ్రామ మహాసభ నిర్వహించి తండాలో సభ్యత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనులకు, పేదలకు పోడు హక్కు పత్రాలు కల్పిస్తానని భూములు సర్వే చేసిందని గుర్తు చేశారు. గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేక అభివృద్ధి మండలిని ఏర్పాటు చేసి నిధులు కేటాయించి అభివృద్ధి పరచాలని కోరారు. మేకలకుంట నుండి జంపాలనగర్ తారు రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. గిరిజన సమస్యలపై సమరశీల పోరాటాలు గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తుందని, భవిష్యత్తులో జరిగే ఉద్యమాలు, పోరాటాలలో గిరిజనులు అత్యధికంగా పాల్గొనాలని కోరారు. అనంతరం 12 మందితో గిరిజన సంఘం తండా కమిటీని ఎన్నుకున్నారు అధ్యక్ష కార్యదర్శులు తేజావత్ అశోక్, భూక్యా లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు ధరావత్ నంద్యా నాయక్, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు తేజావత్ కృష్ణ కాంత్, భూక్య లచ్చిరాం. భూక్యా నరేష్, రాములు, రమేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

చమురు సంస్థల స్థాపనలో భద్రతే కీలకం

- స్టడీ టూర్‌లో రాజ్యసభ ఎంపీ వద్దిరాజు
- గోవాలోని ప్రఖ్యాత శిక్షణ కేంద్రం సందర్శన

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



ప్రభుత్వరంగ పరిశ్రమల్లో చమురు సంస్థల స్థాపనలో భద్రత, రక్షణకు అత్యంత ప్రాముఖ్యత ఇవ్వాలని.. వీటి విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని రాజ్యసభ ఎంపీ, పెట్రోలియం, సహజ వాయువు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అభిప్రాయపడ్డారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పెట్రోలియం సహజవాయువు పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ అధ్యయన యాత్రలో భాగంగా చివరి రోజు కమిటీ సభ్యులు గోవాలో పర్యటించారు. కమిటీ చైర్మన్ రమేష్ బిధూరి నేతృత్వంలో సభ్యుల బృందం గోవాలో ప్రతిష్టాత్మక ఓ ఎన్ జీసీ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రఖ్యాత ఐపీఎస్ హెచ్‌ఈఎం శిక్షణ కేంద్రాన్ని సందర్శించింది. అక్కడ పలు చమురు కంపెనీల ప్రతినిధులు, వాటి నిపుణులతో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ప్రభుత్వరంగ పరిశ్రమల్లోని చమురు సంస్థల్లో ఇప్పటికే అమలవుతున్న భద్రత, రక్షణ చర్యలపై సమీక్షించారు. అనంతరం కమిటీ సభ్యులు పలు సూచనలు చేసి వాటి అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అధ్యయన యాత్ర ముగించుకుని ఎంపీ రవిచంద్ర సోమవారం రాత్రికి హైదరాబాద్ నగరం చేరుకున్నారు.

సీతారామ ప్రాజెక్ట్ పెండింగ్ పనుల టెండర్ ప్రక్రియ ప్రారంభం

నవతెలంగాణ-వైరా

నత్త నడకన సాగుతున్న సీతారామ ప్రాజెక్ట్ పెండింగ్ పనుల కోసం మంజూరైన 420.46 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పనులకు టెండర్ ప్రక్రియ ప్రారంభమైంది. 23.01.2023 టెండర్ ప్రారంభ తేదీ కాగా ముగింపు తేదీ 06.02.2023గా టెండర్ నోటీస్‌లో పేర్కొన్నారు.

టెండర్ ఐడి నెం 385026 ద్వారా ఎస్ఆర్ఎల్ఐపి నుండి పాలేరు లింక్ కెనాల్ ఎర్త్ వర్క్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలురుపాడు మండలం పాలకొల్లు నుండి ఖమ్మం జిల్లా ఏనుకూరు మండలం బురద రాఘవాపురం వరకు 11.900 కిమీ కాలువ పనులు చేయుటకు టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు. కాగా ఈ ప్రాజెక్ట్‌లోని మరో రెండు పనులు జూలూరుపాడు మండలంలో 8వ ప్యాకేజీలో పెండింగ్ పనులు, ఈ ప్యాకేజీలో బ్రిడ్జి నిర్మాణంతో సహా పనులు చేయుటకు 90.42 కోట్లు, 14 ప్యాకేజీ లో 5.5 కిమీ కెనాల్ పెండింగ్ పనులు చేయుటకు 110 కోట్లు మజూరైనవి. ఈ రెండు పనులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో ఉన్నవి. వాటి వివరాలు తెలియాల్సి వుంది. కాగా ఖమ్మం జిల్లాలో 11.900 కి.మీ పనులు చేయుటకు టెండర్ల ప్రక్రియ ప్రారంభం అయింది. జిల్లా భద్రాద్రి కొత్తగూడెం అయినప్పటికీ జూలూరుపాడు మండలం గిరిజన నియోజక వర్గం వైరా పరిధిలోనే ఉన్నది. 8, 14 ప్యాకేజీలలో ఈ మండల పరిధిలో పనులు పెండింగ్ ఉన్నందున వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ వాటిపై శ్రద్ధ తీసుకోవాలి. 2022 సెప్టెంబర్ 10వ తేదీన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖమ్మం, కొత్తగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాసాచార్యులు, అర్జున్‌లతో కలిసి ఎమ్మెల్యే వచ్చే జూన్ నాటికి సాగు నీరు అందించే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. కనుక వైరా నియోజక వర్గంలో పూర్తి చేయవలసిన మొత్తం 620.88 కోట్ల రూపాయల పనుల వేగవంతం కోసం కృషి చేయాలని నియోజక వర్గ ప్రజలు కోరుతున్నారు.

గురువుల ఆశీస్సులే విద్యార్థుల ఉన్నతకు దోహదం

- పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో బాపట్ల ఎంపీ సురేష్
- తమకు చదువు నేర్పిన గురువులకు సన్మానం
- క్రీడలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం

నవతెలంగాణ - ఎర్రుపాలెం



గురువుల ఆశీస్సులు ఉంటే విద్యార్థులు ఉన్నతంగా ఎదగవచ్చునని, గురువులు తల్లి,తండ్రి,దైవంతో సమానమని బాపట్ల పార్లమెంటు సభ్యులు సురేష్ అన్నారు. తొలుత జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 1992 - 93 సంవత్సరంలో 10వ తరగతి విద్య నభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. సహచర మిత్రులను కలుసుకొని మంచి చెడులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఎర్రుపాలెం గ్రామంలో చదువుకొని ఎంబీబీఎస్ సీటు పొందిన తేజస్విని, ఎంబిబిఎస్ పూర్తి చేసిన మల్లెల సాయిని, ఇటీవల గవర్నర్, రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు పొందిన గోపీనాథ్, చాముండేశ్వరి విద్యార్థిని విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తాను చదువుకొన్న పాఠశాలకు అన్ని రకాలుగా మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని ఆ యన అన్నారు. పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు వాడుకునే విధంగా ప్రభుత్వ పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తానని, మండల ప్రజలకు ఎలాంటి అవసరం వచ్చినా తనను కలిస్తే వారికి ఉపయోగపడేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అండదండలతోనే సామాన్య ఫోటోగ్రాఫర్‌గా పని చేస్తున్న నన్ను ఎంపీగా ఎన్ను కున్నారని, అది తన పూర్వ జన్మ సుకృతమని ఆయన అన్నారు. మండల ప్రభుత్వ పాఠశాలల పరిధిలో విద్యార్థిని విద్యార్థులకు జరిగిన క్రీడా పోటీలలో గెలు పొందిన విజేతలకు దాత కోటిరెడ్డి సహకారంతో బహుమతులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన సహా విద్యార్థులతో కలిసి మాటామంతీ, బాగోగులను తెలుసుకొని కలియ తిరిగారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవరకొండ శిరీష, జడ్పిటిసి శీలం కవిత, స్థానిక సర్పంచ్ మొగిలి అప్పారావు, ఎంపీటీసీ మస్తాన్వలి, మండల విద్యాశాఖ అధికారి వై.ప్రభాకర్, దండెం సత్యనారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయులు మురళీ మోహనరావు, ఉపాధ్యాయులు, సహాయ మిత్రులు సుబ్బారావు, కోటి శివారెడ్డి, బాలకృష్ణ, నాగరాజు, మారుతి, రమాదేవి, పద్మ, మంజుల విద్యార్థిని, విద్యార్థులు, తల్లి దండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు దేశానికే ఆదర్శం

జిల్లా పరిషత్ ఛైర్మన్ లింగాల కమల్ రాజు

నవతెలంగాణ-చింతకాని



దళితుల దారిద్ర్య రేఖకు మార్చేందుకు దళిత బంధు పథకాన్ని తీసుకొచ్చిన ముఖ్యమంత్రి కెసిఆర్ నవయుగ అంబేద్కర్ అని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పేర్కొన్నారు. చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో పాతర్లపాడు గ్రామానికి చెందిన నిమ్మ తోట స్వర్ణ, నిమ్మ తోట నాగార్జునలకు దళిత బంధు ద్వారా మంజూరైన పెయింట్ మరియు ఎలక్ట్రికల్ రెండు యూనిట్లను సోమవారం జిల్లా పరిషత్ ఛైర్మన్ లింగాల కమల్ రాజు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఆలస్యం నాగమణి, పరిటాల యలమంద, కాంద్ర పిచ్చయ్య, ఎంపీపీ పూర్ణయ్య, సహకార సంఘం అధ్యక్షులు శేషగిరిరావు, డైరెక్టర్ వంకాయలపాటి లచ్చయ్య, బారాస మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు పట్టుబడిన వాహనాలకు వేలం పాట

నవతెలంగాణ - ఎర్రుపాలెం

వివిధ నేరాల కింద మధిర ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరి ధిలో పట్టు బడిన వాహనాలను వేలం పాట నిర్వహించబడుతుందని మధిర ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తారీకు ఉదయం 11 గంటలకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ మధిర కార్యాలయం నందు వేలంపాట నిర్వహించబడుతుందని తెలిపారు. అశోక లేలాండ్ దోస్త్ వ్యాను, లక్ష రూపాయలు, టాటా విస్టా కారు, 1,25,000 వేల రూపాయల ధరను నిర్ణయించినట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలిచిన వారు 50% డిడి నీ డిస్టిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఖమ్మం వారి పేరిట డిడిని జత చేయాలని తెలిపారు. వివరాల కొరకు ఎక్సైజ్ స్టేషన్ మధిర వారి ని సంప్రదించ వలసినదిగా కోరారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం

నవతెలంగాణ-వైరా

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మీల్స్ అండ్ వీల్స్ రెండవ రోజు ఉచిత అల్పాహారం కార్యక్రమం బ్రాహ్మణపల్లి పేదలకు అందించారు.7వ వార్డు కౌన్సిలర్ పణితి ఉష, సైదులు సహకారంతో అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లయన్స్ క్లబ్ నిరుపేదలను ఆదుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు చింతోజు నాగేశ్వరరావు చింతలపాటి వెంకటేశ్వరరావు, అబ్బూరి రమేష్. పణితి సైదులు, పోటు మధుసూదనరావు, లగడపాటి బోస్, వై.బుచ్చిరామారావు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం

నవతెలంగాణ - బోనకల్

ముష్టికుంట్ల ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ సాహెబ్ అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో బోడేపూడి వేణుమాధవ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలిన చలపతిరావు మాట్లాడుతూ పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు నేటి నుంచే పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందువలన ముష్టికుంట్ల గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ సాహెబ్ అల్పాహారాన్ని ఏర్పాటు చేస్తానని ప్రకటించారన్నారు. కార్యక్రమంలో అల్పాహారం దాత షేక్ హుస్సేన్ సాహెబ్ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

1న కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ ప్రగతిశీల భవనిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల సాధనకై ఫిబ్రవరి 1న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జరుగు ధర్నాను జయప్రదం చేయాలని పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవనిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు గోసు పుల్లయ్య, పేరబోయిన వెంకన్న జిల్లా ఉపాధ్యక్షులు గూగుల్ పటేల్, గొడుగు విజయ్, ఆడెపు కోటేశ్వరరావు, వీరబాబు, ప్రభాక పాల్గొన్నారు.

జాతిని నడిపించిన గొప్ప యోధుడు నేతాజీ

బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఎంపీ నామ నివాళి

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

స్వాతంత్ర్య సంగ్రామంలో యావత్ జాతిని ఉగ్రూతలూగించి ముందుకు నడిపించిన గొప్ప నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. నేతాజీ జయంతి సందర్భంగా ఎంపీ నామ ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ మేరకు ఎంపీ నామ సోమవారం ఇక్కడ ఒక ప్రకటన విడుదల చేశారు. నేతాజి ప్రసంగాలకు లక్షలాది మంది ప్రేరణ పొంది, స్వాతంత్ర్య సంగ్రామంలో ముందుకు నడిచారని అన్నారు. స్ఫూర్తిదాయక ఉపన్యాసాలతో ప్రజలను ప్రేరేపించిన అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు.



పంచాయతీ కార్యాలయానికి శంకుస్థాపన

నవతెలంగాణ- బోనకల్

మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామపంచాయతీలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయానికి ఎంపీడీవో బోడేపూడి వేణుమాధవ్ సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయానికి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని నిర్మించనున్నట్లు ఇన్చార్జి సర్పంచ్ గుడ్డూరి ఉమా తెలిపారు. కార్యక్రమంలో పిఆర్ఏఈ మొండితోక నవీన్, ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, మాజీ జడ్పిటిసి బానోతు కొండ, గ్రామపంచాయతీ కార్యదర్శి బానోత్ శివుడు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నటరాజ నృత్య సమితిలో సర్వజ్ఞ విద్యార్థిని ప్రతిభ



నవతెలంగాణ- ఖమ్మం

నటరాజ నృత్య సమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ హైదరాబాద్లో జరిగిన 74వ రిపబ్లిక్ సెలబ్రేషన్స్లో భాగంగా ఖమ్మం వి.డి.వోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాల 3వ తరగతి విద్యార్థిని వై.వర్ష అద్భుతమైన ప్రతిభకనబరిచి పలువురి ప్రశంసలు అందుకుందని సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్స్ ఆర్.వి. నాగేంద్రకుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ష అద్భుతమైన ప్రదర్శనకు అభినందన పత్రం, నటరాజ నృత్య సమితి వారు నాట్య కిరీటి జ్ఞాపికతో పాటు పులువురి ప్రశంసలు అందుకుందన్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని నత్య పోటీలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, తమ విద్యార్థులు చదువుతో పాటు అనేక సంస్కృతి, సాంప్రదా యాలను పరిరక్షించడం మరియు. చిన్నారులకు చిన్నతనం నుండే మన సంస్కృతిపై మక్కువను పెంచడంలో ఎంతో తోడ్పతాయి అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

ఆర్అండ్బి రహదారి 20 అడుగులకు తగ్గించాలి

కలెక్టర్కు బాధితుల వినతి

నవతెలంగాణ-ముదిగొండ

ముదిగొండ గ్రామపంచాయతీ పరిధిలో వల్లభి వెళ్లే రహదారిని 50 అడుగులు వెడల్పు చేయాలని ఆర్అండ్బి అధికారులు గ్రామపంచాయతీ సెక్రెటరీ పి సంపత్చే గృహాలు తొలగించాలని, ఇళ్ల బాధితులకు నోటీసులు అందజేసిన విషయం విధేతమే. ఇండ్ల నిర్మాణ బాధితులు నోటీసులు ఉపసంహరించుకోవాలని నిరసన వ్యక్తం చేస్తూ ఎంపీడీవో డి శ్రీనివాసరావు, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, తాసిల్దార్ జి.శిరీష, గ్రామ పంచాయితీ కార్యదర్శి పి.సంపత్కు గతంలో వినతపత్రాలు అందజేశారు. మండల అధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో, ఖమ్మం నూతన జిల్లా కలెక్టరేట్లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఇండ్ల నిర్మాణ బాధితులు జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ను కలిసి వినతపత్రం అందజేసి, ఆర్అండ్బి రహదారి వెడల్పు 20 అడుగులకు కుదించి నిర్మాణం చేపట్టాలని వివరించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే ఆర్ అండ్ బి డిఈ రాధికతో మాట్లాడి సమస్యను పరిశీలించి పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇండ్ల నిర్మాణదారులకు ఎలాంటి నష్టం లేకుండా రోడ్డు వెడల్పు చేపట్టాలని బాధితులు కలెక్టర్ను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం) గ్రామశాఖ కార్యదర్శి బట్టు రాజు, ఇండ్ల నిర్మాణ బాధితులు వేగినాటి అప్పారావు, వేగినాటి బుచ్చిబాబు, వేగినాటి వెంకయ్య, రహీం, ఎస్కే నాగుల్ మీరా, నాయిని వెంకటేశ్వర్లు, తటమర్తి నాగేశ్వరరావు, శ్రీను,అక్రమ్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కూసుమంచి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచురించిన క్యాలెండర్ను మండల కేంద్రంలో సోమవారం సిఐ జితేందర్ రెడ్డి, జేవిఆర్ కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడే సంఘం ఎస్ఎఫ్ఐ అని మహనీయుల ఫోటోలుతో ప్రచురించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కూసుమంచి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు విక్రమ్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.ప్రవీణ్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రేమ్ కుమార్ జేవియర్ కళాశాల అధ్యాపకులు మంగీలాల్, హై స్కూల్ ఉపాధ్యాయులు సంక్రాంతి రవి కుమార్, నాగేశ్వరరావు, రాజశేఖర్, వెంకట్ రమణ, రవీందర్, గురువారెడ్డి ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

పక్క రాష్ట్రాలను ఆకట్టుకుంటున్న తెలంగాణ పథకాలు



నవతెలంగాణ-పెనుబల్లి

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు పక్క రాష్ట్రాల ముఖ్య మంత్రులు, ప్రజలు ఆశ్చర్య పోతున్నారని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. మండలంలోని బియ్యం బంజర్ జంగాల కాలనీలో సోమవారం సీసీ రోడ్డుకి శంకుస్థాపన చేసి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీపీ లక్కినేని అలేఖ్య వినీల అధ్యక్షతన లబ్దిదారుల సభలో కళ్యాణ లక్ష్మికి పథకానికి అర్హులైన 84 మంది మహిళలకు సండ్ర చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రమాదేవి, ఎంపీడీవో మహాలక్ష్మి, జడ్పిటిసి మోహన్ రావు, నాయకులు కనగాల వెంకట్రావు, చెక్కిలాల లక్ష్మణరావు, చింత నిప్పు సత్యనారాయణ, కొప్పుల గోవిందరావు, కరగాల సురేష్ బాబు, పసుమర్తి వెంకటేశ్వరరావు, ముక్కర భూపాల్ రెడ్డి, చెలికాని నీలాద్రి బాబు, లక్కినేని వినీల్, పెనుబల్లి వివిఎం బంజర్ సర్పంచ్ లు టావు నాయక్, పంతులి, భూక్య ప్రసాద్, ఎలమర్తి ప్రసాద్, కోమటి ప్రసాద్, తాళ్లూరు శేఖర్రావు పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ- నేలకొండపల్లి

నేలకొండపల్లి ప్రభుత్వ హైస్కూల్లో 1992- 93 విద్యా సంవత్సరంలో కలిసి చదువుకున్న విద్యార్థులలో నేలకొండపల్లి పట్టణానికి చెందిన పెద్దపల్లి రామకృష్ణ(45) ఈనెల 13 అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులంతా మిత్రుని భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి మనోధైర్యం కలిగించారు. దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించారు. సోమవారం జరిగిన దశదినకర్మ కార్యక్రమానికి కూడా అందరూ హాజరై తలా ఇంత పోగేసి 40,000 రూపాయలను జమ చేశారు. అట్టి సొమ్మును వారి కుటుంబ సభ్యులకు అందజేసి వారి మిత్రుత్వాన్ని విశాలమైన దయార్థ హృదయాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్ కళ్యాణ్, టి.రవి, జి.వెంకటనారాయణ, డి.మురళి, గంధం రామచంద్ర రావు, వై.గోపీకృష్ణ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి రూ.25వేల ఆర్థికసాయం



నవతెలంగాణ-తిరుమలాయపాలెం

చంద్రుతండా గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బోడ భద్రమ్మ మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధినాయకురాలు వైయస్ షర్మిల ఆ కుటుంబానికి ఆర్థిక సాయం నిమిత్తం పాలేరు నియోజకవర్గ వైయస్ షర్మిల వ్యక్తిగత సహాయకులు నంద్యాల రవీందర్రెడ్డి ద్వారా 25వేల రూపాయల ఆర్థిక సాయంను బోడ భద్రమ్మ కుమారుడికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్టీపీ జిల్లా కార్యదర్శి కొత్త బాలాజీ రావు, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు బోడ పాల్రాజ్, మండల అధ్యక్షుడు వాలూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అన్నాబత్తుల కృష్ణ, మండల యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల వెంకట్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోత్ సీతారాం నాయక్, దేవ నాయిని, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్తో సత్వర సమస్యల పరిష్కారం : మంత్రి పువ్వాడ



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాన్యుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం రోజున ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

ఖమ్మం జిల్లా నూతన ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ కాంప్లెక్స్ హాల్ లో సోమవారం జరిగిన తొలి ప్రజావాణి లో ముఖ్య అతిథిగా మంత్రి పువ్వాడ హాజరయ్యారు. దేశంలో ఎవరికి దక్కని అరుదైన గౌరవం మన ఖమ్మం జిల్లాకు దక్కడం చాలా గర్వంగా ఉందన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి నలుగురు ముఖ్యమంత్రులు, ఒక మాజీ ముఖ్యమంత్రి చేత మన కలెక్టరేట్ ప్రారంభించుకుని కలెక్టర్ వి.పి.గౌతమ్ ను తన సీట్ లో కూర్చోబెట్టిన అరుదైన, అద్భుతమైన గౌరవం ఇప్పటి వరకు దేశంలోనే ఎక్కడ జరగలేదన్నారు. ఇక జరగబోదని స్పష్టం చేశారు. ఆయా శాఖల అధికారులు పిర్యాదుదారులను తమ బిడ్డల వలె వారికి అందాల్సిన న్యాయం చేయాలని, మన తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సేవలు, ప్రభుత్వ పథకాలు, ఇతర పనులు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి ఎలా తీసుకువెళ్లాలో తెలియక సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులకు గురి అవుతుండేవారని, తెలంగాణ ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం ఎప్పుడైతే కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి, వారి సమస్యల్ని జిల్లా కలెక్టర్ అధ్వర్యంలో అన్ని శాఖల జిల్లా అధికారులు ఒకే వేదిక ద్వారా సామాన్యుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.ప్రభుత్వ విధి విధానాల అమలు, ప్రజలకు సరైన పాలన, క్షేత్ర స్థాయిలో సంక్షేమ పథకాలు అందని వారికి ప్రజావాణి ద్వారా అందించామన్నారు. అన్ని కార్యాలయాలు ఒకే సముదాయంలో ఉండటం వల్ల ప్రజల సమస్య ఒక్క దగ్గరే పరిష్కారం అవుతాయని, మరెక్కడికి వెళ్లాల్సిన పని లేదని, ప్రజల సౌకర్యార్థం ఖమ్మం నగరం నుండి జిల్లా కలెక్టరేట్ వరకు ఆర్టీసి సిటీ బస్సులను నడుపుతామని పేర్కొన్నారు. అనంతరం నూతన కలెక్టరేట్ లోకి మారి విధులు ప్రారంభించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్, అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు.

సింగరాయపాలెం సాగు భూములకు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలి

మంత్రి అజయ్, కలెక్టర్ గౌతమ్లకు రైతుల వినతి

కొణిజర్ల మండలం సింగరాయపాలెం గ్రామ రెవెన్యూ సాగు భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని సోమవారం నూతన కలెక్టర్ కార్యాలయం గ్రీవెన్స్లో జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ గౌతమ్లకు రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ 1959 -60 సంవత్సరం నుంచి రైతుల స్వాధీనంలో ఉన్న సాగు భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు కాలేదన్నారు. 60 సంవత్సరాల నుంచి ప్రభుత్వ రెవెన్యూ పహాణిలలో ఉంటూ మీ పహాణిలో కూడా రైతులు ఉన్నా సాగు భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు కాలేదన్నారు. అని దీని వల్ల 200 మంది రైతులు 350 ఎకరాల విస్తీర్ణంలో రైతుబంధు, రైతుబీమా పథకాలకు నోచుకోవడం లేదని అన్నారు. సీలింగ్ చట్టం సందర్భంగా సింగరాయపాలెం 350 ఎకరాల రైతులకు జగిరిదార్ విక్రయం చేసినట్లు ధ్రువీకరణ చేశారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో గ్రామ రైతులు దొడ్డపనేని కృష్ణార్జున్ రావు, బేగ్ రోషన్, కట్టా రాంబాబు, ఎస్ కె దాదా సాహెబ్, రాచ్చబంటి రామయ్య తుమ్మలపల్లి మంగపతి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తితో యువత ఉద్యమించాలి

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్



నవ తెలంగాణ-ఖమ్మంరూరల్

సమాజ మార్పునకు కృషి చేసిన మహనీయులను నేటి యువత ఆదర్శంగా తీసుకుని వారి పోరాట స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్ యువతకు పిలుపునిచ్చారు. స్థానిక వరంగల్ క్రాస్ రోడ్లోని తమ్మినేని సుబ్బయ్య భవన్లో (భారత ప్రజాతంత్ర యువజన సంఘం)ఖమ్మం రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో డివైఎఫ్ఐ 2023 క్యాలెండర్ను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి పొన్నం మురళి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న షేక్ బషీరుద్దీన్ మాట్లాడారు. ఎందరో మహనీయులు ఈ దేశం కోసం, సమాజం కోసం అనేక త్యాగాలు చేయటం వలన ఇప్పుడు పౌరులందరు స్వేచ్ఛా, స్వతంత్రాలతో జీవనం సాగిస్తున్నామన్నారు. డివైఎఫ్ఐ గత తొమ్మిది సంవత్సరాలుగా మహనీయులు, స్వతంత్ర సమరయోధులు, విప్లవకారులు, సంఘ సంస్కర్తలు, కవులు, కళాకారులు, క్రీడాకారులు, మేధావుల చిత్రపటాలతోని క్యాలెండర్ వేయడం జరుగు తుందన్నారు. సభలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.ఈ క్యాలెండర్ ఆవిష్కరణ సభలో డివైఎఫ్ఐ ఖమ్మం రూరల్ అధ్యక్షులు జక్కంపూడి కృష్ణ, మండల కమిటీ సభ్యులు ఊరడి విజయ్, పొన్నెకంటి అనీష్, గడ్డం సిద్దు, తాటి వెంకటేశ్వర్లు, తోట నరేష్ రెడ్డి, వట్టికోట నరేష్, చాంద్ పాషా, శభాష్ రెడ్డి, గురవయ్య భాస్కర్రావు తదితరులు పాల్గొన్నారు.

26న రైతు ర్యాలీని విజయవంతం చేయండి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు



నవతెలంగాణ-తల్లాడ

కేంద్ర ప్రభుత్వం రైతు ఉద్యమానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని జనవరి 26న సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు దేశంలో జిల్లా కేంద్రాల్లో జరిగే రైతు ర్యాలీలను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు పిలుపునిచ్చారు. సోమవారం తల్లాడ మండలం కుర్నవల్లిలో మండల రైతు సంఘ కార్యదర్శి నందమూరి మోహన్ రావు అధ్యక్షతన తల్లాడ, కల్లూరు మండలాల రైతు సదస్సు నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ దేశంలో అన్నం పెట్టే రైతు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గత ఎనిమిది సంవత్సరాల్లో నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని 2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ కార్పొరేటీకరణ చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడం కోసం రైతులందరూ ఐక్యంగా పోరాడాలని అన్నారు. జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేరే వరకు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు ఐక్యమత్యంతో పోరాడితే హామీలను నెరవేర్చు కోవచ్చు న్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్న నాగేశ్వరరావు, తాతా భాస్కరరావు, నాయకులు సేలం పకీరమ్మ, శీలం సత్యనారాయణరెడ్డి, ముదిగొండ అంజయ్య, అయినాల రామలింగేశ్వరరావు, తన్నీరు కృష్ణార్జునరావు, మాదాల కృష్ణారావు, మాదాల వెంకటేశ్వరరావు, పులి వెంకట నరసయ్య, గండమాల ఆనందరావు, కళ్యాణపు కృష్ణయ్య, కొమ్మినేని ఆదినారాయణ, కట్ట దర్గయ్య, దూల జనార్ధన్, పేరసాని వెంకటయ్య, పాల్గొన్నారు.

వికలాంగులకు రోటరీ సేవలు అభినందనీయం

జడ్జి టి.శ్రీనివాసరావు



నవతెలంగాణ-ఖమ్మం లీగల్

దివ్యాంగులకు సమాజం చేదోడు వాదోడుగా ఉండాలని ఈ విషయంలో రోటరీ క్లబ్ వారు చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మరియు రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగులకు చట్టాలపై అవగాహన మరియు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో న్యాయ సేవల విషయంలో ఖమ్మం జిల్లాను అగ్రగామిగా నిలపాలని ఆకాంక్షించారు. దివ్యాంగులు ఉచిత న్యాయ సహాయానికి అర్హులని వారికి వారి అర్హమైన అన్ని విషయాలలో సమాన అవకాశాలను కల్పించడానికి న్యాయ సేవా సంస్థ సహాయం చేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులకు మూడు చక్రాల సైకిల్, కృత్రిమ అవయువాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయ సేవా సంస్థ న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా, రొటేరియన్లు జగన్నాథం మల్లాది వాసుదేవరావు, అక్బర్ పాషా, ఐతం రవీంద్ర, ఇమ్మడి లక్ష్మీనారాయణ ఎం కన్నాంబ పాల్గొన్నారు.

సిబిఎస్ఇ క్లస్టర్ క్రీడల్లో హార్వెస్ట్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-ఖమ్మం

సిబిఎస్ఇ క్లస్టర్ క్రీడల్లో 'హార్వెస్ట్' విద్యార్థులు ఆల్రౌండ్ ప్రతిభ చూపారని, జాతీయ స్థాయి పోటీలకు పలువురు విద్యార్థినులు పాల్గొన్న ప్రతి పోటీలో 'హార్వెస్ట్' అగ్రశ్రేణి నైపుణ్యం సాధించారని హార్వెస్ట్' గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతీరెడ్డి తెలి పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతీయేటా దేశవ్యాప్తంగా విద్యార్థినీ, విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు నిర్వహించే 'క్లస్టర్స్ , సౌత్జోన్' క్రీడాపోటీల్లో, తమ విద్యాసంస్థల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని, ప్రావీణ్యం కనబరచి ఆల్రౌండర్స్గా నిలిచారని తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరానికిగానూ, గత 2నెలలుగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, బాస్కెట్ బాల్, ఆర్చరీ, అథ్లెటిక్స్ పలు రకాల క్రీడలు సిబిఎస్ఇ బోర్డ్ వారు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జోన్ల వారీగా పలు రాష్ట్రాల్లో సిబిఎస్ఇ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు పోటీలలో పాల్గొంటారని, తమ పాఠశాల నుండి 12వ తరగతి చదువుతున్న వైశాలి, బ్లెస్సీ జాతీయస్థాయి అథ్లెటిక్స్కు ఎంపికవడం తమకెంతో గర్వకారణమన్నారు. వచ్చేనెల వారణాసిలో విద్యార్థినులు ఈ అథ్లెటిక్స్లో పాల్గొంటారని తెలిపారు. అదేవిధంగా గత డిసెంబర్ 2వ తేదీ నుండి 4వ తేదీ వరకు హైదరాబాద్లో నిర్వహించిన సౌత్ జోన్ ఆర్చరీ విభాగంలో 'అస్నా' జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. గత నవంబర్ 25 నుండి 27 వరకు నార్కెట్పల్లిలో నిర్వహించిన 'కబడ్డీ' పోటీల్లో బాలురు, బాలికల జట్లు తృతీయస్థానాన్ని కైవసం చేసుకున్నాయన్నారు. గత నవంబర్ 25 నుండి 27వ తేదీ వరకు హైద్రాబాద్లో నిర్వహించిన 'వాలీబాల్' పోటీల్లో బాలుర, బాలికల జట్లు ఉత్తమ ప్రతిభ కనబర్చార న్నారు. గత డిసెంబర్ 4 నుండి 6 వరకు రాజమండ్రిలో నిర్వహించిన ఖో-ఖో పోటీల్లో బాలురు, బాలికల జట్లు ప్రతిభ కన బర్చారన్నారు. నెల్లూరులో జరిగిన బాస్కెట్బాల్ క్రీడలో బాలుర జట్టు పాల్గొని పలు బహుమతులు పొందారన్నారు. సోమవారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థినీ, విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన కోచ్, పియిటిలను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అభిలాషించారు.

వాహనాల వేలం

నవతెలంగాణ- మధిర

ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాలకు వేలం పాటను నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ నాగేశ్వరరావు తెలిపారు. ఈ వేలంపాట ఈనెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు మధిర ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఉంటుందన్నారు. వివిధ కేసుల్లో పట్టుబడిన 2 వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంపాట వివరాలు 1)అశోక్ లేలాండ్ వాహనమును ఎంవిఐ వారి ధర రూ.1,00,000/- గా. 2)టాటా విస్టా కార్ వాహనం రూ.1,25,000/- గా నిర్ణయించినట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలిచినవారు ముందుగా ఎంవిఐ వారు నిర్ణయించిన ధరలో 50 శాతం డిడి/చెక్/పే ఆర్డర్ రూపంలో డిస్ట్రిక్ట్ ప్రొవిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఖమ్మం పేరిట చెల్లించి వేలంపాటలో పాల్గొనవలసిందిగా తెలిపారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బచ్చోడు తండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బచ్చోడు తండాకు చెందిన ధరావత్ రవి (35) తనకు ఉన్న రెండెకరాల వ్యవసాయ భూమిలో మిర్చి, పత్తి సాగు చేశాడు. మిర్చి పంటకు తెగులు రావడంతో దిగుబడి సరిగా రాక పంట పెట్టుబడికి తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని దిగులు చెంది మనస్తాపంతో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

ఇంధన సర్దుబాటు చార్జీలను పెంచడం విరమించుకోవాలి

సీపీఐ(ఎం) త్రీటౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాస్రావు

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ప్రతినెల ఇంధన సర్దుబాటు చార్జీలను పెంచడం మానుకోవాలని సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు అన్నారు. అసలే కరెంట్ యూనిట్ల రేట్లు పెరిగి ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతా ఉంటే మరలా డెవలప్మెంట్ చార్జీల పేరుతోటి నెలనెలా 3వేల రూపాయల నుంచి రూ.4వేలు బిల్లులలో ఎక్కువ వేసి సర్దుబాటు చార్జీల పేరుతోటి కరెంటు బిల్లులు మోత మోగిస్తున్నారన్నారు. ఈ విధానాన్ని వెంటనే విరమించుకోవాలన్నారు. లేదంటే ప్రజా ఆందోళన తప్పదన్నారు.

వైఎస్ఆర్సీపీ నేత షర్మిలను కలిసిన మండల నాయకులు

నవతెలంగాణ-కారేపల్లి

వైఎస్ఆర్సీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిలను కారేపల్లి మండల వైఎస్ఆర్సీపీ నాయకులు సోమవారం హైదరాబాద్లో కలిశారు.వైఎస్ఆర్సీపీ మండల అధ్యక్షులు తాళ్లూరి రాంబాబు ఆధ్వర్యంలో షర్మిలను కలిసి పార్టీ సిద్ధాంతాలను గ్రామీణ స్థాయిలో తీసుకవెళ్ళటానికి అనుసరించాల్సిన వ్యూహాలను వివరించినట్లు రాంబాబు తెలిపారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కారేపల్లి

కంటి వ్యాధులు ఉన్న వారు తప్పని సరిగా ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ బి.సురేష్ తెలిపారు. కారేపల్లి మండలంలో మాధారం, అప్పాయిగూడెంలలో శిబిరాలు నడుస్తున్నాయన్నారు. సోమవారం రెండు శిబిరాల్లో 314 మందికి పరీక్షలు నిర్వహించి 134 మందికి కళ్లజోళ్లను పంపిణి చేసినట్లు తెలిపారు. 45 మందికి మెరుగైన కంటి వైద్యం కోసం రిఫర్ చేసినట్లు తెలిపారు.

సత్తుపల్లి బరిలో షర్మిల పార్టీ అభ్యర్థిగా కవిత

నవతెలంగాణ-సత్తుపల్లి

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ఆర్టీపీ తరపున సత్తుపల్లి నియోజకవర్గ అభ్యర్థిగా పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్, మాజీ జెడ్పీ ఛైర్మెన్ గడిపల్లి కవిత పోటీలో ఉంటారని ఆ పార్టీ సత్తుపల్లి మండల అధ్యక్షుడు శ్రీరామ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడరాలు వైఎస్ షర్మిల గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని శ్రీరామ తెలిపారు. జిల్లా అధ్యక్షులు లక్కినేని సుధీర్బాబు ఆధ్వర్యంలో రానున్న వచ్చే శివరాత్రి నుంచి కవిత నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. వైఎస్సార్టీపీని ప్రజలు ఆదరించాలని వెంకటేశ్వరరావు కోరారు.

'బిగ్ పిక్చర్'తో బోస్కు 'డీఏవీ' నివాళి

నవతెలంగాణ-సత్తుపల్లి

నేతాజీ సుభాష్చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని స్థానిక గంగారం సాయిస్ఫూర్తి డీఏవీ పాఠశాల విద్యార్థులు పాఠశాల మైదానంలో భారీ బోస్ చిత్రపటాన్ని రూపొందించి, చుట్టూ మానవహారంలో నిలుచుని నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిదానంద్ బి వనేగావ్ మాట్లాడుతూ బోస్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బిగ్ పిక్చర్ రూపకల్పనలో విద్యార్థులకు సహకరించిన పీఈటీ సత్య స్వరూపిణి, కె.కుమరస్వామిలను అభినందించారు. బోస్కు వినూత్న శైలిలో నివాళులర్పించిన విద్యార్థులను రాజ్యసభ ఎంపీ, సాయిస్ఫూర్తి హానరరీ ఛైర్మెన్ డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి, డీఏవీ తెలంగాణ జోన్-డీ రీజనల్ ఆఫీసర్ శేషాద్రి, సాయిస్ఫూర్తి డీఏవీ ఛైర్మెన్ దాసరి ప్రభాకరరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రస్టీ బండి అన్విద, సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ చెన్నుపాటి విజయకుమార్ అభినందనలు తెలిపారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని స్థానిక 37వ డివిజన్ పాత మున్సిపల్ కార్యాలయంలో రూ.4.98 లక్షలతో ఏర్పాటు చేసిన బస్తి దవాఖానాను సోమవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చేతుల మీదగా రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్యను మరింత చేరువ చేసేందుకే బస్తీలలో బస్తీ దవాఖానలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కార్పొరేషన్ పరిధిలో మరిన్ని దవాఖానాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పువ్వాడ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వి పి. గౌతమ్, నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సుడా డైరెక్టర్ ముక్తార్, డిఈ నవ్య జ్యోతి, డిఎంహెచ్వో మాలతి, వైద్యులు ప్రేమలత, నాగమణి, ఏఎన్ఎం రమాదేవి, డిఇఒ ప్రీతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల పనులను సకాలంలో పూర్తి చేయాలి

- ప్రజావాణి, సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్
- ధరణి ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి
- ఆర్డీవోలకు ఆదేశం



నవతెలంగాణ-పాల్వంచ

గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులకు కేటాయించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదు స్వీకరించి పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. అనంతరం గణతంత్ర దినోత్సవ వేడుకలు ధరణి దరఖాస్తులు పరిష్కారంపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రగతి మైదానాన్ని పరిశుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశించారు. ఏర్పాట్లు పర్యవేక్షణ చేయాలని కొత్తగూడెం ఆర్డీవోకు సూచించారు. పాఠశాలలు విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డిఇఓకు సూచించారు. ధరణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం భద్రాచలం ఆర్డీవోలకు ఆదేశించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించాలని ఆదేశించారు.

పొంగులేటి, కోరంకు గజమాలతో సత్కారం



నవతెలంగాణ-ఇల్లందు

నియోజవకర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనానికి జడ్పీ ఛైర్మెన్ కోరం కనకయ్య, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ అభిమానులు భారీగా తరలివచ్చారు. కామేపల్లి, ఇల్లందు, గార్ల, బయ్యారం, టేకులపల్లి మండలాలనుండి జడ్పీటీసీ మేకల మల్లిబాబు, గార్ల ఎంపీపీ కిషన్, మండలాల ఎంపీటీసీ, వార్డు మెంబర్లు, సర్పంచులు, కౌన్సిర్, బీఆర్ఎస్ నేత గుండా వెంకటరెడ్డి, భూక్య నాగేశ్వరరావు, విష్ణువర్ధన్ రెడ్డి, రెంటాల బుచ్చిరెడ్డి, డీసీబీసీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. సుమారు 5వేల మంది తరలిరావడంతో సభాస్థలి కిటకిటలాడింది. జెడ్పీ ఛైర్మన్, మాజీ ఎంపీలకు గజమాలతో సత్కారించారు. అభిమానులు మాజీ ఎంపీ పొంగులేటితో సెల్ఫిలు, ఫొటోలు దిగడానికి పోటీ పడ్డారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



నవతెలంగాణ-పినపాక

పినపాక మండలం ఉప్పాక గ్రామపంచాయతీ ఉప్పాక గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజను చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ గుమ్మడి గాంధీ, నవీన్ బాబు హాజరై శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ లాంటి మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుజాత, ఉప సర్పంచ్ రామారావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు మరింత బాధ్యతలను పెంచుతాయి

- ఎస్పీ వినీత్.జి



నవతెలంగాణ-కొత్తగూడెం

పదోన్నతులు అధికారులకు మరింత బాధ్యతలను పెంచుతాయని ఎస్పీ వినీత్.జి తెలిపారు. సోమవారం ఏఎస్ఐ నుండి ఎస్ఐలుగా పదోన్నతి పొందిన ఏడుగురు ఎస్ఐలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. 1984 బ్యాచ్‌నకు చెందిన వీరు ఇటీవల ఎస్ఐలుగా పదోన్నతి శిక్షణను పూర్తిచేసుకున్నారు. పదోన్నతిపై జిల్లాలో రిపోర్ట్ చేసిన వీరికి జిల్లాలో పోస్టింగులు కల్పించడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఎస్పీ వినీత్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో కానిస్టేబుల్ స్థాయి నుండి ఎస్సై వరకు పదోన్నతులు పొంది అత్యంత అనుభవాన్ని సాధించడం గొప్ప విషయమన్నారు. నూతనంగా భర్తీ అయిన పోలీసు అధికారులు, సిబ్బందికి విధి నిర్వహణలో వారి అనుభవాలను పంచుకుంటూ క్రమశిక్షణ, విధేయత గురించి నేర్పించాలని సూచించారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లయ్య



నవతెలంగాణ-దమ్మపేట

కేంద్రంలోని బీజేపీ మతతత్వ నియంత్రత పరిపాలన ఖండించాలని, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పెంచిన ఇండ్ల విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య అన్నారు. సోమవారం సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం, శాఖ కార్యదర్శుల సంయుక్త సమావేశం ముష్టిబండ గ్రామంలో మండల కమిటీ సభ్యుడు రావుల శోభన్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానం చేసిన ప్రకారం పోడు భూములందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని, లక్ష రూపాయల రుణం ఏకకాలంలో మాఫీ చేయాలని, సొంత ఇళ్ళ స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలతో ఇల్లు నిర్మించాలని, ఇండ్ల స్థలాలు లేని వారికి ఎండ్ల స్థలాలు ఇవ్వాలని, సాగు చేసుకుంటున్న రైతులు అందరికీ వారి భూములకి ధరణి వెబ్సైట్ ద్వారా పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఇచ్చిన పట్టాదార్ పాస్ పుస్తకాలు వారికి రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు అర్జున్ దొడ్డ లక్ష్మీనారాయణ, పార్టీ మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, అప్పారావు, లింగారెడ్డి, శివశంకర్, పెనుబల్లి నాన్నారావు, కొలిగిపోగు శ్రీనివాసరావు, పిల్లి నాయుడు, కొప్పుల శ్రీనివాసరావు, భోగ్యం నరసింహారావు, మోరంపూడి కేశవరావు, కారం వెంకటేశ్వరరావు, గోపిరాజు, మోతేపల్లి, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటి చెప్పిన ఎర్త్ మూవర్స్ యజమాని



నవతెలంగాణ-అశ్వాపల్లి

మండల కేంద్రములోని ఎర్త్ మూవర్స్ యజమాని మొహమ్మద్ మొఖ్తియార్ హుస్సేన్ మానవత్వాన్ని చాటి చెప్పారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన పరమ మరియమ్మ (80) అనే వృద్ధురాలు గత రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందిందిన విషయం విదితమే. సోమవారం ఈ విషయాన్ని తెలుసుకున్న మొక్తియార్ హుస్సేన్ మృతురాలి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మరియమ్మ అంత్యక్రియలకు ఇతోధిక సాయంగా రూ.3000లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఎవరున్నా తోచిన ఆర్థిక సహాయం అందజేస్తానని, ఇకముందు దానిని కొనసాగిస్తానని చెప్పారు.

తండాలలో సమస్యపై సర్వే నిర్వహించాలి : టీజీఎస్

చంద్రుగొండ : తండాజనులు సతమతమవుతున్న సమస్యలపై తక్షణమే సమగ్ర సర్వే చేపట్టాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుగులోత్ ధర్మ సంఘ సభ్యులకు పిలుపునిచ్చారు. సోమవారం చంద్రుగొండలో సంఘం సభ్యుల సమావేశంలో ధర్మ మాట్లాడుతూ పంటలు గిట్టుబాటు ధరలు రాక గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరగటంతో నిత్య జీవిత అవసరాల సరుకుల రేట్లు పెరగటంతో కుటుంబాల పోషణ, విద్య, వైద్యం చేయించుకునే పరిస్థితుల్లో దీనస్థితిలో బడుగు బలహీన గిరిజన లంబాడీల ప్రజలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై ఉద్యమించాలని అన్నారు. సంఘం ఆలిండియా మహాసభలు కలకత్తాలో, రాష్ట్ర మహాసభలు మిర్యాలగూడలో, జిల్లా మహాసభలు సుజాతనగర్ మండలం మంగపేటలో జరుగుతున్నాయన్నారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ప్రతి తండాలో జనరల్ బాడీ నిర్వహించి గ్రామ కమిటీలు వేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బానోతు నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు హర్ష అజ్మీర రమేష్, వెంకన్న, బద్రు, అజ్మీర బాలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో కొత్తగూడెం క్రీడాకారులకు పథకాలు

- జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ముగ్గురు మాస్టర్స్ క్రీడాకారులు



నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ఇటీవల మెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన 9వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో కొత్తగూడెం క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభకనబర్చి పథకాలు సాధించడమే కాకుండా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పట్టణానికి చెందిన క్రీడాకారుడు సిహెచ్.నాగయ్య 800, 400, 200 మీటర్ల పరుగు పందెంలో మూడు స్వర్ణాలు, 4 ఇంటూ 100 రిలే పరుగు పందెంలో రజత పథకం సాధించాడు. బి.కృష్ణయ్య క్రీడాకారుడు 5 కిలోమీటర్ల నడక పోటీల్లో రజితం, పి.మోహన్ క్రీడాకారుడు 5 కిలోమీటర్ల, 1500 మీటర్ల పరుగు పందెంలో రజిత పథకం సాధించాడు.

ముగ్గురు క్రీడాకారులు ఫిబ్రవరి 15 నుంచి హర్యానా రాష్ట్రంలోని చెండిగఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అత్యుత్తమ ప్రతిభకనబర్చి రాష్ట్ర స్థాయిలో పథకాలు సాధించడమే కాకుండా జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, తోటి యువ, సీనియర్ క్రీడాకారులు, పట్టణ ప్రముఖులు వారికి అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలోనూ పథకాలు సాధించి కొత్తగూడెం క్రీడా ఖ్యాతిని, ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. వృద్యాప్యంలోనూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న సీనియర్ క్రీడాకారులు నేటితరం యూవతకు ఆదర్శమని వారు పేర్కొన్నారు.

లక్ష్యం నెరవేరేనా..?

కంటి పరీక్షలతో సరి, శాశ్వత చికిత్సలు ఏవి..

- తొలివిడత జిల్లాలో నిలిచిపోయిన కంటి శస్త్ర చికిత్సలు
- 4లక్షల 80 వేల మందికి కంటి పరీక్షలు
- 523 మందికి మాత్రమే శస్త్ర చికిత్సలు



నవతెలంగాణ-పాల్వంచ

రాష్ట్ర ప్రభుత్వం కంటి వ్యాధిగ్రస్తులు లేకుండా చేయాలనే లక్ష్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. తొలివిడతలో ఆశించిన స్థాయిలో లక్ష్యం నెరవేరలేదని తెలుస్తోంది. మలివిడతలోనైనా పూర్తిస్థాయిలో శస్త్ర చికిత్సలు చేసి లక్ష్యం నెరవేరే దిశలో పయనిస్తుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

జిల్లాలో తొలివిడతలో బాగంగా ఇప్పటికి 4లక్షల 80 వేల మందికి కంటి వెలుగు వైద్య శిబిరాలలో కంటి పరీక్షలు నిర్వహించి ద్వితీయ శ్రేణి శుక్లాలు పెరిగిన 19,701 మందికి కంటికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వారందరికీ పాల్వంచలోని ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య కేంద్రంలో శాస్త్ర చికిత్స చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఇప్పటివరకు కేవలం 523 మందికి మాత్రమే కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. 2018 డిసెంబర్ 15 నుండి జిల్లాలో కంటి వెలుగు శస్త్ర చికిత్సలు నిలిపివేశారు. ఎందుకు శస్త్ర చికిత్సలు నిలిపివేశారో తెలియడం లేదు. అధికారులు మాత్రం కంటి శస్త్ర చికిత్సలు జరుగుతున్నట్లు చెబుతున్నా ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు మాత్రం కంటి వెలుగు ఆపరేషన్‌లు చేయడం లేదని చెబుతున్నారు.

జిల్లాలో కంటి వెలుగు సాగుతుందిలా..

రాష్ట్ర ప్రభుత్వం 2018 ఆగస్టు 15వ తేదీన తొలి విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పటి వరకు 2070 గ్రామాలు 66 వార్డుల్లో 4లక్షల 80 వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 1,81,498 మంది పురుషులు, 2,18,541 మంది మహిళలు 41 మంది ఇతరులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 48825 మంది ఎస్‌సిలు, 179746 మంది ఎస్టీలు, 143559 మంది బిసిలు 24927 మంది ఓసిలు, 3023 మంది మైనార్టీలు కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి పరీక్షలు నిర్వహించిన వారిలో రీడింగ్ గ్లాసులు అవసరం ఉందని గుర్తించి 88338 మందికి గ్లాసులు అందజేశారు. వారిలో 18117 మంది 40 సంవత్సరాలలోపు వారే కాగా 7022 మంది 40 సంవత్సరాలు పైబడినవారున్నారు. జిల్లా స్థాయిలో కంటి శుక్లాలు పెరిగి శస్త్ర చికిత్స అవసరం అని గుర్తించిన 19701 మందిని ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రిలో ఆపరేషన్‌లకు పంపారు. కానీ వారిలో 2018 డిసెంబర్ 15వ తేదీ వరకు కేవలం 523 మందికి మాత్రం కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఆ తర్వాత శస్త్ర చికిత్సలను నిలిపివేశారు. దీంతో ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగుతో తమకు కంటిచూపు ప్రాప్తిస్తుందని ఆశించిన అభాగ్యులకు నిరాశే మిగిలింది. కంటి పరీక్షలు నిర్వహించిన వారిలో 10336 కంటిలోని నల్లపొర నరాల సమస్య ఉందని గుర్తించి వారికి మెరుగైన వైద్య పరీక్షల నిమిత్తం కార్పొరేట్ వైద్య శాలలకు రెఫర్ చేయడం జరిగింది. ఎంత మందికి చికిత్స అందింది తెలియరాలేదు. ఏది ఏమైనా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు ఆశించిన రీతిలో లభించినట్లు లేదు. మలివిడత లోనైనా పూర్తిస్థాయిలో లక్ష్యం నెరవేర్చాలని కంటి చూపు ప్రాప్తిస్తుందని ఆశించిన అభాగ్యులకు వెలుగు నింపాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాలను ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేసిందనే విమర్శల నుండి బయటపడాలంటే పూర్తి స్థాయిలో ఆపరేషన్లు పూర్తి చేసి 100 కు 100 శాతం లక్ష్యం నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు.







ప్రజా సంపద దోపిడీ

- శ్రీనివాసరావు స్మారక స్తూపం ఆవిష్కరణలో పోతినేని

నవతెలంగాణ-చంద్రుగొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల ప్రజా సంపద దోపిడి కాబడుతుందని, దాన్ని రక్షించవలసిన బాధ్యత ప్రజలందరిపై ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినే సుదర్శన్ అన్నారు. సోమవారం చంద్రుగొండలో వంకాయలపాటి శ్రీనివాసరావు స్మారక స్థూపాన్ని పోతినేని సుదర్శన్, పార్టీ జెండాను సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య ఆవిష్కరించారు, సీపీఐ(ఎం) ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కార్యదర్శులు నున్న నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, టీజెఎస్ రాష్ట్ర నాయకులు తాళ్లూరి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ కొనకండ్ల వెంకటరెడ్డి, బీఆర్ఎస్, సీపీఐ వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల కార్యదర్శి ఐలూరి రామిరెడ్డి అధ్యక్షతన సంస్మరణ జరిగింది. ఈ సభలో సుదర్శన్ మాట్లాడుతూ పేదల సాగు భూమి ఉంటే వారి ఆకలికి తీరి సుఖమైన జీవనాన్ని గడుపుతారని గ్రహించి వారి చేత పోడు భూముల పోరాటం చేయించి సాధించి నేడు ప్రజల హృదయాల్లో శ్రీనివాసరావు నిలిచిపోయారన్నారు. ప్రభుత్వాలు బాధ్యత అంశాల నుంచి తప్పుకుంటున్నాయన్నారు. దేశానికి కమ్యూనిస్టుల అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాజంలో అసమానతలు తొలగిపోయే వరకు ఉద్యమాలు నిర్వహించాలన్నారు. అప్పుడే అమరజీవి శ్రీనివాసరావుకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య మాట్లాడుతూ నిజాయితీ నిబద్ధతతో పని చేసి ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారు అన్నారు. భూమి, ఉద్యోగం లేక ప్రజలు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. ప్రజలు చైతన్యమై తిరుగుబాటు వస్తే త్వరలోనే కమ్యూనిజం వస్తుందన్నారు. భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ కూలికి వెళితే జీవనం గడిచే పేదలకు బ్రహ్మాండమైన సాగుభూమి సాధించి, జీవితాన్ని గడుపుతున్నారన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం మనమందరం పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉండి ఉపాధి, భూమి సాధించి పేదలకు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, భూక్య రమేష్, అన్నవరపు సత్యనారాయణ, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గూగులోతు ధర్మ జిల్లా కార్యదర్శి బానోతు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దారా బాబు, మండల నాయకులు మాలోత్ బొజ్జ నాయక్, భూపతి శ్రీనివాసరావు, గాదె లింగయ్య, సీపీఐ జిల్లా నాయకులు మహమ్మద్ కాజా, గార్లపాటి రామనాథం, జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు చల్ల మల్ల విటల్, సీనియర్ నాయకులు మావిళ్ళ వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గార్లపాటి పవన్, సీపీఐ(ఎం) జూలూరుపాడు ,అన్నపురెడ్డిపల్లి, సుజాతనగర్ కార్యదర్శులు యాసా నరేష్, జంగిలి వెంకటరత్నం, ఈర్ల రమేష్, చంద్రుగొండ ఉపసర్పంచ్ దెబ్బెందుల బాబురావు, సీపీఐ(ఎం) చంద్రుగొండ మండల కమిటీ సభ్యులు పెద్దెన్ని వేణు, విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, రామడుగు వెంకటాచారి, గాలి రామారావు, షేక్ నాగుల్ మీరా, అబ్దుల్ రెహమాన్, రాము, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వర్కర్ల భిక్షాటన...!



నవతెలంగాణ-భద్రాచలం

బకాయి వేతనాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ జనవరి మూడో తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న గిరిజన హాస్టల్ ఔట్సోర్సింగ్ కార్మికులు సోమవారం భద్రాచలం పట్టణంలో భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మాచారి మాట్లాడుతూ గిరిజన కార్మికులకు రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం జీతాలు ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో కార్మికులు పస్తులతో ఉంటుంటే ముఖ్యమంత్రి, మంత్రులకు పట్టదా అని ప్రశ్నించారు. ఇప్పటికే అనేకసార్లు మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, అధికారులకు కార్మికులు తమ గోడును వెళ్లబోసుకున్నారని అయినప్పటికీ వారి నుండి ఎటువంటి స్పందన లేని కారణంగానే జనవరి 3 నుంచి సమ్మెకు దిగాల్సి వచ్చిందని సిఐటియు పేర్కొన్నది. గిరిజన కార్మికుల చేస్తున్న ఆకలి పోరాటానికి భద్రాచలం పట్టణ ప్రజలు అండగా ఉండాలని వారి పోరాటానికి ఆర్థిక సహాయాన్ని అందించి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన కార్మికులు పస్తులు ఉంటుంటే జిల్లాలోని గిరిజన ప్రజాప్రతినిధులు మంత్రులు నోరు మెదపకపోవడం వారి అసమర్థత తెలియపరుస్తుందని సిఐటియు విమర్శించింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించి సమ్మెను పరిష్కారం చేయాలని లేదంటే ప్రజలు ప్రజాసంఘాల సహకారంతో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు భద్రాచలం పట్టణ నాయకులు నకిరికంటి నాగరాజు, జి లక్ష్మీకాంత్, హాస్టల్ వర్కర్ల యూనియన్ నాయకులు లక్ష్మి, శ్రీను, రాములు, భద్రమ్మ, నాగమణి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు

కేజీబీవీలో ఘనంగా బాలికా వారోత్సవాలు

నవతెలంగాణ-ములకలపల్లి

మండల కేంద్రంలోని కేజీబీవీలో జాతీయ బాలికల వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వారోత్సవాల కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై 18 ఏళ్లలోపు బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, బాల్య వివాహాలు, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, వారికి ఉన్న చట్టాలపై క్షుణ్ణంగా వివరించి అవగాహన కల్పించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా డ్రాపవుట్ అయిన కొందరు పిల్లలను గుర్తించి కేజీబీవీలో చేర్పించారు. ఈ వారోత్సవాల్లో పోలీస్ శాఖ నుంచి సైకాలజిస్ట్ నాగేశ్వరరావు, కానిస్టేబుల్ వీరభద్రం, కేజీబీవీ ప్రిన్సిపాల్ సక్కుబాయి, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగమణి, అంగన్వాడీ టీచర్లు శ్రీలత, సత్యలక్ష్మి, నాగరాణి, బీబీనాంచారి, రమాదేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేతాజీ మన్నించు

- నిన్ను చూడ లేని జనం కోసమా నీ ప్రాణ త్యాగం?



నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

భారతదేశ చరిత్ర పుటల్లో కీర్తి కిరీటాల్లో నిలిచిపోయిన కొద్దమంది నేతల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఒకరు. దాస్య శృంఖాలాల్లో మగ్గుతున్న భారతీయులకు అభయహస్తం అందించి అతని దేశం కోశం అతని ప్రాణాలను పణంగా పెట్టి బ్రిటీష్ వాళ్ళకు వ్యతిరేకంగా పోరాడి స్వాతంత్ర్య సమర పోరాటంలో తన ప్రాణాలను కూడా లెక్కచేయకుండా మరణం కూడా ఇంకా రహస్యంగానే మిగిలిపోయింది. అటువంటి మహాను బావుడు 126వ జయంతి సందర్భంగా కూడా అతని విగ్రహాన్ని కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవలేదు. మండల పరిధిలోని యర్రగుంట గ్రామంలోని ప్రధాన సెంటర్ జాతీయ రహదారికి ఆనుకొని వున్న సుభాష్ చంద్రబోస్ విగ్రహం జాతీయ రహదారులు విస్తరణ దశలో భాగంగా ప్రధాన సెంటర్‌లో వున్న విగ్రహాన్ని తొలిగించి పక్కన పెట్టారు. పక్కన పెట్టిన విగ్రహాన్ని పునఃప్రతిష్టించకుండా వదిలి వేశారు. సంవత్సరాలు గడుస్తున్నా ఒక్క అధికారి కాని ఒక్క ప్రజా ప్రతినిది కూడా పట్టించుకోకపోవడంతో కొందరు మద్యం ప్రియులు అతిగా మద్యం సేవించి విగ్రహంపై మూత్ర విసర్జన చేయడం, మరి కొందరు అయితే కిల్లిలు నమిలి సుభాష్ చంద్రబోస్ విగ్రహం పై ఊమ్ము వేస్తూ అవమానిస్తున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చిన్న చిన్న సమావేశాలకు రోజుకో పార్టీ మారే రాజకీయ నాయకులు కోసం ఫ్లెక్సీలు పెట్టడం ఎక్కడో ఉండే ఒక నాయుకుడి కొడుకు పుట్టిన రోజులు వర్ధంతులు అంటు కేక్ కట్ చేయడం వేల రూపాయలు ఖర్చు చేసి అంగు ఆర్భాటాలు చేస్తున్నారు. కానీ దేశం కోశం స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణ త్యాగాలు చేసిన సుభాష్ చంద్రబోస్ విగ్రహం నిండా పిచ్చి చెట్లు మొలకెత్తి కనపడకుండా జాతీయ రహదారి పక్కనే యర్రగుంట గ్రామంలో వున్న విగ్రహాన్ని ప్రతిష్టించకపోవడం ఆయన జయంతి చేయకపోవడం చాలా దురదృష్టకరమని వెంటనే సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ప్రతిష్టించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న కేంద్ర మంత్రి



నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని సోమవారం ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి, కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి బీఎల్ వర్మ దర్శించుకున్నారు. ఆలయం వద్దకు వచ్చిన మంత్రికి పూలమాలవేసి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే శ్వాస, ధ్యాస అందుకే పార్టీ మారా..

- స్వలాభం కోసం కొందరు సొంత ఇంటి లాంటి పార్టీకి నిప్పు పెడుతున్నారు
- పరామర్శలంటూ కుటిలయత్నాలు
- మున్సిపల్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే హరి ప్రియ



నవతెలంగాణ-ఇల్లందు

నియోజకవర్గ అభివృద్ధే శ్వాస ధ్యాస అందుకే కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీకి మారానని ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. బీఆర్ఎస్ పార్టీతోనే ఇల్లందు నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆలోచించి పార్టీ మారానని ఎమ్మెల్యే గుర్తు చేశారు. నేడు అందుకు భిన్నంగా జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, కొందరు వ్యక్తులు నియోజకవర్గంలో సొంత ఇంటి లాంటి పార్టీని చీల్చడం కోసం నియోజకవర్గంలో తిరుగుతున్నారని అటువంటి వారిని ఇల్లందు ప్రజలు విశ్వసించరని ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం మున్సిపల్ పాలకవర్గం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తి చేసుకుని నాలుగో సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళన సభకు విశేష స్పందన భారీగా ప్రజలు హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నేడు పరామర్శలు ఆత్మీయ సమ్మేళనాల పేరుతో నియోజకవర్గంలో తిరగడం విడ్డూరంగా ఉందన్నారు. కష్టకాలంలో ప్రజలను గాలికి వదిలేసి కేవలం తమ స్వలాభం కోసం నేడు ప్రజలకు దగ్గర అవ్వాలని ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తే ప్రజలు ఆదరించరన్నారు. అంతేకాకుండా ఇల్లందు నియోజకవర్గానికి సంబంధం లేనటువంటి మరి కొంతమంది వ్యక్తులు కూడా ఆత్మీయ సమ్మేళనాలంటూ పరామర్శలు అంటూ నియోజకవర్గంలో తిరుగుతుండడం ఎవరు ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్‌ని ప్రతి కుటుంబం తమ గుండెల్లో దాచుకున్నారని ఎమ్మెల్యే అన్నారు.

మున్సిపాలిటీ పరుగులు : రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచాం

గత మూడేండ్లుగా ఇల్లందు మున్సిపల్ పాలకవర్గ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులలో ఎంతో అభివృద్ధి జరిగిందని గతంతో పోలిస్తే అభివృద్ధిలో ఇల్లందు మున్సిపాలిటీ పరుగులు పెడుతూ తెలంగాణ రాష్ట్ర స్థాయిలోనే మొదటి స్థానం సాధించి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు ఆదర్శ మున్సిపాలిటీగా అవార్డు అందుకోవడం జరిగిందని అన్నారు. ఈ ఘనతలో మున్సిపల్ పాలకవర్గంతో పాటు ఇల్లెందు పట్టణ ప్రజల సహకారం కూడా ఎంతో ఉందని తెలియజేశారు.. ఇల్లందు పట్టణంలో జరుగుతున్న అనేక అభివృద్ధి ఆ నాటితో పోలిస్తే ఈనాడు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని అందులో ప్రధానమైనవి బస్ డిపో, సెంట్రల్ లైటింగ్, ఇల్లందు పట్టణ ప్రధాన రహదారి అని ఎమ్మెల్యే అన్నారు. వైద్య రంగంలో కూడా ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలను వైద్య విధాన పరిషత్‌లోకి మార్చి నేడు ఏడుగురు వైద్య సిబ్బందితో అనేక మెరుగైన వైద్య సదుపాయాలతో ఇల్లందు ప్రజలకు అందుబాటులోకి తీయడం జరిగిందన్నారు. గత పాలకులు అభివృద్ధిని మరిచారన్నారు. సభలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ భానోత్ హరిసింగ్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షకార్యదర్శులు మనోహర్ తివారి, పర్చూర్ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాన్ని ప్రారంభించిన మెచ్చా



నవతెలంగాణ-దమ్మపేట

మండలంలోని జమీందార్ బంజర్‌లో క్రీడా మైదానాన్ని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు స్థానిక ప్రజా ప్రతినిదులతో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి ఎమ్మెల్యే వాలీబాల్ ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిరోజూ ఆటలు ఆడడం వల్ల శారీరక ధృఢత్వంతో పాటు మానసికంగా ఉల్లాసంగా ఉంటారని, ప్రజలకు ఆరోగ్య వాతావరణాన్ని కల్పించేందుకు సీఎం కేసీఆర్ పట్టణ, గ్రామీణ క్రీడా మైదానాలు ప్రారంభించాలని ఆదేశించారని, ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి మన తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ పరిపాలనలో చూస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వర రావు, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డకుల రాజేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జున్ రావు, సర్పంచ్ పాసం సుగుణ, ఉప సర్పంచ్ కుంజ రాజు, దమ్మపేట ఉప సర్పంచ్ దారా యుగంధర్, అప్పారావు, అబ్దుల్ జిన్నా, వార్డ్ మెంబర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

www.praja.khammam@gmail.com

ఖేలో ఇండియా ఖోఖో జాతీయ పోటీలకు బి.శ్రవంత్ ఎంపిక



నవతెలంగాణ-పాల్వంచ

ఖేలో ఇండియా కోకో జాతీయ పోటీలకు టీటీడబ్ల్యూఆర్‌జె(సీఓఈ) కిన్నెరసాని క్రీడాకారుడు బి.శ్రవంత్ ఖమ్మం జిల్లా కోకో అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ కోకో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ఖేలో ఇండియా యూత్ జట్టుకి ఎంపికయ్యారు. ఈ ఖేలో ఇండియా పోటీలు మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్పూర్‌లో ఈ నెల 31 నుండి ఫిబ్రవరి 4 వరకు జరుగు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలంగాణ రాష్ట్ర కోకో అసోసియేషన్ అధ్యక్షులు జంగా రాఘవ రెడ్డి ప్రధాన కార్యదర్శి నేటి కృష్ణమూర్తి తెలిపారు. అలాగే ఈ ఖేలో ఇండియా పోటీలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో పాల్గొనటానికి శిక్షణ శిబిరాన్ని హైదరాబాద్ సరూర్నగర్ స్టేడియం నందు తర్ఫీదు పొందుతున్నాడు. ఇతను ఎంపిక కావడం పట్ల గిరిజన గురుకుల ఆర్సీ డేవిడ్ రాజు టీటీడబ్ల్యూఆర్‌జెసీ కిన్నెరసాని డ్యాంసైట్, ప్రిన్సిపాల్ సంక్రాంతి రవికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణ్, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇతను ఇంటర్మీడియట్ ఒకేషనల్ గ్రూపులో కిన్నెరసాని కళాశాల నందు చదువుతున్నాడు. మంచి క్రీడా నైపుణ్యాన్ని జాతీయస్థాయిలో ప్రదర్శించాలని అధ్యాపకులు ఆశిస్తున్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- ఆన్యువల్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని ప్రారంభించిన రేగా



నవతెలంగాణ-మణుగూరు

విద్యార్థులలో క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. సోమవారం చాపల మార్కెట్ ఏరియాలో గల సత్య భాస్కర అండ్ మాంటిస్సోరి స్కూల్‌లో ఆన్యువల్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడా పథకాన్ని ఆవిష్కరించారు. పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. తదానంతరం విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ ద్వారా గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి మంచిగా చదువుకొని భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదగాలని మీ తల్లిదండ్రులకు మీ గ్రామానికి, మన ప్రాంతానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఒక లక్ష్యంతో చదువుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నెదుంతుండం, పాఠశాల కరస్పాండెంట్ శివారెడ్డి, జడ్పీటీసీ పోశం నర్సింహారావు, పీఏసీఎస్ చైర్మెన్ కుర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం

- పాఠశాల నుండి ప్రతిపాదనలకు ఉత్తర్వులు

నవతెలంగాణ-పాల్వంచ

జిల్లాలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చే గుర్తింపు పొందిన పేరు ప్రఖ్యాతలు కలిగిన ప్రయివేటు పాఠశాల నుండి బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని కింద ప్రతిపాదనలను ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి డి.అనసూర్య తెలిపారు. రెసిడెన్షియల్ నాన్ రెసిడెన్షియల్ 2023-24 విద్యా సంవత్సరం వరకు ఆసక్తి కలిగిన పాఠశాల నుండి ప్రతిపాదనలు ప్రభుత్వ ఉత్తర్వులకు రెసిడెన్షియల్ కేటగిరికి రూ.42000 అంతకంటే తక్కువ నాన్ రెసిడెన్షియల్ క్యాటగిరీకి రూ.28000 అంతకంటే తక్కువ లోబడి కోరనైనది అని చెప్పారు. మంచి మౌలిక వసతులు గడిచిన ఐదు సంవత్సరంలో 7,10వ తరగతి 90శాతం ఉత్తీర్ణత అందులో 50శాతం ప్రథమ శ్రేణి యందు ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈ ప్రతిపాదనను జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈ నెల 31న సాయంత్రం ఐదు గంటల లోపు సమర్పించాలని కోరారు. సంప్రదించు ఫోన్ నెంబర్ 8106746383

గ్రేసుమని సేవలు మరువలేనివి

- ద్వితీయ వర్ధంతి సభలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నబి



నవతెలంగాణ-ఇల్లందు

సీపీఐ(ఎం) డివిజన్ మహిళా నేత గ్రేసుమణి సేవలు మరువలేనివనీ సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నబి అన్నారు. ద్వితీయ వర్ధంతి సందర్భంగా స్థానిక లలిత్ కళామందిర్ ప్రాంతంలో గల వారి స్తూపం వద్ద జెండా ఆవిష్కరణ చేసి నివాళులర్పించారు. అనంతరం ఆలేటి కిరణ్ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ మండల కార్యదర్శి అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడుతూ గ్రేసు మణి పార్టీ పట్ల క్రమశిక్షణ, నిబద్ధత గల మహిళా నేత అని కొనియాడారు. మహిళా సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. పేద బడుగు బలహీన వర్గాలకు అభ్యున్నతి పోరాడిన యోధురాలు అని అన్నారు. పార్టీ కార్యాలయం వద్ద వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శీల పోగు విజయ కుమార్, ప్రవీణ్, వారి కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్ రావు, మునిగంటి లక్ష్మీ, వాసం రాము, సర్వన్ కుమార్, కామ నాగరాజు, లక్ష్మణ్, రాందాస్, పుల్లూరి లక్ష్మీ, శ్రీనివాస్, ఖాదర్, సుల్తానా, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మనీషా దశదిన కర్మకు హాజరైన సీపీఐ(ఎం) నాయకులు



నవతెలంగాణ-దమ్మపేట

మండలంలోని ముష్టిబండ గ్రామములో ఇటీవల అనారోగ్యంతో మరణించిన తంగెళ్ళమూడి మనీషా దశ దిశ కర్మకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెర పార్టీ పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు పిట్టల అర్జున్ దొడ్డ లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు అప్పారావు, రావుల శోభన్ బాబు, లింగారెడ్డి, శివశంకర్, మొరంపూడి కేశవరావు, భోగ్యం నరసింహారావు, కొప్పుల శ్రీనివాసరావు, పెనుబల్లి నాన్నారావు, కొలిగిపోగు శ్రీనివాసరావు, జగపతి, లక్ష్మీనారాయణ తదితరులు హాజరై మనిషా చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.

ఏ జెండా పట్టినా శీనన్న, కోరం వెంటే ఉంటాం

- సభలకు వెళ్ళొద్దని బెదిరింపులకు గురిచేశారు
- జడ్పీటీసీ మేకల మల్లిబాబు, గార్ల ఎంపీపీ

ఇల్లందు : రాబోయే ఎన్నికల సందర్భంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్, జడ్పీ చైర్మెన్ కోరం కనయ్యలు ఏ జెండా పట్టినా వారి వెంటే ఉంటామని కామేపల్లి జడ్పీటీసీ మేకల మల్లిబాబు యాదవ్, గార్ల ఎంపీపీ కిషన్ నాయక్ ఇతర ప్రజాప్రతినిధులు అన్నారు. మండల పరిధిలోని లలితాపురం మామిడితోటలో సోమవారం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనలంలో మాట్లాడారు. ఎటు ప్రయాణం చేయ డానికైనా సిద్ధంగా ఉండాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. పేదలు, నిరుపే దలను ఆదుకునే శీనన్న ఉన్నారని బలపరచాల్సిన అవసరం ఉందన్నారు. సమ్మేళనానికి వెళ్ళద్దని అనేక బెదిరింపులకు సైతనం గురిచేశారని, సంక్షేమ పథకాలు రాకుండా చేస్తామని ఫోన్‌లు వచ్చాయన్నారు. ఇంకా అనేక మంది సమ్మేళనానికి రావాల్సి ఉన్నా అడ్డుకున్నారని అన్నారు. 2013లో రాజకీయ అరగ్రేటం చేసిన శీనన్న 2014 ఎన్నికల్లో ఎంపీ, నాలుగు ఎంఎల్ఏ స్థానాలు గెలిపించిన ఘనత ఉందన్నారు. ఈ సభలో డీసీసీబీ డైరెక్టర్‌లు తూళ్ళూరి బ్రహ్మయ్య గార్ల జెడ్పీటీసీ జాటోత్, మువ్వ విజయబాబు, న్యాయవాది, ఉద్యమ నేత సువర్ణపాక సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు.

హెల్పింగ్ హాండ్స్ ఫ్యామిలీ స్వచ్ఛంద సేవా సంస్థ విరాళం

నవతెలంగాణ-పినపాక

టీయస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో హెల్పింగ్ హాండ్స్ ఫ్యామిలీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చింతల బయ్యారం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్‌లో 1వ తరగతి చదువుతూ తల్లిదండ్రులు లేని తండ్రులు హర్షిత అనే విద్యార్థినికి హెల్పింగ్ హాండ్స్ ఫ్యామిలీ స్వచ్ఛంద సేవా సంస్థ స్థాపకులు, యూటీఎఫ్ మండల వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చదువులకు అయ్యే ఖర్చులను అందజేస్తామని తెలిపారు. 3 జతల బట్టలు, ఇన్నర్ వేర్స్, స్కూల్ బ్యాగ్‌లను అందించారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జి.కిరణ్ శ్రీనివాస్, బి.భాస్కర్ రావు, వైస్ ప్రెసిడెంట్ కే.శ్రీనివాస్, ట్రెజరర్ బి.కాంతారావు, చింతల బయ్యారం ఉప సర్పంచ్ సంతోష్, సెక్రటరీ సాంభశివరావు, స్కూల్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించుకుందాం..చదివిద్దాం

- అవగాహనా సదస్సులో సీడీపీఓ



నవతెలంగాణ-మణుగూరు

ఆడపిల్లలను రక్షించుకుందాం, చదివిద్దాం అని సీడీపీఓ పి.జయలక్ష్మీ అన్నారు. సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని శివలింగాపురంలో గల బాలల సదనంలో అంతర్జాతీయ బాలల వారోత్సవాల సందర్భంగా బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి మాట్లాడుతూ పిల్లలు బాధ పడే విధంగా అసహ్యం కలిగించే విధంగా మాట్లాడే వారి ప్రవర్తన వ్యత్యాసాన్ని గుర్తించాలని విద్యార్థులకు సూచించారు. మన వంతు సహాయం అందించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని సీడీపీఓ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ దీప్తిరాణి, అంగన్వాడీ టీచర్లు జి.సుమలత, ఎన్.రాణి, బి.సుజాత హాస్టల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏసీడీ ఛార్జీలు రద్దు చేయాలి

- సీపీఐ(ఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా
- విద్యుత్ ఏఈకి వినతి పత్రం



నవతెలంగాణ-భద్రాచలం

విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అధిక భారం మోపుతున్న ఏసీడీ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించి ఏఈకు వినతిపత్రం అందించారు. సంబంధింత సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏఈ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా మాట్లాడుతూ విద్యుత్ శాఖ గత సంవత్సరం అధిక లోడు పేరుతో వేల రూపాయలు వసూలు చేసిందని, మళ్లీ ఇప్పుడు అడిషనల్ కన్స్యూమర్ డెవలప్మెంట్ చార్జెస్ (ఏసీడీ) పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపడం సరైనది కాదని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు విద్యుత్ నియంత్రణ మండలి ఇస్తున్న మితిమీరిన స్వేచ్ఛ ఫలితంగా విద్యుత్ వినియోగదారులపై భారాలు అధికమవుతున్నాయని, విద్యుత్ ప్రైవేటీకరణ చేసే కుట్రలో భాగంగానే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. విద్యుత్ మీటర్లు ఇచ్చేటప్పుడే బ్యాంకులో, మీసేవలో వేల రూపాయలు చలానాలు వసూలు చేస్తూ మళ్ళీ ఇప్పుడు కన్జ్యూమర్ దగ్గర అడిషనల్ గా వసూలు చేయడం దారుణమని అన్నారు. ఈ అధిక బిల్లులు వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు, చిరు వ్యాపారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. తక్షణమే విద్యుత్ వినియోదారులపై ఏసీబీ పేరుతో వేస్తున్న అదనపు భారాలను రద్దు చేయాలని విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.రేణుక, సున్నం గంగా, కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, పి.సంతోష్ కుమార్, ఎన్ లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు ఎం.నాగరాజు, డి.సీతాలక్ష్మి, యు.జ్యోతి, సిహెచ్ మాధవరావు, ఎస్‌డీ ఫిరోజ్, ఎస్.రామకృష్ణ, కోరాడ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ చేగొండి శ్రీనివాస్, భూపేంద్ర, డివైఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు సతీష్, ప్రేమ్ కుమార్, సీనియర్ నాయకులు బిబిజి తిలక్, బీజెఎల్‌పి దాసు తదితరులు పాల్గొన్నారు.

భావ ప్రకటన స్వేచ్ఛ....రాజ్యాంగం కల్పించిన హక్కు



నవతెలంగాణ-కొత్తగూడెం

భావ ప్రకటన స్వేచ్ఛ, రాజ్యాంగం కల్పించిన హక్కు అని పలువురు నాయకులు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో భావ ప్రకటన స్వేచ్ఛ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అంబేద్కర్ వాదులు, నాస్తిక వాదులు, హేతువాదులు, టీచర్లు పైన జరుగుతున్న సామూహిక దాడులు మూక దాడులకు వ్యతిరేకంగా మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మతోన్మాద దాడులకు బలైపోయిన పన్సారే, ద బోల్కర్, గౌరీ లంకేష్‌లకు నివాళులు అర్పించి అనంతరం భావ ప్రకటన స్వేచ్ఛ జేఏసీ రాష్ట్ర నాయకులు జీడి సారయ్య, ప్రముఖ హేతువాద నాస్తిక ఉద్యమ కారులు డాక్టర్ భాను ప్రసాద్, శాస్త్రీయ అధ్యయన వేదిక రాష్ట్ర కన్వీనర్ చారువాక, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఎల్.విశ్వనాథం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నాస్తిక, హేతువాద, అంబేద్కర్ వాదులు, టీచర్ల పైన సామూహిక మూక దాడులు ఈ మధ్యకాలంలో ఎక్కువ చేసిందన్నారు. ఒక వర్గం ప్రజలు కావాలని ఇటువంటి వారిపైన దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీ నాయకులు రాసుద్దీన్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ టిపిఎఫ్ జిల్లా కన్వీనర్ మంతెన సంజీవరావు, హేతువాద సంఘం నాయకులు సుభాని, టీజేఎస్ నాయకులు భరత్, అంబేద్కర్ పూలే, యువజన సంఘం నాయకులు ప్రశాంత్, పీడీఎస్‌యూ నాయకులు మంజుల, సాంబ, కంపాటి పృథ్వి, సురేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు మంతెన వసంతరావు ఎంఎస్‌పి నాయకులు డేవిడ్, గణేష్ శాస్త్రీయ అధ్యయన వేదిక జిల్లా నాయకులు భూక్య శివ, కోటేశ్వరరావు తెలంగాణ ఉద్యమకారులు తొగరు రాజశేఖర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

26న బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

- విప్ రేగా



నవతెలంగాణ-మణుగూరు

బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని విప్, ఎమ్మెల్యే రేగా కాంతరావు అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ మండల కేంద్రంలో ఈనెల 26వ తేదీన పినపాక నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నియోజవర్గంలోని ఏడు మండలాల పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ సీనియర్ నాయకులతో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలన్నారు.

సీనియర్ పాత్రికేయులు ఏబీఎన్ రాజు మృతి

- పలువురు సంతాపం







నవతెలంగాణ-కొత్తగూడెం

సీనియర్ పాత్రికేయులు ఎలక్ట్రానిక్ మీడియా ఏబీఎన్ రిపోర్టర్‌గా సేవలందిస్తున్న కల్లూరి యతిరాజ్ కుమార్ (49) సోమవారం ఆకాలమరణం చెందారు. సోమవారం తెల్లవారు ఝామున చాతిలో నొప్పి రావడంతో అతన్ని సమీప ప్రయివేటు అసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కొత్తగూడెం ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. గుండె పోటుగా డాక్టర్స్ నిర్ధారించారు. లక్ష్మీదేవిపల్లి శ్రీనర్ కాలనీలో నివాసం ఉంటున్న ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. గత మూడు దశాబ్దాలుగా వివిధ ఛానల్స్‌లో రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన మృత దేహాన్ని వారి స్వగ్రామం జూలూరు పాడు మండలం గూడెపూడికి తరలించారు. కుమారుడు లండన్‌లో ఉన్నారని, అతను విదేశాల నుండి వచ్చిన తరువాత స్వగ్రామం గుండెపూడిలో అంతక్రియలు నిర్వహించడం జరుగుతుందని సమాచారం. జిల్లాకేంద్రంలోని పాత్రికేయులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆదివారం రాత్రి వరకు పలువురు మిత్రులతో కలిసి ఉన్న ఆయన ఉదయం మృతి చెందడంతో షాక్‌కు గురయ్యారు.

విప్ రేగా కాంతారావు : రాజ్ కుమార్ ఆకస్మికంగా మరణం పట్ల విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధర్యం ప్రసాదించాలని భగవంతుని ప్రార్థించారు. సీనియర్ జర్నలిస్టుగా మీడియా రంగంలో తను అందించిన సేవలను కొనియాడారు.

జిల్లా కలెక్టర్ అనుదీప్ : రాజు మృతి పట్ల కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణానికి గల కారణాలను డిపిఆర్‌ఓను అడిగి తెలుసుకున్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఎంపీ నామా : మంచి మిత్రుడు, కొత్తగూడెం రిపోర్టర్ కల్లూరి రాజు ఇక మనకు లేరనే వార్తను జీర్ణించుకోలేక పోతున్నానని ఎంపీ నామా నాగేశ్వరారరావు సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి నాప్రగాఢ సానుభూతిని తెలిజేశారు.

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సంతాపం : రాజ్‌కుమార్ ఆకాల మరణం పట్ల సీపీఐ(ఎం) జిల్లా కమిటీ తీవ్ర సంతాపం, వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. సోమవారం రాజు మృతి వార్త తెలుసుకన్న నాయకులు ప్రభుత్వ అసుపత్రికి వెళ్లి బౌతికాయాన్ని సందర్శించారు. సీపీఐ(ఎం) అనుబంధ ప్రజా సంఘాలు సంతాపలు తెలిపారు.

పలువురి సంతాపం : రాజ్‌కుమార్ మృతి పట్ల కొత్తగూడెం మాజీ శాసనసభ్యులు జలగం వెంకట రావు తీవ్ర సంతాపం తెలిపారు. రాజు మృతి చెందాడనే వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని జలగం తెలిపారు. రాజు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటు ఆదుకుంటామని అన్నారు.

ఏబీఎన్ రాజుకు సీపీఐ(ఎం) నివాళి

జూలురుపాడు : సీనియర్ జర్నలిస్ట్ రాజు మృతదేహానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య, పార్టీ భద్రాద్రి, ఖమ్మం జిల్లా కార్యదర్శులు అన్నవరపు కనకయ్య, నున్న నాగేశ్వరరావు, జిల్లా, మండల నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ... అతి చిన్న వయసులో గుండెపోటు రావడం చాలా విచారకరమైనదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడూ నవ్వుతూ ఉండే రాజుకి ఇలా జరగడం వల్ల పార్టీ నాయకులు కార్యకర్తలు అంతా దిగ్భ్రాంతికి లోనయ్యమని అన్నారు. రజు మరణం యావత్ పత్రికలోకానీ తీరని లోటని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధికి స్థానిక నాయకులకు సలహాలు, సూచనలు ఇచ్చేవారని ఇచ్చేవారని గుర్తు చేశారు. వారి కుటుంబానికి సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ నుండి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అదేవిధంగా రాజ్ కుమార్ ఆకస్మిక మృతి పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాళ్లమండి కృష్ణమూర్తి, మాజీ సీనియర్ జర్నలిస్టు వెలదండి ప్రసాద్, జర్నలిస్టు తోట శ్రీనివాసరావు, దేవి శ్రీనివాస్, కుశల్ నాయక్ సంతాపం ప్రకటించారు. సోమవారం స్వగ్రామంలో జూలూరుపాడు మండలం గుండెపూడి గ్రామంలో మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. సీనియర్ జర్నలిస్టుగా మీడియా రంగంలో తను అందించిన సేవలను కొనియాడారు.

మణుగూరు : ఏబీఎన్ సీనియర్ జర్నలిస్ట్ రాజ్ కుమార్ మృతికి విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు సంతాపం తెలిపారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో రాజ్‌కుమార్ మృతి పట్ల సంతాపం ప్రకటించారు. రాజ్‌కుమార్ గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధర్యం ప్రసాదించాలని భగవంతుని ప్రార్థించారు. సీనియర్ జర్నలిస్టుగా మీడియా రంగంలో తను అందించిన సేవలను కొనియాడారు.

పాల్వంచ : ఏబీఎన్ జర్నలిస్ట్ రాజు ఆకస్మిక మృతి పట్ల కలెక్టర్ అనుదీప్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణానికి గల కారణాలను డీపీఆర్‌ఓను అడిగి తెలుసుకున్నారు.

సోమవారం తెల్లవారు జామున తీవ్రమైన గుండె నొప్పి రావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, వైద్య చికిత్స తీసుకుంటూనే కుప్పకూలి పోయారని, అతని మరణం చాలా బాధాకరమని చెప్పారు. అందరితో ఎంతో కలివిడిగా ఉండేవారని, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

యువత నేతాజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

- సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-పాల్వంచ

నేటి యువత స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాస్ చంద్రబోస్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని జీవించాలని తహశీల్దార్ రంగా ప్రసాద్ యువతకు పిలుపునిచ్చారు. సోమవారం సుభాస్ చంద్రబోస్ 126వ జయంతిని నేతాజీ యువజన సంఘం, జనతా పౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్వంచ తహశీల్దార్ రంగా ప్రసాద్ హాజరై నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ హాస్పిటల్‌లో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలను తహసీల్దార్ రంగా ప్రసాద్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వర్ రావు, ఆర్.యమ్.ఓ డాక్టర్ సోమరాజు దొర, నేతాజీ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.జె.కె.అహ్మద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేతాజీ యువజన సంఘం, జనతా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.జె.కె. అహ్మద్, పాల్వంచ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల కొండలరావు, సంఘ సభ్యులు సయ్యద్ అక్బర్, యం.డి.అబ్దుల్ రజాక్, తదితరులు పాల్గొన్నారు.

పినపాక : నాకు రక్తాన్ని ఇవ్వండి.. నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను అంటూ స్వతంత్ర భారతావని కోసం పోరాడిన కీర్తికిరీటం నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తోట గంగాధర్, ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ బృహస్పతి అన్నారు. సోమవారం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో నేతాజీ జయంతిని నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రశ్నలు గంగాధర్ మాట్లాడారు. ప్రెస్ క్లబ్ తరపున నేతాజీకి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కట్టా శ్రీను, రమేష్, కార్యదర్శి గంగాధర్ రెడ్డి, సారయ్య, శంకర్, లక్ష్మణ్, విజయ్, మహిళా కార్యదర్శి శ్రీలత, నరేష్, వినయ్, లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ చొరవతో పాఠశాలలో క్రీడా పోటీలు



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

అనివార్య కారణాలతో గత కొన్ని సంవత్సరాలుగా మండల కేంద్రములోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలకు రూ.10,000లు నిధులు మంజూరు చేయడం, అలాగే క్రీడా పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు స్థానిక సర్పంచ్ మెస్సు కోటేశ్వరరావు, సెక్రటరీ ఆర్.ప్రవీణ్ కుమార్ అందిస్తామని ముందుకు రావడంతో సోమవారం పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు ప్రారంభించామని ప్రధానోపాధ్యాయుడు భూక్యా వీరన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ క్రీడా పోటీలు పిల్లలకు రెండు రోజుల పాటు మానసిక, శారీరకంగా నూతన ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయని, వారిలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీస్తాయని అన్నారు. దాంతో పాటు పాఠశాల విద్యార్థుల్లో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని చెప్పారు. పాఠశాలకు వచ్చిన నిధుల నుంచి వాలీబాల్ కిట్, షెటిల్, టెన్నికాయిట్, క్యారమ్స్, చెస్, తదితర గేమ్స్ మెటీరియల్స్ తీసుకున్నామని, ఈ గేమ్‌లతో పాటు విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, క్విజ్, వ్యాస రచన పోటీలు, రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్, తదితర పోటీలు సైతం నిర్వహిస్తామని తెలిపారు. జనవరి 26 సందర్భంగా పాఠశాలలో పిల్లలకు స్పోర్ట్స్, గేమ్స్ పునఃప్రారంభం అయ్యేందుకు చొరవ తీసుకుని సహకరించిన సర్పంచ్, సెక్రటరీలకు పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్లు చిరంజీవి, ప్రభాకర్, రాంబాబు, శ్రీనివాస్, యమున, జీ.పీ. సిబ్బంది మల్కపురి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలి

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

నవతెలంగాణ-పాల్వంచ

దళిత బంధు పథకం అమలులో జరిగిన లబ్ధిదారుల ఎంపికలో అనేక అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని వాటిపై వెంటనే ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని, అదేవిధంగా ఇటీవల లక్ష్మీదేవిపల్లి మండలంలో లబ్ధిదారుల ట్రాక్టర్ ట్రాలీ బలవంతంగా గుంజుకెళ్ళిన అధికార పార్టీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ క్రిమినల్ కేసు నమోదు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ శ్రేణులతో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపిన అనంతరం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలో దళిత బంధు పథకం ప్రజా ప్రతినిధులకు కమిషన్‌ల కోసమే ఉపయోగపడుతుందని, అధికార పార్టీ నాయకులు అమాయక ప్రజల నుండి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో జరిగిన ఘటన మాత్రమే వెలుగులోకి వచ్చిందని ఇంకా బయటకు రాని సంఘటనలు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ గంధం మల్లికార్జున్ రావు, అసెంబ్లీ మహిళా కన్వీనర్ కోలా మల్లికా, కేతిని కుమారి, బిమిశెట్టి విజయ, ఏడెల్లి మర్థమ్మ, కొడాలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముత్యాన్ని డైరెక్టరేట్‌కు సరెండర్

నవతెలంగాణ-పాల్వంచ

విధుల నిర్వహణల్లో నిర్లక్ష్యం కారణంగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముత్యాన్ని డైరెక్టరేట్‌కు సరెండర్ చేసినట్టు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. సరెండర్ చేసిన ముత్యం స్థానంలో పూర్తి అదనపు బాధ్యతలు మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సంజీవరావు అప్పగిస్తూ బాధ్యతలు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు.

మండలంలో వేర్వేరుగా రేగా, పొంగులేటి పర్యటనలు

నవతెలంగాణ-ములకలపల్లి

ములకలపల్లి మండలంలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు సోమవారం వేర్వేరుగా పర్యటించారు. తొలుత ప్రభుత్వ విప్ రేగా మాధారంలోని టీబీజీకేఎస్ మణుగూరు బ్రాంచి ఉపాధ్యక్షుడు ఊకంటి ప్రభాకరావు నూతన గృహప్రవేశానికి హాజరై అక్కడ ఊకంటి ఆతిథ్యం స్వీకరించారు. అనంతరం ములకలపల్లిలో బిక్కుమళ్ల సుధాకర్ తండ్రి దశదిన కర్మకు హాజరై ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ పార్టీ కోసం అందరూ ఐకమత్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, ఎంపీపీ మల్ల నాగమణి, శెనగపాటి సీతారాములు, పుష్పాల చందర్రావు, పువ్వాళ్ల మంగపతి, బండి కొమురయ్య, పుష్పాల సాయి తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లిలో పర్యటించిన మాజీ ఎంపీ పొంగులేటి

మండలంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం పర్యటించారు. ఆయన తొలుత మాధారంలోని టీబీజీకేఎస్ నాయకుడు ఊకంటి ప్రభాకర్రావు నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై దంపతులకు కొత్త బట్టలు పెట్టారు. అదేవిధంగా గుట్టగూడెంలో దేవాలయ అభివృద్ధికి ఆలయకమిటీ నిర్వాహకులకు రూ.20వేలు వితరణ అందజేశారు. అదేవిధంగా ములకలపల్లిలో బిక్కుమళ్ల సుధాకర్ తండ్రి దశదినకర్మకు హాజరై కుటుంబసభ్యులను పొంగులేటి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి, నాగళ్ళ వెంకటేశ్వరరావు తిరుపతిరెడ్డి మేకల వెంకన్న, సురభి రాజేష్, శెగనపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పట్టాదారు పాస్ పుస్తకాలు రద్దు చేయాలి

ప్రజావాణిలో కలెక్టర్‌కు ఆదివాసీ జేఏసీ నాయకుల వినతి

నవతెలంగాణ-ములకలపల్లి

ములకలపల్లి మండలం పూసుగూడెంలో 241 సర్వేలోని ప్రభుత్వ భూమిలో 1940 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వ భూమిగా నమోదు అయి ఉందని, ములకలపల్లి తహశీల్దార్ సిబ్బందితో కుమ్మక్కై పోడుగాని ప్రభుత్వ భూమిని పోడు అయినట్లు తప్పుడు నెంబర్లు సృష్టించి 1954 నుంచి వారసత్వ భూమి అని తప్పుడు పట్టాలు పొందారని, కానీ వారు చూపించే నెంబర్లు ధరణి వెబ్సైట్లో చూపించే నెంబర్లు వేరుగా ఉన్నాయని, ఆ భూమి 1/70 చట్టం పరిధిలో ఉందని, ప్రభుత్వ భూమిలో గిరిజనేతరులు పట్టాలు పొందే హక్కు ఏ చట్టంలేదని తక్షణమే వారికి ఇచ్చిన పట్టాదారు పాస్ పుస్తకాలను సెక్షన్-8 ప్రకారం వెంటనే రద్దుచేయాలని సోమవారం కలెక్టరేట్లోని ప్రజావాణిలో కలెక్టర్ అనుదీప్‌ను రాష్ట్ర ఆదివాసీ జేఏసీ నాయకులు ఉకే ముక్తేశ్వరరావు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ప్రభుత్వ భూమికి సంబంధించిన వివరాలను ఆ వినతిలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బాడిశ భిక్షం దొర, సోయం సత్యనారాయణ, పోయం చిన్నారి, ఆర్ఎం.ప్రశాంత్, కాకా పృథ్వీ, సోయం కృష్ణకుమార్, శెట్టిపల్లి రజనిబాబు, ఊకే పెద్దమ్మాయి, కోండ్రు పద్మ, కుంజా రవి, కోండ్రు శ్రీరాములు, బుల్లిబాబు, పదం నాగరాజు తదితరులు ఉన్నారు.

పాటల పూదోటలో విరబూసిన 'పద్మ'జ

ఆమెకు పాటంటే ప్రాణం.. పొద్దున లేచింది మొదలు మనసునిండా గాత్రమే.. సముద్రాన్ని వీడని కెరటంలా అనుక్షణం ఆమె గొంతు సరిగమప రాగం తీస్తూనే ఉంటుంది. ఓవైపు వృత్తి బాధ్యతలు, మరోవైపు తనకిష్టమైన గానం ఈ రెండింటికీ సమన్యాయం చేస్తోంది. ప్రభుత్వ వసతిగృహ సంక్షేమాధికారిగా చిన్నారుల భవితవ్యాన్ని మోస్తూనే తెలుగు, హిందీ పాటల్ని తన మృదువైన గొంతుతో పాడుతూ ప్రతిభను చాటుతోంది. చిన్నప్పటి నుంచే పాటలపై మక్కువ పెంచుకున్న ఆమె ఇప్పుడు సంగీత సాగరంలో విపంచి వీణలా విహరిస్తోంది. రెండేండ్లప్పుడు పాఠశాలలో పాడిన పాట ఆమెకు అమితమైన గుర్తింపు తెచ్చింది. నాలుగు దశాబ్దాలుగా అదే స్వరంతో గాన కచేరీలూ, ఆర్కెస్ట్రాలు, పలు ప్రదర్శనలు ఇస్తూ శ్రోతలను అలరిస్తోంది. పాటల పూదోటలో విరబూసిన 'పద్మ'జ పరిచయం ఈ రోజు మానవిలో...



ఎర్రోళ్ల పద్మజ... పుట్టి పెరిగింది ఉమ్మడి కరీంనగర్ జిల్లా వేములవాడ. తండ్రి ఆదినారాయణ సాహిత్యకారుడు. తల్లి ఈశ్వరమ్మ గాయని. పద్మజ ప్రాథమిక, సెకండరీ విద్య వేములవాడ, ఇంటర్ కరీంనగర్, డిగ్రీ సిద్దిపేట, బీఎడ్ చెన్నయ్‌లో చేశారు. సంగీత నేపథ్యం ఉన్న కుటుంబం గనుక ఆమెపై సహజంగానే ప్రభావం పడింది. చిన్నప్పటి నుంచే పాటల్లో రాణిస్తున్న బిడ్డను గుర్తించిన తల్లిదండ్రులు వరంగల్‌లో రాజేశ్వరి వద్ద సంగీతంలో శిక్షణ కూడా ఇప్పించారు. ఓవైపు సంగీతతో ఓనమాలు నేర్చుకుంటూనే మరోవైపు చదువును యథాతథంగా కొనసాగించారు.

ఆత్మ విశ్వాసం కోల్పోలేదు

1988లో వసతిగృహ సంక్షేమాధికారిగా ఉద్యోగంలో చేరారు. కేశవపట్నం, రామగుండం, ఎల్కతుర్తి, హుజురాబాద్, వీణవంక మండలాల్లో తనదైన శైలితో వృత్తిలో రాణించారు. విద్యార్థినులను ప్రోత్సహిస్తూ వారిని ఉన్నతంగా తీర్చి దిద్దడంలో తనదైన పాత్రను పోషించారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేలా వారికి శిక్షణ ఇప్పించారు. కలలు కన్నంత ఈజీగా జీవితం ఉండదనేది ఎంతటి చేదు నిజమో కష్టపడితే ఫలితాలు కూడా అదే స్థాయిలో అందలం ఎక్కిస్తాయనేది కూడా అంతే వాస్తవం. పద్మజ కూడా తన జీవితంలో రాణించడానికి ఎన్నో ఒడిదుడుకులు, ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. కానీ ఆమె ఎన్నడూ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. కష్టాలను కూడా చిరునవ్వుతో ఎదిరించారు. అవకాశమిస్తే మహిళలకు సాటి ఎవరూ రారని నిరూపించారు. ఓవైపు పాటలు పాడుతూనే తన వృత్తి బాధ్యతల్ని నిర్వర్తించారు. విద్యార్థుల పట్ల కనబరుస్తున్న శ్రద్ధకుగాను అప్పటి హోంమంత్రి సబితాఇంద్రారెడ్డి నుడి ప్రశంసలు అందుకున్నారు. ఉత్తమ అధికారిణిగా మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ఆవార్డు, సత్కారం పొందారు.





సమన్వయం చేసుకుంటూ...



1995లో పద్మజకు రవీందర్‌తో వివాహమైంది. వారికి గాయత్రి, కళ్యాణ్ ఇద్దరు సంతానం. పెండ్లయిన తర్వాత ఆంక్షల మధ్య తమ కిష్టమైన రంగాలను వదులుకుంటున్న మహిళలు ఎంతోమంది ఉన్నారు. సమాజంలో ఒంటరి పయనం కష్టమైన విషయం అందరికీ తెలిసిందే. తమ రంగాల్లో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భాలూ అనేకం. ఆ విషయాల్ని కూడా సందర్భోచితంగా వివిధ వేదికలపై చెప్పినవారు ఉన్నారు. కానీ పద్మజకు అలాంటి పరిస్థితి రాలేదు. భార్య ఇష్టాన్ని గమనించి భర్తనే చేదోడు వాదోడుగా ఉన్నాడు. తనది కూడా ప్రభుత్వ ఉద్యోగమే అయినప్పటికీ బాధ్యతల్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు కదిలాడు. ఒక్కమాటలో చెప్పాలంటే పాటకు ఆమె పల్లవి అయితే ఆయన చరణంలా సాగాడు. ఎక్కడ పాటల కార్యక్రమం జరిగినా దగ్గరుండి తీసుకెళ్లేవాడు. అది పద్మజకు మరింత ప్రోత్సాహం, ఉత్తేజాన్ని కలిగించాలి. ప్రదర్శనలు చిన్నవా, పెద్దవా అనే తేడా లేకుండా ఎవరు ఆహ్వానించినా వెళ్లి పాటల్లో తన ప్రత్యేకతను కనబరిచేవారు. అలా కరీంనగర్ కళాభారతిలో ప్రారంభమైన ఆమె పాటల ప్రస్థానం హైదరాబాద్ రవీంద్రభారతి వరకూ కొనసాగింది.

అవార్డులు.. ప్రశంసలు..

పద్మజకు తెలుగు, హిందీ పాటలంటే చాలా ఇష్టం. ఇప్పటి వరకు వెయ్యి వరకు ప్రదర్శనలు ఇచ్చారు. కన్నడ నుంచి తెలుగుకు డబ్బింగ్ అయిన ఐదు సినిమాలకు పాటలు పాడారు. 2006 సంవత్సరంలో రామకృష్ణ ప్రొడక్షన్ వారు పద్మజకు 'గాన కోకిల' బిరుదును ఇచ్చారు. ఓ ప్రదర్శనలో సంగీత దర్శకుడు మాధవపెద్ది సత్యం ఆమె పాటలకు పరవసించి స్వయంగా తానే స్టేజీమీద సత్కరించాడు. విజయవాడలో నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనల్లోనూ ఆమె ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు. 'ఎన్‌కౌంటర్ దయానాయక్' చిత్రంలో కొత్త సింగర్స్‌ను పరిచయం చేసేందుకు చెన్నయ్‌లో నిర్వహించిన ఆడిషన్స్‌లో పద్మజ ఎంపికయ్యారు. కానీ అనివార్య కారణాల వల్ల అందులో పాడలేకపోయారు. ఇలా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆమె ఐదు వేలకు మించి పాటలు పాడారు. ప్రతియేటా రాగ కల్చరల్ అకాడమీ కరీంనగర్ వారు నిర్వహించే పాటల కార్యక్రమంలో తనదైన ముద్ర వేస్తున్నారు. ఘంటసాల వర్ధంతి సందర్భంగా అలనాటి గీతాలపై పాడిన పాటలు ఆమెకు అద్భుతమైన పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చాయి. నిత్యం పాటలనే ఆరాధించే పద్మజ రోజురోజుకూ అందనంత ఎత్తుకు ఎదుగుతున్నారు. స్టార్‌మేకర్‌లోనూ ఆమె పాటల్ని అభిమానించేవారి సంఖ్య పెరుగుతోంది.

- హింగే రాజేశ్వర్‌రావు, ఎల్కతుర్తి

అవాంతరాలు దాటుకుని...

చేసే పనిలో ఉన్నతంగా ఎదగాలని అందరూ అనుకుంటారు. అయితే చాలామందికి చేరిన కొత్తల్లో చూపిన ఉత్సాహన్ని తర్వాత కొనసాగించలేరు. కారణాలు ఏవైనా... అవాంతరాలు దాటుకుని నాయకత్వ బాధ్యతలు తీసుకునే స్థాయికి ఎదగాలంటారు కెరియర్ నిపుణులు. అందుకోసం కొన్ని సలహాలు కూడా ఇస్తున్నారు. అవేంటో తెలుసుకుందాం...



- మొదట ఉద్యోగంలో ఉత్సాహంగానే చేరతాం. కానీ క్రమంగా ఆ ఆసక్తి సన్నగిల్లుతుంది. ఎప్పటికప్పుడు ఉత్సాహంగా ముందు కెళ్లాలంటే కొత్త విషయాలు నేర్చుకోవాలి. మీ రంగంలో అత్యున్నత హోదా ఏదో గమనించుకుని మీ లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలి. ఒక్కో మెట్టూ ఎలా ఎక్కాలో తెలుసుకుంటూ ప్రణాళికలు వేసుకుంటేనే కొత్త విషయాలు నేర్చుకోవాలన్న ఆసక్తి పెరుగుతుంది. మీదైన ప్రణాళికతో ముందుకు సాగగలుగుతారు. ఆ అడుగులే మిమ్మల్ని విజయం వైపు నడిపిస్తాయి.
- ఒక్కరోజులో ఎవరికీ విజయం వచ్చేయదు. దానికి స్వల్ప, దీర్ఘకాలిక ప్రణాళికలు ఉండాలి. వాటిని కచ్చితంగా పూర్తి చేయాలన్న పట్టుదల కావాలి. అంతేకాదు మారే పరిస్థితుల్ని అంచనా వేసుకోగల సమయస్ఫూర్తి, చొరవని అలవరుచుకోవాలి. అప్పుడు ఎవరి తోడూ అవసరం లేకుండానే ముందడుగు వేయగలరు.
- సహోద్యోగుల మధ్య పోటీ వాతావరణం ఉంటుంది. అప్పుడప్పుడూ అసూయ కూడా తొంగి చూస్తుంది. అయినంత మాత్రాన అందరినీ ప్రతికూలంగా చూడటం, చిన్న చిన్న విషయాలకు వాదులాడటం వంటివి వద్దు. ఏదయినా సమస్య ఉంటే దాన్ని వ్యక్తం చేసేటప్పుడు కాస్త సౌమ్యంగా చెప్పగలగాలి. ఎప్పుడూ అవతలివారిలో లోపాలు ఎత్తి చూపడమే కాదు... మంచినీ మెచ్చుకోండి. అప్పుడే మీ బంధం బలపడుతుంది.
- మహిళలు సవాళ్లు తీసుకునేందుకు భయపడతారనే అభిప్రాయం చాలామందికి ఉంటుంది. ఆ పరిస్థితిని అధిగమించడానికి మీరే ముందడుగు వేయండి. చొరవ తీసుకోండి. కొత్త విషయాలు తెలుసుకునేందుకు ప్రయత్నించండి. అప్పుడు మీకు పనిచేయాలనే ఉత్సాహం పెరుగుతుంది. మీ మార్గంలో మీకెదురైన సమస్యల్ని మెంటార్ సాయంతో సులువుగా అధిగమించొచ్చు.

ఇట్ల చేద్దాం



పట్టు, జరీ దుస్తుల్ని ఉతకడానికి కుంకుడు కాయలు చక్కటి ప్రత్యామ్నాయం. దీనికోసం కొన్ని కుంకుడు కాయలను చల్లటి నీటిలో నానబెట్టి వాటి రసాన్ని తీయాలి. ఈ మిశ్రమంతో పట్టు, జరీ వస్త్రాలను ఉతికితే అవి ఎక్కువ కాలం మన్నడంతో పాటు రంగు వెలిసిపోకుండా జాగ్రత్తపడచ్చు. అంటే పట్టు, ఇతర సున్నితమైన వస్త్రాల్ని మనం ఎలాగైతే షాంపూ వాష్ చేస్తామో.. ఆ షాంపూకు బదులుగా ఈ సహజసిద్ధమైన షాంపూను ఉపయోగించవచ్చు.

కావల్సినంత నీరు తాగకపోతే..?

చలికాలంలో సహజంగానే దాహం అంతగా ఉండదు. అలాగని నీరు తాగడం మానేస్తే శరీరానికి కావాల్సిన నీరు అందదు. ఫలితమే దేనిమీదా ఆసక్తి లేకపోవడం, అలసట.. కొన్నిసార్లు చర్మ, అనారోగ్య సమస్యలకు దారితీయొచ్చు. వాటన్నింటి నుంచీ తప్పించుకోవాలంటే కొన్ని చిట్కాలు ఉన్నాయి.

- ఈ కాలం బోర్ కొట్టనిది ఏదైనా ఉందంటే టీనే! వెచ్చగా తాగుతోంటే ఉత్సాహమొచ్చినట్టు అనిపిస్తుందని ఎన్ని సార్లైనా తాగేస్తుంటాం. కెఫిన్ శరీరంలోకి అధికంగా చేరినా సమస్యే! బదులుగా చామంతి టీని తాగండి. ఒళ్లు నొప్పులు, నిద్రలేమి, ఆందోళన, కడుపుబ్బరం వంటివి దూరమై చక్కని నిద్రా దరి చేరుతుంది.
- ఇంట్లో వాళ్లకి జలుబు చేసినప్పుడు పాలల్లో పసుపు వేసిస్తుంటాం. ఈ బామ్మల చిట్కా నలతగా ఉన్నప్పుడే కాదు.. రోజూ ప్రయత్నించొచ్చు. శరీరానికి వెచ్చదనాన్ని ఇవ్వడమే కాదు జలుబు లక్షణాలను దూరం చేయడం, చక్కని నిద్ర పట్టేలా చేయడంలోనూ సాయపడుతుంది. పాలు శరీరాన్ని హైడ్రేట్ చేస్తే.. పసుపు ఆరోగ్యాన్నిస్తుంది.



- శీతకాలం ఆహారం త్వరగా జీర్ణమవదు. కాబట్టి.. నీటితోపాటు పోషకాలు, ఫైబర్ వంటివీ అందేలా చూసుకోవాలి. క్యారెట్, బీట్‌రూట్, టొమాటో వంటి వెజిటబుల్ జ్యూసులు, తాజా పండ్ల రసాలకు పుదీనా, కొత్తిమీర వంటివి చేర్చి తీసుకోండి. శరీరానికే కాదు.. ముఖానికీ తేమ అందుతుంది.
- చలి గాలికి నోటికి తిండి సహించదు.. పిల్లలూ వద్దని మారాం చేస్తుంటారు. అందుకే ఓ పూట సూప్‌ని తప్పనిసరి చేయండి. జీర్ణప్రక్రియ మెరుగుపడుతుంది.

కార్పొరేట్లకు అడవులు ధారాదత్తం

(మొదటిపేజీ తరువాయి)

నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు సమన్వయ కమిటీ తీర్మానించిందని తెలిపారు.

కార్యాచరణ..

- ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి ఐదు వరకు ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలి.
- ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ లో మహాధర్నా కార్యక్రమాన్ని ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించాలి. ప్రతిపక్ష పార్టీలనాయకులు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీ,ఎంపీలను ఆహ్వానించాలి.
- ఫిబ్రవరి 6, 7 తేదీలలో మండల కేంద్రాల్లో, 13న ఐటీడీఏ, జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలి.
- ఫిబ్రవరి నెలాఖరు వరకు ప్రభుత్వం స్పందించకపోతే మార్చి మొదటి వారంలో ఏజెన్సీ సడక్ బంద్ కార్యక్రమానికి పిలుపునివ్వాలి.
- రాష్ట్రపతి,జాతీయ ట్రైబల్ కమిషన్, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ, పార్లమెంటు సభ్యులు, రాష్ట్ర శాసనసభ్యులు, ప్రత్యేకంగా ఆదివాసీ తెగల ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇవ్వాలి.

సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సమన్వయ కమిటీ కన్వీనర్ కెచ్చుల రంగారెడ్డి, సీపీఐ(ఎంఎల్)నాయకులు ప్రసాద్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కోటేశ్వరరావు, మండల వెంకన్న, గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, ఏఐకేఎంఎస్ నాయకులు తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇక పస్తులే...

(మొదటిపేజీ తరువాయి)

రేషన్ కార్డుల్లేవని, పీడీఎస్ పథకం విస్తరించటం లేదని, కొత్త కార్డులు పొందేందుకు అర్హులైన వారెంతో మంది ఉన్నారని ఆర్థిక నిపుణులు గణాంకాల్ని విడుదల చేస్తున్నారు.

జనగణన 2021లో మొదలవ్వాలి..కానీ

ఎప్పుడో 12 ఏండ్ల క్రితం (2011) చేపట్టిన జనాభా లెక్కల ప్రకారం పీడీఎస్ పథకం అమలవుతోందన్నది ప్రధాన విమర్శ. దేశ జనాభా ఇప్పుడు ఎంతో పెరిగింది. పేదలు, మధ్య తరగతి సంఖ్య గణనీయంగా ఉందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని ఆయా వర్గాల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు వస్తున్నాయి. తాజా జనాభా లెక్కలు లేకపోవటం వల్ల దాదాపు 10కోట్ల మందికి అన్యాయం జరుగుతోందని ప్రముఖ ఆర్థిక నిపుణులు జీన్ డ్రెజ్, రితికా ఖేర్ ఆరోపిస్తున్నారు. జనాభా లెక్కల ప్రక్రియ వాస్తవానికి 2021లోనే మొదల వ్వాలి. కోవిడ్-19 సంక్షోభాన్ని సాకుగా చూపి కేంద్రం వాయిదా వేసింది. జనవరి 2న దీనిపై ఒక నిర్ణయం వెలువడాలి. కానీ ఈ అంశాన్ని నానుస్తోంది. దాదాపు 2024 సార్వత్రిక ఎన్నికలు వచ్చే వరకు జన గణన-2021 చేపట్టే ఉద్దేశం మోడీ సర్కార్‌కు లేదని సంకేతాలు వెలువడ్డాయి.

యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ సమ్మె నోటీసు

- ఉన్నత విద్యామండలి చైర్మెన్‌కు అందచేసిన జేఏసీ నేతలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరేషన్ చేయడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్ లింబాంద్రికి సమ్మె నోటీసు ఇచ్చింది. అయనతోపాటు ఆయా యూనివర్సిటీల రిజిస్ట్రార్లకు కూడా సమ్మె నోటీసులు ఇచ్చామని జేఏసీ చైర్మెన్ డాక్టర్ ఎమ్ రామేశ్వరరావు, కన్వీనర్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోధ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులందరికీ 30 శాతం వేతనాలు పెంచిందనీ, యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల వేతనాలు మాత్రం పెంచలేదన్నారు. అలాగే సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి మొదటి వారంలోగా తమ డిమాండ్లను పరిష్కరించకుంటే 11 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు అందరూ సమ్మెకు దిగుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విశ్వవిద్యాలయాలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపక సంఘాల నాయకులు డాక్టర్ మంజు, హరీష్, జితేందర్, శ్రీనివాస్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసవాలు ఆందోళనకరం

- కొన్ని ఉత్తర భారత రాష్ట్రాలు, ఈశాన్యంలో ఇంటి వద్ద డెలివరీలు
- వీటిలో అధికం బీజేపీ పాలిత రాష్ట్రాలే
- జాతీయ సగటు కంటే అధికం : కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సమాచారం

న్యూఢిల్లీ : దేశంలో ప్రసవాలు కొన్ని రాష్ట్రాల్లో సాఫీగా ఉంటే.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాత్రం ఆందోళనకరంగా మారాయి. దేశవ్యాప్తంగా 2021-22 ఏడాదికి గానూ అనేక రాష్ట్రాల్లో సంస్థాగత ప్రసవాలు (ఆస్పత్రులలో జరిగే డెలివరీలు-ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీలు) పెరుగుదలను నమోదు చేశాయి. కానీ, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాత్రం ఈ పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఈశాన్యంతో పాటు ఉత్తర భారత రాష్ట్రాలైన యూపీ, ఉత్తరాఖండ్, ఢిల్లీలో ఇప్పటికీ ఇంటి వద్ద ప్రసవాలు జరుగుతున్నాయి. ఈ సంఖ్య జాతీయ సగటు కంటే ఎక్కువగానే ఉండటం గమనార్హం. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సమాచారంలో ఈ విషయం వెల్లడైంది. దీనిపై ఆరోగ్య నిపుణులు సైతం ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ సమాచారం ప్రకారం.. తెలంగాణ, తమిళనాడు, గోవాలతో పాటు రెండు కేంద్రపాలిత ప్రాంతాలు పుదుచ్చేరి, లక్షద్వీప్ లు వంద శాతం సంస్థాగత డెలివరీలను నమోదు చేశాయి. కేరళ, ఆంధ్రప్రదేశ్, సిక్కిం, పంజాబ్‌తో సహ తొమ్మిది రాష్ట్రాలలో జననాలు ఆస్పత్రుల్లోనే నమోదయ్యాయి. సంస్థాగత డెలివరీలలో జాతీయ సగటు 95.5 శాతంగా ఉన్నది. ఇక మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, బీహార్, ఉత్తరాఖండ్, మిజోరాం, అసోం, ఉత్తరప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, త్రిపుర, జమ్మూకాశ్మీర్, ఢిల్లీ వంటి 13 రాష్ట్రాలలో ఇంటి వద్ద జరిగే ప్రసవాలు జాతీయ సగటు కంటే ఎక్కువగా నమోదు చేయడం ఆందోళనను కలిగిస్తున్నది. వీటిలో చాలా వరకూ బీజేపీ పాలిత రాష్ట్రాలే కావడం గమనార్హం. ఇంటి వద్ద జరిగే ప్రసవాల జాతీయ సగటు 4.5 శాతంగా ఉన్నది.ఇంటి వద్ద జరిగే ప్రసవాలు అత్యధికంగా మేఘాలయలో 42.8 శాతంగా ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో నాగాలాండ్ (21.7 శాతం), మణిపూర్ (19.4 శాతం), బీహార్ (13.3 శాతం), ఉత్తరాఖండ్ (11.5 శాతం), మిజోరాం (12.8 శాతం), అసోం (8.7 శాతం), హిమాచల్‌ప్రదేశ్ (7.3 శాతం), త్రిపుర (5.4 శాతం), జమ్మూకాశ్మీర్ (5.1 శాతం), ఢిల్లీ (4.7 శాతం) లు ఉన్నాయి. 2020-21 ఏడాదికి గానూ భారత్‌లో మొత్తం 10,67,470 ప్రసవాలు ఇండ్ల వద్ద జరిగాయి. 2021-22 ఏడాదిలో అది 9,22,637గా ఉన్నది. ప్రసూతి మరణాల నిష్పత్తి (ఎంఎంఆర్)ను తగ్గించడానికి సంస్థాగత ప్రసవాలు కీలకమని నిపుణులు చెప్పారు. అయితే, మారుమూల ప్రాంతాల్లో ఇప్పటికీ ఆస్పత్రి సదుపాయాలు లేకపోవడం కారణంగా ఇంటి వద్ద ప్రసవాలు ఇంకా జరుగుతున్నాయని తెలిపారు.బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వైద్య రంగం పేలవంగా ఉన్నదనడానికి సాక్షాత్తూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెలువరించిన సమాచారమే ప్రత్యక్ష నిదర్శనమని సామాజికవేత్తలు, నిపుణులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులపై వారు ఆందోళనను వ్యక్తం చేశారు. సంస్థాగత డెలివరీలను పెంచి ప్రసూతి మరణాలను నియంత్రించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వారు కోరారు.



ఉపాధ్యాయులపదోన్నతులు, బదిలీల షెడ్యూల్ విడుదల

(మొదటిపేజీ తరువాయి)

గురువారం రాత్రి జీఏడీ జీవోను విడుదల చేసింది. జనవరి 28 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. మార్చి 4 నాటికి అంటే 37 రోజుల్లో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ముగియనుంది. మార్చి 5 నుంచి 19వ తేదీ వరకు అప్పీళ్లకు అవకాశం కల్పించనున్నారు. టీచర్ల నుంచి దరఖాస్తులు అందిన 15 రోజుల్లో అప్పీళ్లను పరిష్కరించనున్నారు. టీచర్ల పదోన్నతులు, బదిలీలపై ఈనెల 15న ఉపాధ్యాయ సంఘాలు, జేఏసీల సమక్షంలో మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి సమగ్రంగా చర్చించిన విషయం తెలిసిందే. చర్చలు ఫలప్రదం కాగా, తాజాగా సీఎం కేసీఆర్ మార్గదర్శనం, ఆమోదం మేరకు పదోన్నతులు, బదిలీల ప్రక్రియకు ముహూర్తం ఖరారైంది.

ఉపాధ్యాయుల బదిలీలు - పదోన్నతుల షెడ్యూల్ ఇదే...

జనవరి 27 నుండి మార్చి 4 వరకు కొనసాగింపు.

వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు, మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతులు.

ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న బదిలీలు, పదోన్నతుల కల్పనకు ఎట్టకేలకు కాలపట్టిక విడదలైంది. ఈ జాతర ఈనెల 27 నుండి మార్చి 4 వరకు కొనసాగుతుంది.

జనవరి 27న అన్ని క్యాటగిరీ ఖాళీలు, ప్రధానోపాధ్యాయుల పదోన్నతికి అర్హులైన స్కూల్ అసిస్టెంట్స్ సీనియారిటీ జాబితాలు ఆన్లైన్ లో ప్రకటిస్తారు.

జనవరి 28 నుండి 30 వరకు బదిలీ దరఖాస్తులు ఆన్లైన్ లో స్వీకరిస్తారు.

దరఖాస్తు హార్డ్ కాపీలను హైస్కూల్ ఉపాధ్యాయులు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు, ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులు సంబంధిత ఎంఈఓలకు, మండల పరిషత్ పిఎస్,యుపిఎస్ ఉపాధ్యాయులు సంబంధిత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డిఈఓకు జనవరి 31 నుండి ఫిబ్రవరి 2 లోపు సమర్పించాలి.

దరఖాస్తుల హార్డ్ కాపీలను సంబంధిత ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు డిఈఓ కార్యాలయంలో సమర్పించడం, పరిశీలన, ఆన్లైన్ లో ఆమోదించటం ఫిబ్రవరి 3 నుండి 6 వరకు

ఫిబ్రవరి 7న డిఈఓ/ ఆర్జేడీ వెబ్ సైట్లలో బదిలీ పాయింట్లతో ప్రొవిజనల్ సీనియారిటీ జాబితాలు మరియు పదోన్నతుల సీనియారిటీ జాబితాల ప్రకటన

ఫిబ్రవరి 8 నుండి 10 వరకు మూడు రోజులు అభ్యంతరాల స్వీకరణ పరిశీలన, పరిష్కారం.

తుది సీనియారిటీ జాబితాల ప్రకటన మరియు ప్రధానోపాధ్యాయులు బదిలీలకు వెబ్ ఆప్షన్ల నమోదు ఫిబ్రవరి 11,12 తేదీలు.

మల్టీ జోనల్ స్థాయిలో ప్రధానోపాధ్యాయులు వెబ్ ఆప్షన్ల ఎడిటింగ్, పున్ణ పరిశీలన ఫిబ్రవరి 13.

ఫిబ్రవరి 14న ఆర్జేడీలచే ప్రధానోపాధ్యాయుల బదిలీ ఉత్తర్వుల విడుదల.

ఫిబ్రవరి 15న బదిలీల అనంతరం మిగిలిన ఖాళీల ప్రకటన.

ఫిబ్రవరి 16,17,18 తేదీల్లో అర్హత గలిగిన స్కూల్ అసిస్టెంట్స్ కు ప్రభుత్వ జిల్లా పరిషత్ యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పదోన్నతుల కౌన్సెలింగ్.

ఫిబ్రవరి 19, 20 తేదీల్లో సబ్జెక్ట్ వారీగా స్కూల్ అసిస్టెంట్స్ ఖాళీల ప్రకటన మరియు బదిలీ ఆప్షన్స్ నమోదు.

ఫిబ్రవరి 21 న ఆప్షన్ల సవరణ, పున్ణపరిశీలనకు అవకాశం

ఫిబ్రవరి 22,23 తేదీల్లో డిఈఓలచే స్కూల్ అసిస్టెంట్స్ బదిలీ ఉత్తర్వులు విడుదల.

ఫిబ్రవరి 24 న స్కూల్ అసిస్టెంట్స్ బదిలీల అనంతరం ఏర్పడిన ఖాళీల ప్రకటన

ఫిబ్రవరి 25,26,27 తేదీల్లో ఎస్జీటీ తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులకు కోర్టు కేసులు లేని సబ్జెక్టులకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు.

ఫిబ్రవరి 28, మార్చి 1,2 తేదీల్లో ఎస్జీటీ తత్సమాన పోస్టుల ఖాళీల ప్రకటన మరియు వెబ్ ఆప్షన్స్ నమోదు.

మార్చి 3న ఆప్షన్ల సవరణ, పున్ణ పరిశీలన

మార్చి 4న ఎస్జీటీ తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు విడుదల.

మార్చి 5 నుండి 19 వరకు డిఈఓ ఇచ్చిన బదిలీ ఉత్తర్వులపై అప్పీల్స్, అభ్యంతరాలను ఆర్జేడీకి, ఆర్జేడీ ఉత్తర్వులపై అప్పీల్స్/ అభ్యంతరాలను డియస్ఈ కి పంపుకోవాలి. సంబంధిత అధికారులు 15 రోజుల్లో వాటిని పరిష్కరించాలి.

కర్నాటక హిజాబ్ బ్యాన్

- సుప్రీం త్రిసభ్య ధర్మాసనం ఏర్పాటు

న్యూఢిల్లీ : కర్నాటక హిజాబ్ నిషేధం కేసు విచారణ సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనానికి అప్పగిస్తూ భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ ఆదేశాలు జారీచేశారు. హిజాబ్ వివాదంపై దాఖలైన తాజా పిటిషన్ల విచారణ త్రిసభ్య ధర్మాసనానికి ఆయన కేటాయించారు. విద్యా సంస్థల్లో హిజాబ్ ధరించటం తమ హక్కుగా పేర్కొంటూ కర్నాటకకు చెందిన కొంతమంది విద్యార్థులు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. దీనిపై సోమవారం విచారణ జరిపిన సీజేఐ పై ఉత్తర్వులు జారీచేశారు. హిజాబ్ కేసు పూర్వాపరాలు సీజేఐ ముంగిట పిటిషనర్ల తరపు న్యాయవాది మీనాక్షి అరోరా ప్రస్తావించారు. విద్యా సంస్థల్లో హిజాబ్ ధరించటాన్ని నిషేధిస్తూ కర్నాటక ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వగా, దీనిపై విచారణ చేసిన ఆ రాష్ట్ర హైకోర్టు..ప్రభుత్వ ఉత్తర్వులను ఆమోదించింది. దీంతో హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పదుల సంఖ్యలో పిటిషన్లు దాఖలయ్యాయి. గత ఏడాది అక్టోబర్‌లో జస్టిస్ హేమంత్ గుప్తా, సుధాంశుధూలియా నేతృత్వంలోని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం పిటిషన్లపై విచారణ జరిపింది. హైకోర్టు ఉత్తర్వులను జస్టిస్ గుప్తా సమర్థించగా, జస్టిస్ సుధాంశుధూలియా తిరస్కరించారు. కర్నాటక ప్రభుత్వ ఉత్తర్వులు వివాదాస్పదమని తేల్చారు. హిజాబ్ ధరించట ఒమా? లేదా? అన్నది వారి వ్యక్తిగతమైన హక్కుగా పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు 1:1గా రావటంతో ఈ కేసులో హైకోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్నాయి. రిట్ పిటిషన్లు దాఖలుకావటంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముందుకు వచ్చింది. తాజాగా ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లను విచారణ జరపటానికి ముగ్గురు సభ్యుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

మతోన్మాద మూకదాడులపై ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.జయరాజు, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.మాణిక్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజయ్య, డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మి తదితరులు మాట్లాడారు. భావ ప్రకటన స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు దానిని కాపాడుకోవడం పౌరులందరి బాధ్యత అన్నారు.మతోన్మాద మూకల దాడులను అరికట్టాలని నిరసిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తూ భావ ప్రకటన స్వేచ్ఛ, రాజ్యాంగాన్ని కాపాడుకుందామని స్వేచ్ఛ జేఏసీ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లాలో మానవహారంగా ఏర్పడ్డారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.మహిపాల్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ప్రజాస్వామ్యవాదులపై భౌతికదాడులు, అక్రమ అరెస్టులను ఖండించాలని ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లేశం, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మహేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీచర్లు, అంబేద్కర్‌వాదులు, భౌతికవాదులు, ప్రజాస్వామ్యవాదులు, నాస్తికులు, హేతువాదులపై మతోన్మాద మూకదాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిజామాబాద్‌లో టీచర్ మల్లికార్జున్‌పై ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకులు దాడి చేయడం దారుణమన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, ఈ కార్యక్రమం నేపథ్యంలో పలువురు ప్రజా సంఘాల నాయకులను ఉదయాన్నే పోలీసులు అరెస్టు చేశారు.కరీంనగర్ పట్టణంలోని స్థానిక తెలంగాణ చౌక్ వద్ద స్వేచ్ఛ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ మానవహారాన్ని నిర్వహించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ అధికారంలోకొచ్చాక మతోన్మాదం పెట్రేగిపోతుందన్నారు. మతాలను కించపరిచే వారిపై చట్టప్రకారం శిక్షించాలిగాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని భౌతిక దాడులు చేయడం ఏంటని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే పోలీసులు ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. కేంద్రంలోని నియంత పాలనను ప్రశ్నిస్తున్న వరవరరావు, ప్రొఫెసర్ సాయిబాబాపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు.

విచారణ కమిటీ చీఫ్ మేరీకోమ్

భారత రెజ్లింగ్ సమాఖ్య పర్యవేక్షణ బాధ్యతలు సైతం



న్యూఢిల్లీ : భారత క్రీడా రంగంలో పెను సంచలనం సృష్టించిన రెజ్లర్ల ఆందోళన వ్యవహారంలో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ ఎదుర్కొంటున్న ఆరోపణలపై విచారణ కమిటీకి భారత బాక్సింగ్ దిగ్గజం, మాజీ ఎంపీ ఎంసీ మేరీకోమ్ సారథ్యం వహించనున్నారు. భారత రెజ్లింగ్ సమాఖ్య పనితీరు, అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై ఆరోపణలను ఈ కమిటీ విచారణ చేయనుంది. విచారణ సందర్భంగా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు సహా ఆఫీస్ బేరర్లు అందరూ తాత్కాలికంగా పదవి నుంచి తప్పించబడ్డారు. ఈ కమిటీ విచారణ నివేదికను నాలుగు వారాల్లో క్రీడామంత్రిత్వ శాఖకు అందజేయనుంది. విచారణ, పర్యవేక్షణ కమిటీకి ఎంసీ మేరీకోమ్ ఛైర్‌పర్సన్‌గా ఉండనుండగా, ఒలింపిక్ మెడలిస్ట్ యోగేశ్వర్ దత్, మాజీ షట్లర్, మిషన్ ఒలింపిక్ సెల్ కమిటీ సభ్యులు త్రుప్తి ముర్గుందె, టాప్స్ మాజీ సీఈవో రాజగోపాలన్, సాయ్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధిక శ్రీమాన్ విచారణ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు.

లైంగిక వేధింపులు, ఆర్థిక అవకతవకలు సహా పలు అంశాలపై డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై చట్టపర చర్యలు తీసుకోవాంటూ భారత స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫోగల్, సాక్షి మాలిక్, అన్షు మాలిక్, రవి దహియా, బజరంగ్ పూనియా, దీపక్ పూనియా సహా రెజ్లింగ్ క్రీడాకారులు మూడు రోజుల పాటు న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే.

రెజ్లర్ల మూడు రోజు ఆందోళనకు దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను డబ్ల్యూఎఫ్ఐ బాధ్యతల నుంచి తప్పించి ఆరోపణలపై విచారణకు ఆరుగురు సభ్యులతో కూడిన విచారణ, పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేసింది. డబ్ల్యూఎఫ్ఐ విచారణకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) సైతం విచారణ కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.



రేసులో ఐపీఎల్ ఫ్రాంచైజీలు

● మహిళల ఐపీఎల్ ఫ్రాంచైజీల వేలం



ముంబయి : మహిళల ఇండియన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఐపీఎల్) ఫ్రాంచైజీలను దక్కించుకునే రేసులో ఐపీఎల్ ఫ్రాంచైజీలు ముందంజలో నిలిచాయి!. 2023 మహిళల ఐపీఎల్ సీజన్‌కు బీసీసీఐ రంగం సిద్ధం చేస్తుండగా.. ఫ్రాంచైజీల వేలానికి జనవరి 23 నుంచి అసలు ప్రక్రియ మొదలైంది. సోమవారం రోజు ఐటీటీ కొనుగోలు చేసిన సంస్థలు టెక్నికల్ బిడ్లు దాఖలు చేశాయి. బుధవారం (జనవరి 25) ఫైనాన్షియల్ బిడ్లను ప్రకటించనున్నారు. గుజరాత్ టైటాన్స్ యాజమాన్యం సీవీసీ క్యాపిటల్స్ అనుభవం దృష్ట్యా మహిళల ఐపీఎల్‌కు టెక్నికల్, ఫైనాన్షియల్ బిడ్లను వేర్వేరు రోజుల్లో నిర్వహిస్తున్నారు.

మహిళల ఐపీఎల్‌లో ఐదు ఫ్రాంచైజీల కోసం గట్టి పోటీ కనిపిస్తోంది. ఐపీఎల్ జట్లు ముంబయి ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, కోల్‌కత నైట్‌రైడర్స్, ఢిల్లీ క్యాపిల్స్, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ యాజమాన్యాలు మహిళల ఐపీఎల్ జట్లను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇవి కాకుండా.. శ్రీరామ్ గ్రూప్, నీల్‌గిరి గ్రూప్, ఏడబ్ల్యూ కొటారి గ్రూప్, ఏపీఎల్ అపోలో, హల్దీరామ్, చెట్టినాడ్ సిమెంట్, జెకె సిమెంట్, కాప్రి గ్లోబల్, ది నామన్ గ్రూప్, ఉదయ్ కొటక్ గ్రూపులు మహిళల ఐపీఎల్ ఫ్రాంచైజీలను కొనుగోలు చేసేందుకు వేలంలో పోటీపడనున్నాయి. చెన్నై సూపర్‌కింగ్స్, గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్‌జెయింట్స్ వంటి మెగా ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఆశ్చర్యకంగా మహిళల ఐపీఎల్‌కు దూరంగా ఉన్నాయి.

ఇక్కడైనా మెరుస్తారా?

బరిలో లక్ష్యసేన్, సైనా నెహ్వాల్
నేటి నుంచి ఇండోనేసియా ఓపెన్



జకర్తా : కొత్త ఏడాదిని భారత షట్లర్లు నిరాశగా మొదలెట్టారు. ఇండియా ఓపెన్‌లో భారత టైటిల్ వేటకు క్వార్టర్‌ఫైనల్స్‌కు ముందే తెరపడింది. సింధు, సైనా, లక్ష్యసేన్, శ్రీకాంత్‌లు నిరాశపరిచారు. పి.వి సింధు ఈ వారం విశ్రాంతి తీసుకోగా.. సాత్విక్, చిరాగ్ జోడీ గాయం బారిన పడ్డారు. లక్ష్యసేన్, సైనా నెహ్వాల్ సహ యువ షట్లర్లు అందరూ ఇండోనేషియా ఓపెన్ బరిలో నిలిచారు. మంగళవారం నుంచి ఇండోనేషియా ఓపెన్ ఆరంభం కానుండగా, భారత షట్లర్లకు కాస్త కఠిన డ్రా ఎదురైంది. మెన్స్ సింగిల్స్‌లో లక్ష్యసేన్ తొలి రౌండ్లో జపాన్ షట్లర్ కొడాయ్ నరోకతో తలపడనున్నాడు. మలేషియా ఓపెన్ ఫైనల్స్‌కు చేరిన కొడాయ్ ప్రస్తుతం సంచలన ఫామ్‌లో ఉన్నాడు. ఎనిమిదో సీడ్ హెచ్.ఎస్ ప్రణయ్ ఆరంభ మ్యాచ్‌లో జపాన్ షట్లర్ కెంటా సునేమియాతో పోటీపడనున్నాడు. మలేషియా ఓపెన్ క్వార్టర్స్‌కు చేరిన ప్రణయ్ మరోసారి మెరుపు ప్రదర్శనపై కన్నేశాడు. మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ అగ్ర షట్లర్ విక్టర్ అక్సెల్సెన్‌తో ఢీకొట్టనున్నాడు. మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ మంచి ప్రదర్శన ఆశిస్తోంది. ఇండియా ఓపెన్‌లో ఆకట్టుకున్న సైనా.. జకర్తాలో తొలి మ్యాచ్‌లో చైనీస్ తైపీ షట్లర్‌తో ఆడనుంది. ఇండోనేషియా స్టార్ రచనోక్ ఇంటనాన్‌తో యువ షట్లర్ మాళవిక బాన్సోద్ అమీతుమీ తేల్చుకోనుంది.

క్లీన్‌స్వీప్‌పై కన్నేసి..

● కివీస్‌తో భారత్ మూడో వన్డే నేడు
● ఊరట విజయం వేటలో న్యూజిలాండ్

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



స్వదేశీ సీజన్‌లో టీమ్ ఇండియా వరుసగా రెండో క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. శ్రీలంకను 3-0తో చిత్తు చేసిన భారత్.. తాజాగా న్యూజిలాండ్‌పై 3-0 సిరీస్ విజయం లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్‌లో గిల్ ద్వి శతక గర్జన, రాయ్‌పూర్‌లో షమి విజృంభణతో సిరీస్ సొంతం చేసుకున్న భారత్ నేడు ఇండోర్‌లో ఇరగదీసేందుకు సిద్ధమవుతోంది. కివీస్ ఊరట విజయం వేటలో ఉండగా, భారత్ క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. భారత్, న్యూజిలాండ్ చివరి వన్డే పోరు నేడు.

నవతెలంగాణ-ఇండోర్

సొంతగడ్డపై టీమ్ ఇండియా జైత్ర యాత్రలో మరో క్లీన్‌స్వీప్ ఎదురుచూస్తోంది. 2009 నుంచి స్వదేశంలో ద్వైపాక్షిక వన్డేల్లో టీమ్ ఇండియాకు తిరుగులేని రికార్డుంది. 27 సిరీస్‌ల్లో ఏకంగా 23 సిరీస్‌లను గెల్చుకున్న భారత్.. 72 ద్వైపాక్షిక వన్డేల్లో గెలుపొందింది, కేవలం 28 వన్డేల్లోనే ప్రత్యర్థికి తలొగ్గింది. ఇటీవల శ్రీలంకపై 3-0తో వన్డే సిరీస్ సాధించిన భారత్.. వరుసగా రెండో క్లీన్‌స్వీప్ కోసం ఉవ్విళ్లూరుతోంది. 2-0తో వన్డే సిరీస్ ఇప్పటికే భారత్ సొంత కాగా.. నామమాత్రపు చివరి వన్డేలో నేడు భారత్, న్యూజిలాండ్ మరో థ్రిల్లర్‌కు సిద్ధమయ్యాయి. భారత్ క్లీన్‌స్వీప్ చేస్తుందా? న్యూజిలాండ్ ఊరట విజయం సాధిస్తుందా? చూడాలి.

జోరుమీదున్న భారత్ : ఐసీసీ నం.1 వన్డే జట్టు న్యూజిలాండ్‌తో భారత్ ఉత్కంఠ మ్యాచ్‌లను అంచనా వేసింది. అందుకు తగినట్టుగానే హైదరాబాద్‌లో హోరాహోరీ కనిపించింది. కానీ రాయ్‌పూర్‌లో భారత్ ఏకపక్ష విజయం నమోదు చేసి కివీస్ ఆటగాళ్ల ఆత్మవిశ్వాసంపై దెబ్బకొట్టింది. హైదరాబాద్‌లో నిరాశపరిచిన బౌలర్లు.. రాయ్‌పూర్‌లో కండ్లుచెదిరే ప్రదర్శన చేశారు. కొంతకాలంగా పేలవంగా రాణిస్తున్న సీనియర్ పేసర్ మహ్మద్ షమి.. రెండో వన్డేలో అసమానంగా మెరిశాడు. హార్దిక్ పాండ్య, శార్దుల్ ఠాకూర్‌లకు తోడు వాషింగ్టన్ సుందర్ సైతం రాణించాడు. పరిపూర్ణ బౌలింగ్ విజయం సాధించిన భారత్.. నామమాత్రపు మ్యాచ్‌లో బెంచ్ ఆటగాళ్లకు అవకాశం ఇస్తుందా? ఆసక్తికరం. కె.ఎస్ భరత్, రజత్ పటీదార్ చాన్స్ కోసం ఎదురుచూస్తున్నారు. వన్డే వరల్డ్‌కప్ ఏడాదిలో ప్రయోగాలకు వెళ్లకుండా ప్రథమ ప్రాధాన్య జట్టుతోనే ఆడేందుకు రోహిత్ సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. బౌలింగ్ విభాగంలో అంతా సర్దుకున్నప్పటికీ.. బ్యాట్‌తో భారత్ పూర్తి స్థాయిలో మెరవాల్సి ఉంది. విరాట్ కోహ్లి రెండు వన్డేల్లో నిరాశపరిచాడు. శ్రీలంకపై రెండు శతకాలు బాదిన కోహ్లి.. ఇండోర్‌లో మెగా ఇన్నింగ్స్ బాకీ పడ్డాడు. కెప్టెన్ రోహిత్ శర్మ రాయ్‌పూర్‌లో మెరిసినా వికెట్ కాపాడుకోలేదు. శుభ్‌మన్ గిల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. అతడిని ఆపేందుకు న్యూజిలాండ్ దగ్గర ఎటువంటి ప్రణాళికలు ఉన్నట్టు కనిపించటం లేదు. సూర్యకుమార్ యాదవ్ వన్డే ఫార్మాట్‌లో తన మార్క్ చూపించాలని ఆరాటపడుతున్నాడు. ఇషాన్ కిషన్ ద్వి శతకం తర్వాత గుర్తుంచుకోదగిన ఇన్నింగ్స్ ఆడలేదు. నేడు ఇండోర్‌లో సూర్య, కిషన్, రోహిత్ మెరవాలని భారత్ ఆశిస్తోంది.

ఊరట వేట : అగ్రజట్టుగా భారత్‌కు వచ్చిన న్యూజిలాండ్.. విలియమ్సన్, సౌథీ, బౌల్ట్ సేవలు కోల్పోయి అండర్‌డాగ్‌గానే సిరీస్‌ను ఆరంభించింది. కీలక ఆటగాళ్ల దూరం కావటం ఆ జట్టుపై ప్రతికూల ప్రభావం చూపించింది. అటు బంతితో, ఇటు బ్యాట్‌తో కివీస్‌కు నాయకత్వం వహించే ఆటగాళ్లు కరువయ్యారు. టాప్ ఆర్డర్ రెండు వన్డేల్లోనూ చేతులెత్తేయగా.. బౌలర్లు సైతం రెండు మ్యాచుల్లో అంచనాలను అందుకోలేదు. కెప్టెన్ టామ్ లేథమ్, బ్రాస్‌వెల్, శాంట్నర్ మినహా బ్యాట్‌తో మరోకరు రాణించలేదు. నేడు చివరి మ్యాచ్‌లోనైనా టాప్ ఆర్డర్ నుంచి పరుగులు వస్తాయా?. గతంలో భారత్ పేస్, స్పిన్‌తో ఇరకాటంలో పడేసిన న్యూజిలాండ్.. ఈ పర్యటనలో తేలిపోయింది. 2016, 2017 వన్డే సిరీస్‌లు నిర్ణయాత్మక మ్యాచ్‌కు వెళ్లగా.. ఈసారి భారత్ ఆధిపత్యంతో ఏకపక్షంగా సాగింది. టీ20 సిరీస్‌కు ముందు ఊరట విజయంతో విలువైన ఆత్మవిశ్వాసం సాధిస్తారేమో చూడాలి.

పిచ్, వాతావరణం : ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం భారత్‌కు కంచుకోట. ఇక్కడ జరిగిన 10 మ్యాచుల్లో (అన్ని ఫార్మాట్లు) భారత్ ఏకంగా 9 మ్యాచుల్లో విజయం సాధించింది. ఇక్కడ ఆడిన ఐదు వన్డేల్లో భారత్ ఓటమెరుగదు. లక్ష్యాన్ని ఛేదించినా, లక్ష్యాన్ని నిర్దేశించినా హోల్కర్ స్టేడియంలో భారత్‌కు తిరుగు లేదు. మంగళవారం వన్డేకు బ్యాట్‌కు, బంతికి సరసమైన పోటీ ఇచ్చే పిచ్‌ను సిద్ధం చేశారు. ఎటువంటి వర్షం సూచనలు లేవు. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తోంది.

తుది జట్లు (అంచనా) :

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య, వాషింగ్టన్ సుందర్, శార్దుల్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్.

న్యూజిలాండ్ : ఫిన్ అలెన్, డెవాన్ కాన్వే, హెన్రీ నికోల్స్, డార్లీ మిచెల్, టామ్ లేథమ్ (కెప్టెన్, వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, మైకల్ బ్రాస్‌వెల్, మిచెల్ శాంట్నర్, ఇశ్ సోధి, డౌగ్ బ్రాస్‌వెల్, లాకీ ఫెర్గుసన్.



రంజీ పోరుకు జడేజా

● నేడు తమళనాడుతో సౌరాష్ట్ర ఢీ

నవతెలంగాణ, హైదరాబాద్



భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా దేశవాళీ సర్క్యూట్‌లో సందడి చేయనున్నాడు. లిగమెంట్ గాయంతో సుమారు ఐదు నెలలు క్రికెట్‌కు దూరంగా ఉన్న రవీంద్ర జడేజా.. రానున్న భారత్, ఆస్ట్రేలియా బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్‌కు సన్నద్ధమవుతున్నాడు. మ్యాచ్ ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు రంజీ ట్రోఫీలో ఆడేందుకు సిద్ధమయ్యాడు. రంజీ ట్రోఫీ చివరి రౌండ్‌లో నేటి నుంచి సౌరాష్ట్ర, తమిళనాడు తలపడనున్నాయి. ఎలైట్ గ్రూప్-బి నుంచి సౌరాష్ట్ర ఇప్పటికే క్వార్టర్‌ఫైనల్స్‌కు అర్హత సాధించింది. అయినా, నాకౌట్ దశకు ముందు తమిళనాడుతో పరిపూర్ణ ప్రదర్శనపై ఆ జట్టు కన్నేసింది. రవీంద్ర జడేజా రాకతో ఈ మ్యాచ్‌పై ఆసక్తి రెట్టింపు అయ్యింది. కెప్టెన్ ఉనద్కత్, చతేశ్వర్ పుజారా తమిళనాడుతో మ్యాచ్‌కు అందుబాటులో లేరు. తమిళనాడుతో మ్యాచ్‌కు ముందు చెన్నైలోని ఎం.ఏ చిదంబరం స్టేడియంలో జడేజా కఠోర సాధన చేశాడు. 'మళ్లీ మైదానంలో అడుగుపెట్టడం బాగుంది. రంజీ మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. జట్టుగా, వ్యక్తిగతంగా ఈ మ్యాచ్ బాగుంటుందని ఆశిస్తున్నాను. గాయంతో ఐదు నెలలు ఆటకు దూరమయ్యాను. 100 శాతం మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించటమే నా తొలి ప్రాధాన్యత. ఫిట్‌నెస్ పరంగా ఆ స్థాయికి చేరుకుంటే ఆ తర్వాత నైపుణ్యంపై దృష్టి పెట్టవచ్చు. ఎన్‌సీఏలో 20 రోజులు ఉన్నాను. బ్యాటింగ్, బౌలింగ్ సౌకర్యవంతంగా చేస్తున్నాను. కానీ మ్యాచ్ పరిస్థితులు పూర్తి భిన్నం. ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ముందు ఓ మ్యాచ్ అనుభవం అవసరం అనిపించింది. అందుకే రంజీ ట్రోఫీలో ఆడేందుకు సిద్ధమయ్యాను' అని రవీంద్ర జడేజా తెలిపాడు.

హైదరాబాద్, ఢిల్లీ పోరు : రంజీ ట్రోఫీలో సీజన్ చివరి మ్యాచ్‌కు హైదరాబాద్ రంగం సిద్ధం చేసుకుంది. ఎలైట్ గ్రూప్-బిలో అయిదు పరాజయాలతో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచిన హైదరాబాద్ నేడు ఉప్పల్ స్టేడియం వేదికగా ఢిల్లీతో ఢీకొట్టనుంది. ఈ సీజన్‌లో హైదరాబాద్, ఢిల్లీ ప్రదర్శన ఒకే తరహాలో సాగింది. రెండు జట్ల సెలక్షన్ ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. చెత్త ప్రదర్శనలో పోటీపడుతున్న హైదరాబాద్, ఢిల్లీ నేడు ముఖాముఖికి సై అంటున్నాయి. సీజన్ చివరి మ్యాచ్‌లోనైనా మెరుగైన ప్రదర్శన చేసేందుకు హైదరాబాద్ పోరాట స్ఫూర్తి చూపిస్తుందేమో చూడాలి

ప్రేక్షకులకు కిక్ ఇచ్చే హంట్



భరత్, శ్రీకాంత్, సుధీర్‌బాబు

సుధీర్ బాబు కథానాయకుడిగా భవ్య క్రియేషన్స్ పతాకంపై వి.ఆనంద ప్రసాద్ నిర్మించిన సినిమా 'హంట్'. శ్రీకాంత్, 'ప్రేమిస్తే' ఫేమ్ భరత్ ప్రధాన పాత్రల్లో నటించారు.

ఈ చిత్రానికి మహేష్ దర్శకత్వం వహించారు. రిపబ్లిక్ డే కానుకగా ఈనెల 26న థియేటర్లలో విడుదల కానుంది.


ఈ సందర్భంగా సోమవారం జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ, 'కృష్ణ గారు మనల్ని వదిలి వెళ్ళిన తర్వాత విడుదల అవుతున్న నా తొలి సినిమా 'హంట్'. నా ప్రతి సినిమా మార్నింగ్ షో తర్వాత ఆయన నుంచి నాకు ఒక ఫోన్ కాల్ వచ్చేది. ఇప్పుడు నేను అది మిస్ అవుతా. ఇన్నేళ్ళ నా సక్సెస్‌ఫుల్ ప్రయాణం మావయ్యకి అంకితం. ఈ సినిమాలో కొత్త పాయింట్ ఉంది. నిజాయితీగా చెప్పాలంటే ఏ హీరో అటెంప్ట్ కూడా చేయడు. వందల మంది సినిమా చూశారు. అందరికీ నచ్చింది. అర్జున్ ఎ, అర్జున్ బి... సినిమాలో నా క్యారెక్టర్ రెండు షేడ్స్‌లో ఉంటుంది. స్టంట్స్ విషయంలో నేను రిస్క్ చేశానని అందరూ అంటున్నారు. నా కంటే ముందు ఆనంద ప్రసాద్ రిస్క్ చేశారు. శ్రీకాంత్ అన్నయ్య మంచి వ్యక్తి. భరత్ ఫెంటాస్టిక్ యాక్టర్. దర్శకుడు మహేష్ సెట్‌లో మంచి వాతావరణం క్రియేట్ చేశాడు. ఇంతకు ముందు తెలుగులో ఎవరూ చేయని సినిమా 'హంట్'. సినిమా చూశాక స్పాయిలర్స్ ఇవ్వొద్దు. ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేస్తే విన్నింగ్ ఛాన్సులు ఎక్కువని నా ఫీలింగ్' అని తెలిపారు.

'ఈ నెల 26న మా సంస్థలో నిర్మించిన 'హంట్'ను ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నాం. ఇంగ్లీష్ టైటిల్‌తో వస్తున్న తెలుగు చిత్రమిది' అని నిర్మాత వి. ఆనంద ప్రసాద్ చెప్పారు. హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ, 'నేను 'హంట్' చేయడానికి కారణం భవ్య క్రియేషన్స్, సుధీర్ బాబు. దర్శకుడు మహేష్ క్లారిటీతో తీశాడు. సినిమాలో నాది పాజిటివ్ క్యారెక్టరా? నెగిటివ్ క్యారెక్టరా? అనేది సస్పెన్స్. నేను 'హంట్' చూశా. పెద్ద హిట్ అవుతుంది' అని తెలిపారు. 'సినిమా చూసిన తర్వాత నేను చాలా ఎగ్జైట్ అయ్యాను. ఈ 'హంట్'తో తెలుగులోకి మళ్ళీ రావాలని తీసుకున్న నిర్ణయం సరైనదని అనిపించింది. సినిమా చాలా బాగా వచ్చింది. మంచి థ్రిల్లర్ ఇది' అని 'ప్రేమిస్తే' ఫేమ్ భరత్ చెప్పారు.

> టీజర్, ట్రైలర్ చూసి ప్రేక్షకులు అప్రిషియేట్ చేస్తున్నారు. అందులో ఎక్కువ షేర్ మా హీరో సుధీర్ బాబుకు వెళుతుంది. ఇప్పటి వరకు చూసిన సుధీర్ బాబు కంటే బెస్ట్ సుధీర్ బాబును ఈ సినిమాలో చూస్తారు. శ్రీకాంత్‌తో పని చేయడం ఒక గౌరవం. భరత్ బాగా నటించారు. జిబ్రాన్ నేపథ్య సంగీతం సూపర్. ప్రేక్షకుల మీద మా 'హంట్' స్ట్రాంగ్ ఇంపాక్ట్ చూపిస్తుంది. యాక్షన్ సీక్వెన్సులు మాత్రమే కాదు... స్ట్రాంగ్ ఎమోషనల్ కంటెంట్ ఉంది. సుధీర్ బాబు ఫ్యాన్స్ అందరికీ ఇదొక ట్రీట్. 'విక్రమ్' సినిమాకు, మా 'హంట్'కు సంబంధం లేదు. ట్రైలర్ చూసి కథ ఊహించినా, థియేటర్లకు వచ్చిన మీకు కిక్ ఇస్తుంది. సినిమా బ్లాక్ బస్టర్.
>
> **- దర్శకుడు మహేష్**

నవచిత్రం

శైలేష్ కొలనుతో వెంకీ సినిమా



వెంకటేష్

వెంకటేష్ కథానాయకుడిగా నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై వెంకట్ బోయనపల్లి నిర్మించనున్న హై-బడ్జెట్ చిత్రం కోసం 'హిట్' ఫ్రాంచైజ్‌తో వరుస విజయాల్ని అందించిన దర్శకుడు శైలేష్ కొలనుతో చేతులు కలపనున్నారు.వెంకటేష్ నటించనున్న 75వ చిత్రమిది. 'శ్యామ్ సింగరాయ్' నిర్మాణంతో విజయవంతంగా అడుగుపెట్టిన నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి ఈ సినిమా ప్రొడక్షన్ నెం2గా రాబోతుంది. వెంకటేష్ కెరీర్‌లో ఇది అత్యంత భారీ బడ్జెట్ సినిమా కానుంది. ప్రీ లుక్ పోస్టర్‌లో వెంకటేష్ చేతిలో ఏదో పట్టుకున్న సిల్హౌట్ ఇమేజ్ కనిపిస్తుంది. అది గన్ కాదు.. మరి అదేంటో అనే విషయం ఈ నెల 25న తెలియనుందని మేకర్స్ ప్రకటించారు.

అజాత శత్రువు సూర్యనారాయణ



దామోదర ప్రసాద్, తమ్మారెడ్డి భరద్వాజ, ప్రసన్నకుమార్, సి.కళ్యాణ్

సూపర్ స్టార్ కృష్ణ, రెబల్ స్టార్ కృష్ణంరాజు, కైకాల సత్య నారాయణ, చలపతి రావు వంటి ప్రముఖులను కోల్పోయిన తెలుగు చిత్ర సీమ తాజాగా మరో ప్రముఖ నిర్మాత ఎ.సూర్యనారాయణని కోల్పోయింది. ఆయన సంతాప సభను ఫిల్మ్ ఛాంబర్‌లో నిర్మాతల మండలి, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సంతాప సభలో నిర్మాతలు సి.కళ్యాణ్, కె.ఎస్.రామారావు, ప్రసన్న కుమార్‌తో పాటు దామోదర్ ప్రసాద్, భరద్వాజ తమ్మారెడ్డి, నిర్మాత నహీం, శివ రామకృష్ణతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని ఆయన ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నిర్మాత సి. కళ్యాణ్ మాట్లాడుతూ,'సూర్య నారాయణ గారితో నాకు ఉన్న బంధం 30 ఏళ్లు. ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉన్నాను అని అంటే అది ఆయన పెట్టిన భిక్షే. ఇండస్ట్రీలో ఆయన అజాత శత్రువు' అని తెలిపారు. 'ఎన్టీఆర్‌తో చేసిన 'అడవి రాముడు' తెలుగు ఇండస్ట్రీకే అతి ముఖ్యమైన సినిమా. అలాంటి సినిమాను సూర్య నారాయణ నిర్మించారు' అని మరోనిర్మాత కె.ఎస్ రామారావు చెప్పారు. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ,'ఫిల్మ్ ఛాంబర్‌కి ఉన్న ప్రతి ఇటుకలో సూర్య నారాయణ భాగస్వామ్యం ఉంది. ఇండస్ట్రీకి ఇంకా ఏం చేయాలి.. అంటూ నిత్యం ఆలోచించే వ్యక్తి ఆయన' అని తెలిపారు.



వరలక్ష్మీ శరత్‌కుమార్, తమన్, రవిశంకర్, బాలకృష్ణ, గోపీచంద్ మలినేని, నవీన్ యెర్నేని, హనీ రోజ్

ప్రోత్సహిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు : బాలకృష్ణ

బాలకృష్ణ, గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'వీరసింహారెడ్డి'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నిర్మాతలు నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీగా నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈనెల 12న గ్రాండ్‌గా విడుదలై, అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకుంది. అన్ని చోట్లా రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్ సాధించి బాలకృష్ణ కెరీర్‌లోనే హయ్యెస్ట్ గ్రాసర్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్‌గా 'వీరసింహుని విజయోత్సవం' పేరుతో వేడుకలు నిర్వహించింది. ఈ వేడుకలో బాలకృష్ణ చేతుల మీదగా చిత్ర యూనిట్‌కు మెమెంటో ప్రదాన కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ,'దర్శకుడు గోపీచంద్ ఒక అద్భుతమైన కథని రాశాడు. ఇది ఒక గొప్ప ప్రయాణం. ఈ ప్రయాణంలో అద్భుతమైన సినిమా చేశాం. తెలుగు ప్రేక్షకులతో పాటు సినిమా అభిమానులు అద్భుతంగా వుందని ప్రసంశించారు. ఈ సినిమా లార్జర్ దెన్ లైఫ్ మూవీ. ఇన్ని రకాల పాత్రలు చేశానంటే అది నా అదృష్టం. ప్రేక్షకులు గొప్పగా ఆదరించారు. వీరసింహారెడ్డిలో ఒక విస్ఫోటనం జరిగింది. ఈ సినిమాని ఇంత పెద్ద విజయాన్ని చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మైత్రీ మూవీ మేకర్స్‌కి సినిమా అంటే ప్యాషన్. అందరి హీరోలతో సినిమాలు చేస్తున్నారు. ఎక్కడా రాజీపడకుండా సినిమానే ఊపిరిగా జీవిస్తున్న నిర్మాతలు రవి, నవీన్ గారు. ఒక మంచి సినిమాకి పని చేసి ఫలితం కోసం ఎదురుచూస్తున్న మాకు ప్రేక్షకులు ఇంత ఘన విజయం ఇచ్చారంటే, మా వెన్నుతట్టి ఇంకా ఇలాంటి మంచి సినిమాలు ఇవ్వండి అంటూ మమ్మల్ని పోత్సహిస్తున్న ప్రేక్షకదేవుళ్లందరికీ శిరస్సువంచి కృతజ్ఞతలు' అని చెప్పారు.

'ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు ఒక పండగలా ఉంటే, వీరసింహారెడ్డి మరో పండగ తీసుకొచ్చింది. మా సినిమాని ఇంతపెద్ద విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఈ అవకాశం ఇచ్చిన బాలకృష్ణ గారికి రుణపడి వుంటాను. ఒక ఫ్యాన్‌గా ఈ సినిమా తీశా. ఫ్యాన్స్, ఫ్యామిలీస్ కలిస్తేనే సినిమా ఇంత పెద్ద హిట్ అయ్యింది' అని దర్శకుడు గోపీచంద్ మలినేని అన్నారు. నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ,'ఇంత గొప్ప సినిమాని ఇచ్చిన బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేనికి కృతజ్ఞతలు. ఈ సినిమా ఎనిమిది రోజుల్లోనే బాలకృష్ణ హయ్యెస్ట్ గ్రాసర్‌గా నిలిచింది. ఇంకా లాంగ్ రన్ ఉంది' అని తెలిపారు. 'బాలకృష్ణతో 'అఖండ' తర్వాత, గోపి ఈ కథ చెప్పినప్పుడు నెక్స్ట్ లెవల్‌కి ఎలా తీసుకెళ్ళాలని అనుకున్నాను. గోపి మామూలుగా తీయలేదు. బాలయ్యని చూస్తేనే ఒక పూనకం వచ్చేస్తుంది. ఆయన సినిమాకి పని చేయడం ఒక గిఫ్ట్. సంక్రాంతికి రెండు విజయాలు అందుకున్న మైత్రీ మూవీ మేకర్స్‌కి అభినందనలు' అని తమన్ అన్నారు.

అందరూ గర్వపడే మైఖేల్

హీరో సందీప్ కిషన్ తొలి పాన్ ఇండియా చిత్రం 'మైఖేల్'. రంజిత్ జయకోడి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా నందమూరి బాలకృష్ణ ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసి, చిత్ర యూనిట్‌కి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సందీప్ కిషన్ మాట్లాడుతూ,' బాలకృష్ణ ట్రైలర్ చూసి 'అదిరిపోయింది' అని చెప్పారు. ఇది పూర్తిగా తెలుగు సినిమా. మన సినిమా. మనమందరం గర్వపడే సినిమా. రంజిత్ అద్భుతంగా తెరకెక్కించాడు. నిర్మాతలు ఇప్పటివరకూ ఎప్పుడూపెట్టని బడ్జెట్ ఈ సినిమా కోసం పెట్టారు. ఎప్పుడూ చేయని బిజినెస్ చేశారు' అని తెలిపారు. 'ఈ సినిమా చేయడానికి కారణం సందీప్ కిషన్. తనే ఫోన్ చేసి ఈ పాత్ర గురించి చెప్పి నాకు కొత్తగా ఉంటుందని చెప్పాడు. ఇలాంటి పాత్ర నేను ఎప్పుడూ చేయలేదు. ఖచ్చితంగా కొత్తగా క్రేజీగా ఉంటుంది. ఈ సినిమా తర్వాత సందీప్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటారు.

త్వరలో తెలుగులోనూ వేద



కన్నడ చలనచిత్ర పరిశ్రమలో శివ రాజ్‌కుమార్ ఒక ఐకానిక్ హీరో. ఆయన తాజాగా నటించిన చిత్రం 'వేద'. ఈ సినిమా ఆయనకు చాలా ప్రత్యేకమైన చిత్రం. ఆయన కెరీర్‌లో 125 చిత్రాల మైలురాయిగానే కాకుండా, ఆయన భార్య గీతా శివ రాజ్‌కుమార్ నేతృత్వం వహిస్తున్న సొంత నిర్మాణ సంస్థ గీతా పిక్చర్స్‌లో ఇది మొదటి వెంచర్‌గా కూడా కావడం విశేషం.

ఇటీవలే కన్నడలో విడుదలై సంచలనం సృష్టించిన ఈ సినిమా త్వరలో తెలుగులో రిలీజ్‌కు సిద్ధమవుతుంది. కంచి కామాక్షి కలకత్తా కాళీ క్రియేషన్స్ ద్వారా ఈ సినిమా తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్‌ను ఆవిష్కరించింది చిత్ర బృందం. ఎ.హర్ష దర్శకత్వం వహించిన ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామా చిత్రం కన్నడలో డిసెంబర్ 23న విడుదలైంది. శివన్న, ఘనవి లక్ష్మణ్, అదితి సాగర్, శ్వేత చంగప్ప, ఉమాశ్రీ తదితరులు నటించిన ఈ చిత్రానికి దర్శకత్వం :హర్ష నిర్మాత : గీతాశివరాజ్‌కుమార్, సినిమాటోగ్రఫీ : స్వామి జె గౌడ్, ఎడిటర్: దీపు ఎస్ కుమార్, సంగీతం: అర్జున్‌జన్య.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886